సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 14+20 వెల: ₹ 5.00
సంపుటి: 12
సంచిక: 269

శుక్రవారం 20-12-2019




'ప్రజా ప్రతినిధులు చేయాల్సింది రెండే, ప్రజా సేవలో సమర్థతను చాటుకోవడమా! లేక తప్పుకోవడమా!'


SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


## ఫోర్బ్స్ టాప్ స్టార్ విరాట్ కోహ్లి

**2019కి గాను అత్యధిక సంపాదనా పరుల జాబితా విడుదల చేసిన ఫోర్బ్స్ ఇండియా**

టాప్ 5లో అక్షయ్‌కుమార్, సల్మాన్‌ఖాన్, అమితాబ్, ధోని

6 నుంచి 10వ ర్యాంకు వరకు షారూఖ్, రణ్‌వీర్, ఆలియా, సచిన్, దీపిక

– వివరాలు ఫ్యామిలీ, స్పోర్ట్స్‌లో



### గాలేరు-నగరి రెండో దశ తొలి ప్యాకేజీలో రూ.35.3 కోట్లు ఆదా

**రూ.391.13 కోట్లతో టెండర్లకు ఆహ్వానం**

- రూ.371.43 కోట్లకు కోట్ చేసిన కాంట్రాక్టు సంస్థ.. గతంలో ఇవే పనులను రూ.406.73 కోట్లకు కట్టబెట్టిన టీడీపీ సర్కారు
- ఖజానాపై అప్పట్లో రూ.15.6 కోట్ల భారం
- ఇప్పుడు మొత్తంగా 9.03 శాతం తక్కువ ధరకే కాంట్రాక్టర్‌కు అప్పగింత

- వివరాలు 2లో

### ఫిరాయింపుల నిరోధక చట్టంలో లోపాలను సరిచేయాలి

- చట్టసభల అధ్యక్షుల సదస్సులో ఏపీ అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని

- వివరాలు 4లో

### మీరో, మేమో తేల్చుకుందాం..



- ఎక్కడికి రావాలో చెప్పండి.. సిద్ధంగా ఉన్నాం
- పోలీసులతో వేధింపులకు గురిచేస్తున్నారు
- టీడీపీ అధినేత చంద్రబాబు విమర్శ

- వివరాలు 3లో


NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE
Vencobb CHICKEN
సూచించిన నేటి గుడ్డు & చికెన్ విజయవాడ జోన్ ధరలు

| | | | | |
|---|---|---|---|---|
| గుడ్డ రిటైల్ ధర ₹ 66 డజన్ | ఫారం దగ్గర లైవ్ బర్డ్ | 96 కిలో | డ్రెస్డ్ స్కిన్‌తో | 171 కిలో |
| | రిటైల్ లైవ్ బర్డ్ | 118 కిలో | స్కిన్‌లెస్ | 195 కిలో |

Conditions Apply
వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది


# మానని గాయం.. అందించండి సాయం

**విభజనతో నష్టపోయాం.. పారిశ్రామిక, సేవా రంగాల్లో వృద్ధి లేదు • ఆదుకోవాలని 15వ ఆర్థిక సంఘానికి రాష్ట్ర ప్రభుత్వం విన్నపం**

విభజన వల్ల రాజధానిని కోల్పోయిన రాష్ట్రం ఏపీనే

అప్పట్లో కేంద్రం ఇచ్చిన హామీలు అమలు కాలేదు

ఇందుకు ప్రత్యేక యంత్రాంగం ఉండేలా చూడండి

ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందిగా సిఫార్సు చేయాలి

నేషనల్ సేవింగ్ ఇన్‌స్టిట్యూట్, కేంద్రం రుణాలు రూ.22,733 కోట్లు మాఫీ చేయాలి

జిల్లాల సంఖ్య ఆధారంగా నిధుల కేటాయింపు సరికాదు..

రాష్ట్ర సామాజిక, ఆర్థిక, వ్యవసాయ, పారిశ్రామిక, సేవ, ఆరోగ్య, విద్యా, మౌలిక రంగాలపై సమగ్ర వివరణ

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి వినూత్న కార్యక్రమాల అమలు తీరును వివరించిన సీఎం వైఎస్ జగన్, అధికారులు

అన్ని రంగాల్లో కోలుకోవాలంటే ఉదారంగా సహాయం చేయాలని విజ్ఞప్తి

2 లో




సమావేశంలో 15వ ఆర్థిక సంఘం చైర్మన్ ఎన్‌కే సింగ్, సీఎం వైఎస్ జగన్

### బాధ్యతాయుతమైన సిఫార్సులు చేస్తాం

- రాష్ట్ర ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలు చేపట్టింది
- 15వ ఆర్థిక సంఘం చైర్మన్ ఎన్‌కే సింగ్

2లో

నేషనల్ సేవింగ్ ఇన్‌స్టిట్యూట్, కేంద్రం రుణాలు రూ.22,733 వేల కోట్లు మాఫీ చేయాలని సిఫార్సు చేయాలి. గోదావరి – పెన్నా లింక్ వయా బొల్లాపల్లి రిజర్వాయర్ ప్రాజెక్టుకు తగిన నిధులు ఇచ్చేలా.. 2020 నుంచి 2025 వరకు స్థానిక సంస్థలకు రిసోర్స్ గ్యాప్ కింద రూ.40,543 కోట్లు ఇచ్చేలా సిఫార్సు చేయాలి. *- సీఎం వైఎస్ జగన్*

## 'నాడు–నేడు' పనుల్లో నాణ్యత ముఖ్యం

**స్కూళ్లలో బాత్‌రూములు, తాగు నీరు బాగుండాలి**



గ్రామాల పర్యటనలో నేనే స్వయంగా పరిశీలిస్తా

అధికారుల సమీక్షలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్

రెండో విడత జూన్ నుంచి పనులు ప్రారంభం కావాలి

'కనెక్ట్ టు ఆంధ్రా'కు 5 కార్పొరేట్ సంస్థల తోడ్పాటు

3 లో

## ట్రంప్‌పై అభిశంసనకు ప్రతినిధుల సభ ఆమోదం

**సెనేట్‌లో తేలనున్న భవిష్యత్తు.. అభిశంసనను ఎదుర్కొన్న మూడో అధ్యక్షుడు**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ఆ దేశ దిగువ సభ అభిశంసించింది. సెనేట్‌లోనూ అభిశంసన ఆమోదం పొందితే అధ్యక్షపదవి నుంచి ట్రంప్ దిగిపోవాల్సిందే. డెమొక్రాట్లు మెజారిటీగా ఉన్న ప్రతినిధుల సభలో విశ్వాసపరీక్షలో ట్రంప్‌పై రెండు అంశాల ప్రాతిపదికగా అవిశ్వాస తీర్మానం పెట్టారు. ట్రంప్ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డాడన్న ఆరోపణ ఒకటైతే, కాంగ్రెస్‌ను అడ్డుకున్నారనేది రెండో ఆరోపణ.

5లో



**ముగిసిన ఐపీఎల్-2020 వేలం**

## ప్యాట్ కమిన్స్‌పై కనకవర్షం

**రూ. 15 కోట్ల 50 లక్షలకు కొనుగోలు చేసిన కోల్‌కతా నైట్‌రైడర్స్**

- ఐపీఎల్–2020 సీజన్ కోసం గురువారం కోల్‌కతాలో జరిగిన వేలంలో ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ ప్యాట్ కమిన్స్ కోట్లు కొల్లగొట్టాడు. కోల్‌కతా నైట్‌రైడర్స్ అతడిని రూ. 15 కోట్ల 50 లక్షలకు సొంతం చేసుకుంది. ఐపీఎల్ చరిత్రలో ఒక విదేశీ ఆటగాడికి పలికిన అత్యధిక మొత్తం ఇదే కావడం విశేషం.
- మరో ఆస్ట్రేలియన్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ రూ. 10 కోట్ల 75 లక్షలు (పంజాబ్) పలకగా, దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ క్రిస్ మోరిస్‌కు రూ. 10 కోట్లు (బెంగళూరు) దక్కాయి. భారత క్రికెటర్లలో పీయూష్ చావ్లా (రూ. 6.5 కోట్లు –చెన్నై సూపర్ కింగ్స్)కు ఎక్కువ మొత్తం దక్కింది.




- హైదరాబాద్ రంజీ జట్టు వైస్ కెప్టెన్ సందీప్‌ను అతని కనీస ధర రూ. 20 లక్షలకు సన్‌రైజర్స్ కొనుగోలు చేసింది.
- మొత్తం 338 మంది ఆటగాళ్లు వేలంలో పాల్గొనగా 62 మందిని 8 ఫ్రాంచైజీలు ఎంచుకున్నాయి.

– స్పోర్ట్స్‌లో


చేనేత కార్మికులకు జగనన్న ఆపన్నహస్తం

వై.ఎస్.ఆర్ నేతన్న నేస్తం





మగ్గం ఉన్న ప్రతి చేనేత కుటుంబానికి ఏటా
రూ. 24,000
ఆర్థిక సహాయం




డిసెంబర్ 21న గౌరవ ముఖ్యమంత్రి
శ్రీ వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి గారి
చేతుల మీదుగా ప్రారంభం



శ్రీ మేకపాటి గౌతమ్ రెడ్డి
చేనేత, జౌళి, పరిశ్రమ శాఖల మంత్రి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

చేనేత కార్మికుల
స్థితిగతులను మార్చి...
మెరుగైన
జీవన ప్రమాణాలను
అందించడమే లక్ష్యంగా
ఈ అపూర్వ పథకానికి
జగనన్న ప్రభుత్వం
శ్రీకారం.

నేతన్నల
అవసరాల కోసం
చేయూత

మగ్గం ఉన్న ప్రతి కుటుంబానికి ఊరట.. దాదాపు
85 వేల
కుటుంబాలకు లబ్ధి



ప్రతి అడుగూ...ప్రజా సంక్షేమం దిశగా..
నేతన్న బతుకుల్లో వెలుగులు నింపే సంక్షేమ వరం

జారీచేసినవారు : కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం


epaper.sakshi.com

# మానని గాయం.. అందించండి సాయం

**విభజనతో తీవ్రంగా నష్టపోయాం..**
**పారిశ్రామిక, సేవా రంగాల్లో వృద్ధి లేదు**
**ఆదుకోవాలని 15వ ఆర్థిక సంఘానికి విన్నవించిన రాష్ట్ర ప్రభుత్వం**


తాడేపల్లి క్యాంప్ ఆఫీసులో రాష్ట్ర అధికారులతో మాట్లాడుతున్న 15వ ఆర్థిక సంఘ చైర్మన్ ఎన్‌కే సింగ్, సీఎం వైఎస్ జగన్

**సాక్షి, అమరావతి :** విభజన వల్ల ఆంధ్రప్రదేశ్ బాగా దెబ్బతిందని.. అశాస్త్రీయంగా, అన్యాయంగా రాష్ట్రాన్ని విభజించడం వల్ల రాజధానిని కోల్పోయామని 15వ ఆర్థిక సంఘానికి రాష్ట్ర ప్రభుత్వం వివరించింది. విభజన వల్ల రాజధానిని కోల్పోయిన రాష్ట్రం దేశంలో ఏపీ మాత్రమేనని స్పష్టం చేసింది. అన్ని రంగాల్లో రాష్ట్రం కోలుకోవాలంటే ఉదారంగా కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రాంట్ల రూపంలో నిధులు అందేలా సిఫార్సులు చేయాలని కోరింది. రాష్ట్ర పర్యటనకు వచ్చిన 15వ ఆర్థిక సంఘానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర పరిస్థితిని వివరించారు. రాష్ట్ర సామాజిక, ఆర్థిక, వ్యవసాయ, పారిశ్రామిక, సేవ, ఆరోగ్య, విద్యా, మౌలిక రంగాలపై అధికారులు సమగ్ర వివరాలు అందించారు. గురువారం ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో 15వ ఆర్థిక సంఘం చైర్మన్ ఎన్.కె.సింగ్, కార్యదర్శి అరవింద్ మెహతా, రవి కోటా తదితరులతో ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రావత్, విద్యా శాఖ కార్యదర్శి రాజశేఖర్, జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్, ఇంధన శాఖ కార్యదర్శి శ్రీకాంత్, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి రజత్ భార్గవ తదితర అధికారులు ఆయా రంగాలపై సవివరమైన ప్రజెంటేషన్ ఇచ్చారు.

## ఇదీ ప్రభుత్వ పని తీరు

**పౌష్టికాహార లోపం నివారణపై దృష్టి**

బియ్యం నాణ్యతను పెంచాం. స్వర్ణ రకం బియ్యాన్ని అందిస్తున్నాం. శ్రీకాకుళంలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టాం. వచ్చే ఏప్రిల్ నాటికి అన్ని జిల్లాల్లో అందిస్తాం. బియ్యాన్ని ప్యాక్ చేసి ఇస్తున్నాం. ఈ బియ్యంలో ఖనిజ లవణాలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్యాక్ చేసేచోటే వీటిని బియ్యంలో కలిపేలా ముందుకు సాగుతున్నాం. రాష్ట్రంలో పౌష్టికాహారం లోపం అధికంగా ఉన్న 77 గిరిజన సబ్ ప్లాన్ మండలాల్లో మంచి పౌష్టికాహారం అందించేందుకు కృషి చేస్తున్నాం. కేంద్రం ఇస్తున్న దానికంటే మరో 3 రెట్లు రాష్ట్ర ప్రభుత్వం దీనికి నిధులు ఖర్చు చేస్తోంది.

**ప్రతిష్టాత్మకంగా నాడు–నేడు, ఇంగ్లిష్ మీడియం**

స్కూళ్లలో కనీస సదుపాయాలను మెరుగు పరుస్తున్నాం. 9 రకాల సదుపాయాల్ని కల్పిస్తున్నాం. ఇంగ్లిష్ ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తున్నాం. సుమారు 45 వేల ప్రభుత్వ స్కూళ్లలో నాడు– నేడు కింద వీటిని చేపడుతున్నాం. వచ్చే విద్యా సంవత్సరం.. 1 నుంచి 6వ తరగతి వరకు ఇంగ్లిష్ మీడియంలో బోధన ప్రారంభిస్తున్నాం. ఆ తర్వాత ఒక్కో ఏడాది ఒక్కో తరగతి పెంచుకుంటూ వెళతాం. ప్రతి ప్రభుత్వ పాఠశాలను ఇంగ్లిష్ మీడియం స్కూల్‌గా మారుస్తున్నాం. నిరక్షరాస్యతను నిర్మూలించడానికి పిల్లల తల్లుల్లో స్ఫూర్తి నింపేలా చర్యలు తీసుకుంటున్నాం.అమ్మ ఒడి కార్యక్రమాన్ని భారీ ఎత్తున చేపడుతున్నాం. పిల్లలను బడికి పంపే తల్లులకు ఏటా రూ.15 వేలు ఇస్తాం. దీనివల్ల డ్రాప్ అవుట్ శాతం పూర్తిగా తగ్గుతుంది. హయ్యర్ ఎడ్యుకేషన్‌లో కూడా మార్పులు తీసుకువస్తున్నాం. ప్రతి కోర్సు కూడా ఉద్యోగం, ఉపాధి నిచ్చేలా పాఠ్యప్రణాళికను రూపొందిస్తున్నాం. పేద విద్యార్థులు ఎంత వరకు చదువుకుంటే అంత వరకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తున్నాం. దీనికి తోడు హాస్టల్, వసతి కోసం ఏటా రూ.20 వేలు ఇస్తున్నాం.

**పోలవరం ప్రాజెక్టుకు నిధులు ఇవ్వండి**

పోలవరం ప్రాజెక్టు పనులు వేగంగా పూర్తి చేయాల్సి ఉంది. నిర్మాణ పనుల కోసం సుమారు రూ.12 వేల కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది. ఆర్ అండ్ ఆర్ కోసం రూ.33 వేల కోట్లు అవసరం. నిర్మాణ పనులు ఒక వైపు పూర్తి చేస్తున్న కొద్దీ.. మరోవైపు పునరావాస చర్యలను అంతే వేగంగా చేపట్టాల్సి ఉంటుంది. నీటి మట్టం 41.15 మీటర్ల ఎత్తుకు చేరింది. వరదలు వచ్చినప్పుడు చాలా ప్రాంతాలు మునిగి పోతున్నాయి. పనులు జరుగుతున్న సమయంలోనే ఇక్కడ పునరావాస పనులు కూడా చేపట్టాల్సి ఉంది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో పునరావాస పనుల కోసం రూ.10 వేల కోట్లు, ప్రాజెక్టు నిర్మాణ పనుల కోసం రూ.6 వేల కోట్లు (మొత్తం రూ.16 వేల కోట్లు) కావాలి. బకాయిలను వెంటనే విడుదల చేయాలి.

**పరిపాలనలో సంస్కరణలు**

గ్రామ, వార్డు సచివాలయాలను తీసుకు వచ్చాం. ప్రతి 2 వేల జనాభాకు ఒక గ్రామ సచివాలయం ఉంది. ప్రభుత్వ పాలన అనేది నేరుగా గ్రామాలకు చేరింది. 10 మంది ఉద్యోగులు ఈ సచివాలయాల్లో ఉంటారు. ప్రతి 50 కుటుంబాలకు ఒక వలంటీర్‌ను ఏర్పాటు చేశాం. 1.3 లక్షల మందికి శాశ్వత ఉద్యోగాలు ఇచ్చాం. 2.6 లక్షలమంది వలంటీర్లు ఉన్నారు. ప్రతి పథకం ప్రజల గడపకు చేర్చడమే వారి పని. ప్రతి కార్యక్రమం కూడా పారదర్శకతతో, సంతృప్త స్థాయిలో చేయడానికి వీళ్లంతా తోడ్పడుతున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో సోషల్ ఆడిట్ కూడా జరుగుతుంది. అవినీతి లేకుండా, వివక్షకు తావు లేకుండా చేస్తున్నాం. స్కూలుకు టీచర్ వెళ్లకపోతే.. కచ్చితంగా వీళ్లంతా పరిశీలిస్తారు. మహిళా పోలీసులను కూడా పెడుతున్నాం.

**ఆరోగ్య రంగానికి పెద్ద పీట**

వైద్యం ఖర్చు వేయి దాటితే ఆరోగ్య శ్రీని అందిస్తున్నాం. సబ్ సెంటర్లు, పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, జిల్లా ఆస్పత్రులు, బోధనాసుపత్రులను నాడు – నేడు కింద అభివృద్ధి చేస్తున్నాం. టీచింగ్ ఆస్పత్రులను కూడా అభివృద్ధి చేస్తున్నాం. మొత్తంగా రూ.14 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. (చాలా దేశాల్లో ఆరోగ్య వ్యవస్థలు పారా మెడికల్ సిబ్బందిపై ఆధారపడి ఉన్నాయని ఆర్థిక సంఘం చైర్మన్ ఎన్‌కే సింగ్ పేర్కొనగా.. దీనిని దృష్టిలో ఉంచుకునే బోధనాసుపత్రుల్లో నర్సింగ్ కాలేజీలను పెడుతున్నామని సీఎం వివరించారు.)

**ఇళ్ల పట్టాలు, ఇళ్లు**

వచ్చే ఉగాది నాటికి 25 లక్షల మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వనున్నాం. ఏటా ఆరు లక్షల చొప్పున ఇళ్లు కడతాం. ఇల్లు లేని వ్యక్తి ఉండకూడదన్నది లక్ష్యం.

**గోదావరి – పెన్నా అనుసంధానం**

రాయలసీమ ప్రాజెక్టులకు వరద జలాలను తీసుకెళ్లే కాల్వలను విస్తరించాల్సి ఉంది. కృష్ణా నదికి వరద వచ్చే ఆ కొద్ది రోజుల్లోనే ప్రాజెక్టులు నింపాలి. ఇందు కోసం రూ.23 వేల కోట్లు ఖర్చు అవుతుందని అంచనా. మరోవైపు గోదావరి నుంచి ఏటా 3 వేల టీఎంసీల నీరు సముద్రంలో కలుస్తోంది. ఈ నీటిని కరువు ప్రాంతాలకు తరలించాల్సి ఉంది. కృష్ణా నదిలో శ్రీశైలానికి వచ్చే నీరు.. 47 సంవత్సరాల సగటు చూస్తే దాదాపు 1200 టీఎంసీలు ఉంది. గత 10 సంవత్సరాల సగటు చూస్తే శ్రీశైలంలోకి కృష్ణా నీరు 600 టీఎంసీలకు పడిపోయింది. గత ఐదేళ్లలో చూస్తే 600 టీఎంసీలు కూడా రావడం లేదు. 400 టీఎంసీలకు పడిపోయింది. ఈ నేపథ్యంలో గోదావరి నుంచి నీటిని బొల్లాపల్లికి, అక్కడ నుంచి బనకచర్లకు తరలించాల్సి ఉంటుంది. దీనికోసం రూ.60 వేల కోట్లు ఖర్చు అవుతుందని అంచనా. ఇది అత్యంత ముఖ్యమైన ప్రాజెక్టు. అలాగే పోలవరం ఎడమ కాల్వ నుంచి ఉత్తరాంధ్రకు నీళ్లు అందించే ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకానికి రూ.15 వేల కోట్లు అవసరం.

**విద్యుత్ సంస్కరణలు.. ఇతర పనులు**

డిస్కంలు రూ.20 వేల కోట్ల రుణ భారంతో ఇబ్బంది పడుతున్నాయి. రాష్ట్రంలో సుమారు 18.5 లక్షల పంపు సెట్ల ద్వారా రైతులు ఉచిత విద్యుత్ పొందుతున్నారు. ఏటా విద్యుత్ సబ్సిడీ కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.10 వేల కోట్లను ట్రాన్స్‌కోకు చెల్లిస్తోంది. ఈ మేరకు 10 వేల మెగావాట్లతో సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేసుకుంటే రూ.32 వేల కోట్లకుపైగా ఖర్చు అవుతుందని అంచనా. దీనివల్ల ప్రభుత్వంపై సబ్సిడీల భారం తగ్గుతుంది. ఆ దిశగా ఆలోచిస్తున్నాం. మరోవైపు భావనపాడు, మచిలీపట్నం, రామాయపట్నం పోర్టుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నాం. తాగు నీటి కోసం వాటర్ గ్రిడ్ ప్రాజెక్టును చేపడుతున్నాం. తొలి దశలో రూ.11,150 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా. 2049 – 50 నాటి డిమాండ్‌కు అనుగుణంగా దశల వారీగా చేపట్టే పనుల కోసం రూ.47,937 కోట్లు ఖర్చు చేయనున్నాం.


ఎన్‌కే సింగ్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న సీఎం వైఎస్ జగన్


ఎన్‌కే సింగ్ దంపతులకు జ్ఞాపికను బహూకరిస్తున్న సీఎం వైఎస్ జగన్ దంపతులు

## ఇదీ రాష్ట్ర పరిస్థితి..

- రాష్ట్ర విభజన వల్ల పారిశ్రామిక రంగం వాటా 25.2 నుంచి 23.4 శాతానికి, సేవా రంగం వాటా 44.6 నుంచి 43.0 శాతానికి పడిపోయింది.
- తలసరి ఆదాయం కేరళ, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణలతో పోలిస్తే ఏపీకి తక్కువ. తెలంగాణ తలసరి ఆదాయం రూ.2,05,696 అయితే ఏపీలో రూ.1,64,025 మాత్రమే. రెవెన్యూ షేర్ ఏపీలో 46 శాతం, తెలంగాణలో 54 శాతం.
- షెడ్యూలు 9లో ఉన్న ఆస్తుల విభజన ఇంకా జరగలేదు. షెడ్యూల్ 10లో 142 ఆస్తులు ఉంటే తెలంగాణకు 107, ఏపీకి 15 మాత్రమే వచ్చాయి. ఇంకా 20 ఆస్తులు తెలంగాణ, ఆంధ్ర చేతుల్లో ఉమ్మడిగా ఉన్నాయి. ఏపీ భవన్ విభజన కూడా ఇంకా జరగలేదు.
- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ, ఇక్రిశాట్ లాంటి ప్రఖ్యాత సంస్థలన్నీ హైదరాబాద్‌లోనే ఉండిపోయాయి. బీహెచ్‌ఈఎల్, ఈసీఐఎల్, హెచ్‌ఏఎల్ లాంటి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు ఆ రాష్ట్రంలోనే ఉండిపోయాయి. దీనివల్ల ఉద్యోగ అవకాశాలు తగ్గుముఖం పట్టాయి. 15 – 29 ఏళ్ల వయసున్న వారిలో నిరుద్యోగ శాతం ఏపీలో 22.8 శాతం ఉంటే.. దేశం మొత్తం మీద ఇది 20.6 శాతం మాత్రమే.
- తెలంగాణ డిస్కంల నుంచి ఏపీ జెన్‌కోకు రావాల్సిన రూ.5,127 కోట్లు, దీనిపై వడ్డీ రూ. 604.7 కోట్లు ఇంకా రాలేదు.
- మొత్తంమీద రాష్ట్రం ఆర్థిక అసమతుల్యతను ఎదుర్కొంటోంది. మిగులు నిధుల నుంచి లోటు ఎదుర్కొనే పరిస్థితిలోకి వచ్చాం. రాష్ట్రాన్ని పునర్ నిర్మించాల్సిన అవసరం ఉంది. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం సిఫార్సు చేయాలి. భౌగోళికంగా రాష్ట్రానికి కొన్ని సమస్యలు ఉన్నాయి. రాయలసీమ లాంటి ప్రాంతాలు నిరంతరం కరువుతో అల్లాడుతున్నాయి. కోస్తా ప్రాంతంలో 8 జిల్లాలపై తుపాన్లు తరచుగా దండెత్తుతున్నాయి.
- పట్టణీకరణ దేశ సగటుతో పోలిస్తే తక్కువ. దేశంలో పట్టణ జనాభా సగటున 31.16 శాతం అయితే ఏపీలో 29.6 శాతం మాత్రమే. వ్యవసాయాధారిత ఆర్థిక వ్యవస్థ, జీఎస్‌డీపీలో 34 శాతం. రాష్ట్రంలో 31.9 శాతం మంది పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారు.
- రెవెన్యూ లోటు భర్తీ కింద రూ.18,969.26 కోట్లు ఇవ్వాల్సి ఉండగా ఇప్పటి వరకూ రూ.3,979 కోట్లు మాత్రమే వచ్చాయి. వెనకబడిన జిల్లాల్లో చాలా ప్రాంతాలకు సాగు, రక్షిత తాగు నీరు లేదు. అక్షరాస్యత శాతం తక్కువగా ఉంది. ఆరోగ్య ప్రమాణాలు సరిగా లేవు. వెనుకబడిన జిల్లాలకు రూ.24,350 కోట్లు రావాల్సి ఉండగా ఇప్పటి వరకు రూ.1,050 కోట్లు మాత్రమే వచ్చాయి.
- విభజన చట్టం ప్రకారం దుగరాజపట్నంలో పోర్టు నిర్మించాల్సి ఉంది. 2018 కల్లా ఫేజ్–1 పూర్తి చేస్తామని చట్టంలో పేర్కొన్నారు. దీనికి ఇవ్వాల్సిన నిధులు ఇవ్వండి. రామాయపట్నం వద్ద పోర్టు నిర్మాణానికి ప్రయత్నాలు ప్రారంభించాం. తగిన సహాయం కోసం సిఫార్సు చేయాలి.
- ఇండస్ట్రియల్ ఇన్సెంటివ్‌లు, ట్యాక్స్ మినహాయింపులు కూడా చట్టంలో పెట్టారు. వాటిని వెంటనే అమలు చేసేలా చూడాలి. విభజన చట్టం ప్రకారం కడప స్టీల్ ప్లాంట్ ఏర్పాటును ప్రకటించాలి.
- విభజన హామీల అమలు కోసం కేంద్రంలో ప్రత్యేక యంత్రాంగం ఏర్పాటుకు సిఫార్సు చేయాలి. 2013 – 14 లో రాష్ట్రం అప్పు రూ.1,23,586 కోట్లు. 2018–19లో రాష్ట్రం అప్పు రూ.2,60,330 కోట్లు. జీఎస్‌డీపీలో రెవిన్యూ లోటు శాతం 2013 –14లో 2.4 శాతం, ఇప్పుడు 3.6 శాతం. జీఎస్‌డీపీలో రుణ నిష్పత్తి 2013–14లో 22.2 శాతం కాగా, ఇప్పుడు 28.2 శాతం ఉంది.

## విన్నవించిన ముఖ్యాంశాలు

- ప్రత్యేక హోదా కోసం సీఎం జగన్ చేసిన విజ్ఞప్తిని 15వ ఆర్థిక సంఘానికి రిఫర్ చేసినట్టుగా లోక్‌సభలో ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఈ నేపథ్యంలో హోదా ఇవ్వాల్సిందిగా ఆర్థిక సంఘం సిఫార్సు చేయాలి.
- పోలవరం ప్రాజెక్టు కింద రాష్ట్ర ప్రభుత్వం తన సొంత నిధుల నుంచి ఖర్చు చేసిన రూ.5,103 కోట్లు ఇంకా విడుదల చేయాల్సి ఉంది. సవరించిన ప్రాజెక్టు అంచనా రూ.55,548.87 కోట్లకు ఆమోదం తెలపాలి. వచ్చే ఆర్థిక సంవత్సరంలో పనుల కోసం, పునరావాస చర్యల కోసం వెంటనే రూ.16 వేల కోట్లు విడుదల చేయాల్సిందిగా సిఫార్సు చేయాలి. లేదంటే ప్రాజెక్టు నిర్మాణంలో సమస్యలు తలెత్తే అవకాశం ఉంది.
- రైతు భరోసా, వైఎస్సార్ ఆరోగ్య శ్రీ, జలయజ్ఞం, పెన్షన్ల పెంపు, అమ్మ ఒడి, విద్యా దీవెన, పేదలందరికీ ఇళ్లు, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, మద్య నియంత్రణ, దశల వారీ నిషేధం లాంటి కార్యక్రమాలను రాష్ట్రంలో అమలు చేస్తున్నాం. ఇందుకు తగిన ఆర్థిక సహాయం అందేలా కేంద్రానికి సిఫార్సు చేయాలి.
- జిల్లాల సంఖ్య ఆధారంగా వివిధ అభివృద్ధి కార్యక్రమాల కోసం, మౌలిక సదుపాయాలకు నిధులు కేటాయించడం సరికాదు. మెడికల్ కాలేజీలను జిల్లాల ప్రాతిపదికన కేటాయించరాదు. కనీసం పార్లమెంటు నియోజకవర్గాలను పరిగణనలోకి తీసుకోవాలని కేంద్రానికి సిఫార్సు చేయాలి.
- రాష్ట్రంలో ప్రతిపక్ష నేత హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 3,648 కిలోమీటర్ల పాదయాత్ర చేశారు. రెండు కోట్ల మందికిపైగా ప్రజలను కలుసుకున్నారు. క్షేత్ర స్థాయిలో అనేక అంశాలను ఆయన స్వయంగా తెలుసుకున్నారు. ప్రజల అవసరాలు, క్షేత్ర స్థాయిలో పరిస్థితిని స్వయంగా చూశారు. పాదయాత్రలో అధ్యయనం చేసిన అంశాల ఆధారంగా రాష్ట్ర సమగ్రాభివృద్ధికి, ప్రజల జీవన ప్రమాణాలు పెంచడానికి వినూత్న పథకాలను సీఎం హోదాలో చేపట్టారు. ఆ పథకాలకు కేంద్రం నుంచి ఉదారంగా నిధులు అందేలా సిఫార్సు చేసి, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి సహకరించాలి.

## బాధ్యతాయుతమైన సిఫార్సులు చేస్తాం
**ఎన్‌కే సింగ్**

రాష్ట్ర ప్రభుత్వం చాలా ముఖ్యమైన అంశాలను తమ దృష్టికి తీసుకు వచ్చిందని 15వ ఆర్థిక సంఘం చైర్మన్ ఎన్‌కే సింగ్ చెప్పారు. ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన 15వ ఆర్థిక సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. విభజన చట్టంలో పేర్కొన్న అంశాలు, అమలు తీరును పరిశీలించి బాధ్యతాయుతమైన సిఫార్సులు చేస్తామన్నారు. గతంలో వివిధ రాష్ట్రాలను విభజించినప్పుడు హామీల అమలు కోసం ప్రత్యేకంగా ఒక కమిటీ ఏర్పాటు చేశారని, ఇప్పుడు కూడా ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టానికి సంబంధించి అలాంటి ఏర్పాటు ఉంటే బాగుంటుందన్నారు. లేకపోతే.. ఈ అంశాలపై సరైన దృష్టి ఉండదన్నారు. బీహార్ పునర్ వ్యవస్థీకరణ సమయంలో కూడా విభజన చట్టం అమలుకు ప్రత్యేక యంత్రాంగం ఉందన్నారు. నీతి ఆయోగ్‌లో ఒకరిద్దరు సభ్యులతో ఏపీ విభజన సమస్యలపై ప్రత్యేక యంత్రాంగం ఉంటే బాగుంటుందని, దీనివల్ల చాలా వరకు మేలు జరుగుతుందని చెప్పారన్నారు. ఆర్థిక పరమైన అంశాలు చాలా వరకు ఉన్నందున నీతి ఆయోగ్ నుంచి ఒకరిద్దరు సభ్యులతో యంత్రాంగం ఉంటే బాగుంటుందని చెప్పారు. ముఖ్యమంత్రి ఈసారి ప్రధానిని కలిసినప్పుడు దీనిపై విజ్ఞప్తి చేస్తే బాగుంటుందని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం పలు వినూత్న కార్యక్రమాలను చేపట్టిందని, జాతీయ స్థాయిలో అమలు చేయదగ్గ అంశాలపై సిఫార్సు చేస్తామని ఆయన వివరించారు.

**మద్య నిషేధం మంచి నిర్ణయం**

దశల వారీ మద్య నిషేధం ఎంతో మంచి నిర్ణయమని 15వ ఆర్థిక సంఘం చైర్మన్ ఎన్‌కే సింగ్ అభినందించారు. బీహార్‌లో ఒకేసారి మద్య నిషేధం విధించడం వల్ల 2 లక్షలకుపైగా కేసులు వచ్చాయని, తాము దశల వారీగా మద్య నిషేధం చేస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆయనకు వివరించారు. ఈ ఏడాది 20 శాతం మద్యం దుకాణాలను తగ్గించామని, బార్లు కూడా 40 శాతం తగ్గించామని చెప్పారు. స్టార్ హోటళ్లకు మాత్రమే మద్యం పరిమితం చేసే దిశగా అడుగులు వేస్తామని వివరించగా ఆయన ప్రశంసించారు.

## శ్రీవారి సేవలో 15వ ఆర్థిక సంఘం చైర్మన్


తిరుమల శ్రీవారిని 15వ ఆర్థిక సంఘం చైర్మన్ ఎన్‌కే సింగ్ గురువారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఎన్‌కే సింగ్ దంపతులకు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, అడిషనల్ ఈవో ధర్మారెడ్డి. చిత్రంలో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ - తిరుమల

# గోవును పూజించి.. గోవిందుని దర్శించండి

**విశాఖ శారద పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి**

**తిరుపతి సెంట్రల్/తిరుమల:** గోవులను పూజించిన తరువాత తిరుమలలో గోవిందుడిని దర్శించుకోవడం ఎంతో ఉత్తమమైనదని విశాఖ శారద పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి అన్నారు. తిరుపతి అలిపిరి వద్ద నిర్మాణంలో ఉన్న సప్తగోప్రదక్షిణశాలను, గోవిజ్ఞాన కేంద్రం, గోతులాభారం, గోసదన్‌ను గురువారం సాయంత్రం ఆయన శారదపీఠం ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామితో కలిసి సందర్శించారు. గోప్రదక్షిణ శాలలో గోపాలకృష్ణుని విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ నేపథ్యంలో స్వామీజీ మీడియాతో మాట్లాడుతూ.. తిరుమలకు వాహనాల్లో వెళ్లేవారు కానీ, నడిచి వెళ్లే భక్తులు గానీ అలిపిరి వద్ద గోపూజ చేసుకునేందుకు వీలుగా టీటీడీ సప్తగోప్రదక్షిణశాల నిర్మించడం అభినందనీయమన్నారు. నిర్మాణపనులకు విరాళాలు అందించిన టీటీడీ పాలక మండలి ప్రత్యేక ఆహ్వానితులు శేఖర్ రెడ్డికి స్వామివారి ఆశీస్సులు ఉంటాయన్నారు.

**స్వామీజీని మర్యాదపూర్వకంగా కలిసిన టీటీడీ చైర్మన్**

శ్రీవారి దర్శనార్థం తిరుమలకు విచ్చేసిన స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి వారిని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో ఏవీ ధర్మారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. గోగర్భం సమీపంలోని శారదా పీఠానికి చేరుకుని స్వామీజీ ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం వైవీ సుబ్బారెడ్డి మీడియాతో మాట్లాడుతూ శ్రీవారి ఆలయంలో ఆగమశాస్త్రబద్ధంగా కైంకర్యాలు జరుగుతున్నాయని, ఇంకా ఎలాంటి చర్యలు చేపట్టాలనే విషయమై ఆగమ సలహాదారులు, ఆలయ ప్రధానార్చకులతో కలిసి స్వరూపానందేంద్రస్వామివారిని సంప్రదించామని తెలిపారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా రెండు రోజులు మాత్రమే వైకుంఠ ద్వార దర్శనం కల్పిస్తామన్నారు.


సప్తగోప్రదక్షిణశాలను పరిశీలిస్తున్న స్వరూపానందేంద్ర స్వామి, స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి, టీటీడీ పాలక మండలి ప్రత్యేక ఆహ్వానితులు శేఖర్‌రెడ్డి, ఈవో సింఘాల్, అదనపు ఈవో ధర్మారెడ్డి

## తెలంగాణ లోకాయుక్తగా జస్టిస్ సీవీ రాములు

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర లోకాయుక్తగా హైకోర్టు రిటైర్డు న్యాయమూర్తి జస్టిస్ చింతపంటి వెంకట రాములు, రాష్ట్ర మానవ హక్కుల సంఘం చైర్మన్‌గా హైకోర్టు రిటైర్డు జడ్జి జస్టిస్ గుండా చంద్రయ్య నియమితులయ్యారు. ఉప లోకాయుక్తగా జిల్లా, సెషన్స్ రిటైర్డ్ జడ్జి వొలిమినేని నిరంజన్‌రావు, హెచ్‌ఆర్సీ సభ్యులుగా జిల్లా, సెషన్స్ రిటైర్డ్ జడ్జి నడిపల్లి ఆనందరావు (జ్యుడిషియల్), ముహమ్మద్ ఇర్ఫాన్ మొయినొద్దీన్ (నాన్ జ్యుడిషియల్) నియమితులయ్యారు.

# గాలేరు-నగరి రెండో దశ తొలి ప్యాకేజీలో రూ.35.3 కోట్లు ఆదా

- రూ.391.13 కోట్ల వ్యయంతో టెండర్లు నిర్వహించిన సర్కారు
- 5.04 శాతం తక్కువగా రూ.371.43 కోట్లకు కోట్ చేసిన కాంట్రాక్టు సంస్థ
- ఇవే పనులను రూ.406.73 కోట్లకు సీఎం రమేష్ సంస్థకు కట్టబెట్టిన టీడీపీ సర్కార్
- ఖజానాపై అప్పట్లో రూ.15.6 కోట్ల భారం
- ఇప్పుడు మొత్తంగా 9.03 శాతం తక్కువ ధరకే కాంట్రాక్టర్‌కు అప్పగింత



**సాక్షి, అమరావతి**

గాలేరు-నగరి సుజల స్రవంతి పథకం రెండో దశ తొలి ప్యాకేజీ పనులకు రూ.391.13 కోట్ల అంచనా వ్యయంతో గురువారం ప్రభుత్వం నిర్వహించిన రివర్స్ టెండరింగ్ విజయవంతం అయ్యింది. 5.04 శాతం తక్కువ ధరకు కోట్ చేసిన కాంట్రాక్టు సంస్థ ఆ పనులను దక్కించుకుంది. ఎన్నికలకు ముందు ఇదే పనులను 3.99 శాతం అధిక ధరకు తన బినామీ అయిన సీఎం రమేష్‌కు చెందిన సంస్థకు అప్పటి సీఎం చంద్రబాబు కట్టబెట్టారు. దీంతో అప్పట్లో ఖజానాపై రూ.15.60 కోట్ల భారం పడింది. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ సర్కారు ఈ పనులను రద్దు చేసి, తాజాగా టెండర్లు నిర్వహించి.. 9.03 శాతం తక్కువ ధరకే కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించడం వల్ల ఖజానాకు రూ.35.3 కోట్లు ఆదా అయ్యాయి. సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వెలువడటానికి 2 నెలల ముందు సీఎం రమేష్‌కు లబ్ధి చేకూర్చేందుకు గాలేరు–నగరి రెండో దశలోని ఏడు ప్యాకేజీల కాంట్రాక్టర్లపై ఒత్తిడి తెచ్చి ఒప్పందాలను ‘ప్రీ–క్లోజ్’ చేసుకునేలా చంద్రబాబు చక్రం తిప్పారు.

**ఇదీ టెండర్ కథాకమామిషూ**

- మొదటి ప్యాకేజీ (ప్రధాన కాలువ 32.64 కిలోమీటర్ల నుంచి 66.15 కిలోమీటర్ల వరకు తవ్వకం.. పది వేల ఎకరాలకు నీళ్లందించేలా పిల్ల కాలువలు తవ్వడం) పనుల వ్యయాన్ని 2018–19 ధరల ప్రకారం రూ.391.13 కోట్లుగా నిర్ణయించి గత ప్రభుత్వం లంప్సమ్–ఓపెన్ పద్ధతిలో టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది.
- తక్కువ ధరకు కోట్ చేసిన కాంట్రాక్టు సంస్థలపై సాంకేతిక కారణాలతో అనర్హత వేటు వేసేలా అధికారులపై ఒత్తిడి తెచ్చింది. ఈ వ్యవహారంపై కాంట్రాక్టు సంస్థలు హైకోర్టును ఆశ్రయించాయి. న్యాయ విచారణ జరుగుతున్నా లెక్క చేయకుండా.. మొదటి ప్యాకేజీ పనులను 3.99 శాతం అధిక ధర (రూ.406.73 కోట్లు)కు సీఎం రమేష్‌కు చెందిన రిత్విక్ ప్రాజెక్ట్స్‌కు అప్పగించారు.
- రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వ హయాంలో టెండర్లు ఖరారు చేసి.. పనులు ప్రారంభించని కాంట్రాక్టు ఒప్పందాలను రద్దు చేసింది. గత ప్రభుత్వం నిర్ణయించిన రూ.391.13 కోట్ల విలువైన పనులకు ఈ నెల 2న టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది. గురువారం ఉదయం ప్రైస్ బిడ్ తెరవగా రెండు సంస్థలు షెడ్యూళ్లు దాఖలు చేశాయి.
- ప్రైస్ బిడ్, రివర్స్ టెండరింగ్‌లో 5.04 శాతం తక్కువ ధరకు (రూ.371.43 కోట్లు) కోట్ చేసిన కాంట్రాక్టు సంస్థకు పనులు అప్పగించాలని సిఫార్సు చేస్తూ కమిషనర్ ఆఫ్ టెండర్స్ (సీవోటీ)కు ప్రతిపాదనలు పంపుతామని ఎస్‌ఈ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మొత్తమ్మీద 9.03 శాతం తక్కువ ధరలకే ప్రస్తుతం కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించనున్నారు. దీని వల్ల ఖజానాకు రూ.35.3 కోట్లు ఆదా అయ్యాయి. ఇప్పటి దాకా రివర్స్ టెండరింగ్ ద్వారా ఆదా అయిన మొత్తం రూ.1567.89 కోట్లకు చేరింది.

## నేడు విజయవాడలో సెమీ క్రిస్మస్ వేడుకలకు సీఎం వైఎస్ జగన్

**సాక్షి, అమరావతి:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం విజయవాడలో జరిగే సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొననున్నారు. సాయంత్రం 5.30 గంటలకు ఏ వన్ ఫంక్షన్ హాల్‌లో ఈ వేడుకలు జరగనున్నాయి.



నాడు- నేడు కార్యక్రమంలో భాగస్వామ్యమవుతున్న వారందరినీ అభినందిస్తున్నా. అందరూ తలా ఒక చేయి వేయాలి. రాష్ట్రం ఆర్థికంగా చాలా ఇబ్బందుల్లో ఉంది. అలాగని, దృష్టి పెట్టాల్సిన అంశాలను విస్మరించలేం. ముఖ్యంగా విద్య, ఆరోగ్య రంగాలపై కచ్చితంగా దృష్టి పెట్టాల్సిందే. అందుకనే మీ అందరి సహకారం కోరుతున్నాం. మీరు చేస్తున్న సహాయాన్ని విస్మరించం. సహాయం చేస్తున్న వారి పేర్లు స్కూళ్లలో కూడా పెడతాం. ఈ కార్యక్రమం గురించి మీరు ఇతర సంస్థలకూ చెప్పాలి. తద్వారా అందరూ భాగస్వాములు కావాలి.

– సీఎం వైఎస్ జగన్

**ఇంగ్లిష్ మీడియం.. దేశ, విదేశీ సంస్థల సహకారం**

యూనివర్సిటీ ఆఫ్ షికాగో, సింగపూర్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్, యూనివర్సిటీ ఆఫ్ కాన్‌బెర్రా, కేంబ్రిడ్జ్ ఇంటర్నేషనల్, ఇంగ్లిష్ అండ్ ఫారెన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఇఫ్లు), రీజనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్, నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ ఎడ్యుకేషనల్ ప్లానింగ్, రీజనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లిష్, ఐఐటీ మద్రాస్, అన్నా యూనివర్సిటీలు పాఠ్యాంశాల తయారీపై సహకారం అందిస్తున్నాయి.

– సీఎం వైఎస్ జగన్‌తో అధికారులు



తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో పాఠశాల విద్యాశాఖ అధికారులతో జరిగిన సమీక్షలో మాట్లాడుతున్న సీఎం జగన్

## ‘నాడు-నేడు’ పనుల్లో

# నాణ్యత ముఖ్యం

### అధికారుల సమీక్షలో సీఎం వైఎస్ జగన్

**సాక్షి, అమరావతి :** ప్రభుత్వ స్కూళ్ల రూపు రేఖలు మార్చేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ‘నాడు–నేడు’ పనుల్లో నాణ్యత ముఖ్యమని, ఈ విషయంలో ఎక్కడా రాజీపడొద్దని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. స్కూళ్లలో బాత్‌రూములు రన్నింగ్ వాటర్‌తో పరిశుభ్రంగా ఉండాలని, ప్రతి పాఠశాలలో విద్యార్థులకు పరిశుభ్రమైన తాగునీరు అందేలా ఏర్పాట్లు ఉండాలని చెప్పారు. గ్రామాల పర్యటనలకు వెళ్లినప్పుడు తానే ఆయా ప్రాంతాల్లోని స్కూళ్లను స్వయంగా పరిశీలిస్తానని స్పష్టం చేశారు. ‘నాడు–నేడు’, ప్రభుత్వ స్కూళ్లలో ఆంగ్ల మాధ్యమం నేపథ్యంలో ఉపాధ్యాయులకు శిక్షణ.. తదితర అంశాలపై గురువారం ఆయన పాఠశాల విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. మొదటి విడతలో 15,715 పాఠశాలల్లో ‘నాడు–నేడు’ పనులు చేపడుతున్నామని, ఇందులో పాల్గొనే 1100 మంది ఇంజనీర్లకు 55 మంది మాస్టర్ ట్రయినర్ల ద్వారా శిక్షణ ఇచ్చామని అధికారులు వివరించారు. మండలాల స్థాయిలో 2010 మందికి, పేరెంట్స్ కమిటీల్లోని 50 వేల మందికి వచ్చే నెలలోపు శిక్షణ పూర్తి చేయనున్నామని తెలిపారు. పనుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని, అన్ని పనులు వంద శాతం నాణ్యతతో ఉండాలని సీఎం వారికి స్పష్టం చేశారు. రెండో విడతలో నాడు–నేడు కింద చేపట్టే పనులను జూన్ నుంచి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

### నాడు-నేడుకు అందరి సహకారం అవసరం

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నాడు–నేడు కార్యక్రమానికి సహకారం అందించేందుకు కార్పొరేట్ సంస్థలు ముందుకు వస్తున్నాయి. హెటిరో, వసుధ ఫార్మా, ఆదిలీల ఫౌండేషన్, రెయిన్ కార్బన్ లారస్ ల్యాబ్స్ సంస్థలు పాఠశాల విద్యాశాఖ గుర్తించిన 2,566 ప్రభుత్వ స్కూళ్లలో రూ.85.65 కోట్లతో నాడు–నేడు కింద అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నాయి. కనెక్ట్ టు ఆంధ్రా కార్యక్రమం కింద నాడు–నేడులో భాగస్వామ్యం అయ్యేలా గురువారం సీఎం వైఎస్ జగన్ సమక్షంలో 5 కార్పొరేట్ సంస్థలు రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ‘ప్రభుత్వ స్కూళ్లు దారుణమైన పరిస్థితుల్లో ఉన్నాయి. నాడు– నేడు ద్వారా వాటిని అభివృద్ధి చేస్తున్నాం. 45 వేలకుపైగా ప్రభుత్వ స్కూళ్లను రూ.12 వేల కోట్లతో అభివృద్ధి చేస్తున్నాం. ఇంగ్లిష్ ల్యాబ్‌లు, 9 రకాల సదుపాయాలను ప్రతి ప్రభుత్వ స్కూల్లోనూ కల్పిస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంను 1 నుంచి 6వ తరగతి వరకు వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రవేశపెడుతున్నాం. ఆ తర్వాత ఒక్కో ఏడాది ఒక్కో తరగతి పెంచుకుంటూ వెళ్తాం. ‘అమ్మ ఒడి’ ద్వారా పిల్లలను బడికి పంపే తల్లులను ఆదుకుంటున్నాం. 2011 జనాభా లెక్కల ప్రకారం 33% ఉన్న నిరక్షరాస్యతను గణనీయంగా తగ్గిస్తాం’ అని అన్నారు.

### విద్యా సంవత్సరం ఆరంభంలోనే బుక్స్, స్కూల్ కిట్లు

వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే నాటికి పుస్తకాలు సహా స్కూలు కిట్లను విద్యార్థులకు అందించాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెడుతున్నందున పాఠ్యాంశాల తయారీపైనా చర్చించారు. 94,889 మంది టీచర్లకు ఇంగ్లిష్ మీడియంలో బోధనపై శిక్షణ ఇస్తున్నామని అధికారులు తెలిపారు. ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఇంగ్లిష్‌లో మంచి పరిజ్ఞానం ఉందన్న విషయం శిక్షణ కార్యక్రమాల ద్వారా వెల్లడైందని, ఆంగ్లంలో బోధన పట్ల ఉపాధ్యాయులు ఉత్సాహంగా ఉన్నారని వివరించారు. స్కూళ్లలో 5, 6 తరగతుల్లోకి ప్రవేశించే విద్యార్థులకు సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మంత్రి ఆదిమూలపు సురేష్, ముఖ్యకార్యదర్శి బి.రాజశేఖర్, ప్రణాళికా శాఖ కార్యదర్శి విజయ్‌కుమార్, ప్రణాళికా శాఖ డిప్యూటీ సెక్రటరీ, కనెక్ట్ టు ఆంధ్రా సీఈఓ కోటేశ్వరమ్మ, నార్త్ అమెరికా ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి పి.రత్నాకర్, వసుధ ఫార్మా మేనేజింగ్ డైరెక్టర్ ఎం.వెంకట రామరాజు, లారస్ ల్యాబ్స్ సీఈవో చావా సత్యన్నారాయణ, హెటిరో డ్రగ్స్ ఎండీ వంశీకృష్ణ, రెయిన్ కార్బన్ సీజీఎం ఆదినారాయణస్వామి, సీఎఫ్ఎం జి.ఆర్.కుమార్, ఆదిలీల ఫౌండేషన్ నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్.ఆదినారాయణ పాల్గొన్నారు.



కనెక్ట్ ఏపీకి లారస్ ల్యాబ్స్ వైస్ ప్రెసిడెంట్ సి.నరసింహారావు రూ.75 లక్షల విరాళాన్ని సీఎం వైఎస్ జగన్‌కు అందజేశారు. కాగా, కనెక్ట్ ఏపీకి తన నెల వేతనాన్ని నార్త్ అమెరికా ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి పి.రత్నాకర్ కూడా అందజేశారు.

### మత్స్యకారుల ఇళ్ల నిర్మాణానికి సబ్సిడీ నిధులు

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలోని మత్స్యకారుల ఇళ్ల నిర్మాణానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ నిధులను మంజూరు చేసింది. 340 మంది లబ్ధిదారులకు సంబంధించి రూ. 2,44,80,000 మంజూరు చేస్తూ గృహ నిర్మాణ శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

## జేసీపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి

### ఆంధ్రప్రదేశ్ పోలీసు అధికారుల సంఘం డిమాండ్

**గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్)/చిత్తూరు అర్బన్/కడప అర్బన్:** ఏపీ పోలీసులను అవమానించేలా వ్యాఖ్యలు చేసిన మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం డిమాండ్ చేసింది. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జె.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. బూట్లు నాకే సంస్కృతి తమది కాదని, రాజకీయాల్లో ఆ స్థాయికి రావడానికి జేసీ ఎవరి బూట్లు నాకారో చెప్పాలన్నారు. చంద్రబాబు సమక్షంలోనే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తుంటే చంద్రబాబు నవ్వడం సిగ్గుచేటని.. ఆయన బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సంఘం ప్రధాన కార్యదర్శి ఎండీ మస్తాన్ ఖాన్, సంఘం నాయకులు స్వర్ణలత, కె.నాగిని, పి.శేషయ్య పాల్గొన్నారు.

**జేసీని కుక్కల వ్యాన్‌లో ఎర్రగడ్డ ఆసుపత్రికి తరలించాలి**

జేసీ వ్యాఖ్యలు ఆయన దివాళాకోరుతనానికి నిదర్శనమని చిత్తూరు జిల్లా పోలీసు సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ అన్నారు. పిచ్చికుక్కలా మాట్లాడుతున్న దివాకర్‌రెడ్డికు గొలుసులు వేసి కుక్కల వ్యానులో ఎక్కించి ఎర్రగడ్డ ఆసుపత్రికి తరలించాలన్నారు. కాగా, మాజీ ఎంపీ జేసీపై కేసులు నమోదు చేయిస్తామని పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నర్రెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉప్పుశంకర్, వాటం జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. జేసీని ఎర్రగడ్డ పిచ్చాసుపత్రిలో చేర్పించాలని పోలీసు అధికారుల సంఘం వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్ జేసీ కుటుంబసభ్యులకు సూచించారు.

### గణతంత్ర వేడుకల్లో ప్రదర్శనకు

## ఏపీ శకటం ఎంపిక

**సాక్షి, న్యూఢిల్లీ:** గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ప్రదర్శనకు ఆంధ్రప్రదేశ్ శకటం ఎంపికైంది. తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు, రాష్ట్ర శాస్త్రీయ నృత్యం కూచిపూడి, కొండపల్లి బొమ్మలు, కలంకారీ హస్తకళలతో కూడిన ఈ ప్రదర్శన శకటాన్ని గురువారం ఇక్కడ కేంద్ర రక్షణ శాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో నిర్వహించిన తుది సమావేశంలో ఎంపిక చేసినట్లు సమాచారం. దీనికి ఏపీ సమాచార శాఖ జాయింట్ డైరెక్టర్ పి.కిరణ్‌కుమార్, ఆర్టిస్ట్ మధు హాజరయ్యారు. తొలి సమావేశంలో మూడు థీమ్‌లను ఏపీ అధికారులు ప్రతిపాదించగా అధికారులు శ్రీవారి బ్రహ్మోత్సవాల థీమ్‌కు కొన్ని సూచనలు చేశారు. ఈ నేపథ్యంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రధాన ఆకర్షణగా, కూచిపూడి, కొండపల్లి అంబారీ, దశావతారాల బొమ్మలు, కలంకారీ హస్తకళలతో శకటాన్ని ఏపీ సమాచార శాఖ ప్రతిపాదించింది. తుది సమావేశంలో రక్షణ శాఖ అధికారులు ఈ శకటం ప్రదర్శనకు ఎంపిక చేసినట్లు సమాచారం. దీనిపై రక్షణ శాఖ నుంచి అధికారిక సమాచారం రావాల్సి ఉంది.

### మీరో, మేమో

# తేల్చుకుందాం..

- ఎక్కడికి రావాలో చెప్పండి సిద్ధంగా ఉన్నాం
- పోలీసులతో వేధింపులకు గురిచేస్తున్నారు
- రాష్ట్ర ప్రభుత్వంపై చంద్రబాబు విమర్శ



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రబాబు

**అనంతపురం:** ‘‘ధైర్యం ఉంటే పోలీసు వ్యవస్థను పక్కనపెడదాం, మీరో మేమో తేల్చుకుందాం. ఎక్కడికి రావాలో చెప్పండి సిద్ధంగా ఉన్నాం. మీమాట వినే పోలీసులతో వేధింపులకు గురి చేస్తున్నారు. అయినా ఫర్వాలేదు. భయపడతారు అనుకున్నారు. మనవాళ్లు ఇంకా కసితో రెచ్చిపోతున్నారు. ఎవరినీ వదిలిపెట్టను’’ అంటూ రాష్ట్ర ప్రభుత్వంపై ప్రతిపక్ష నేత చంద్రబాబు చెలరేగారు. అనంతపురం జిల్లా పర్యటనలో భాగంగా గురువారం రెండోరోజు వివిధ కేసులు నమోదైన టీడీపీ వారితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. తమ పార్టీ కార్యకర్తలపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అక్రమంగా కేసులు బనాయిస్తోందన్నారు. పోలీసులను అడ్డుపెట్టుకొని ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెప్పారు. ఇష్టానుసారంగా దాడులు చేస్తున్నారని విమర్శించారు. ఆర్నెల్లలో 650 దాడులు జరిగాయన్నారు. ఈరోజో, రేపో, ఎల్లుండో టీడీపీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని, నష్టపోయిన వారికి వడ్డీతో సహా పరిహారం కట్టించే బాధ్యత తనదని చెప్పారు.

**నేను అనుకుంటే వైఎస్సార్‌సీపీ నేతలు ఉండేవారా?**

వైఎస్సార్‌సీపీ వాళ్లు ఉండకూడదని తాను అప్పట్లో అనుకుని ఉంటే ఆ పార్టీలో ఒక్కరు కూడా మిగిలేవారు కాదన్నారు. ఒక రాజకీయ పార్టీ, మరో రాజకీయ పార్టీ కొట్లాడుకుంటే బలం ఏంటో తేలిపోతుందన్నారు. కొందరు పోలీసులు పనికట్టుకుని తమపై దాడులు చేస్తున్నారని చెప్పారు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేస్తే తమ వారి కేసులు తీసుకోవట్లేదన్నారు. సీఎం వ్యాపారాలు చేసుకుంటూ టీడీపీ నేతల ఆర్థిక మూలాలను దెబ్బ తీస్తున్నారని విమర్శించారు.










## 'అసభ్య పోస్టింగులపై చర్యలు తీసుకోవాలి



**సాక్షి, అమరావతి:** ఏపీఐఐసీ చైర్‌పర్సన్ ఆర్కే రోజాతోపాటు పలువురు మహిళా ఎమ్మెల్యేలు, పార్టీ మహిళా కార్యకర్తలపై సోషల్ మీడియాలో అసభ్య పోస్టింగ్‌లు పెడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ మహిళా నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు అదనపు డీజీపీ రవిశంకర్‌కు గురువారం ఫిర్యాదుచేశారు. దీనిపై ఆయన స్పందిస్తూ.. నిందితులు ఎంతటివారైనా శిక్షిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉభయగోదావరి, ప్రకాశం జిల్లాల మహిళా విభాగం సమన్వయకర్త పిల్లం గోళ్ల శ్రీలక్ష్మి, ఏపీ మాల కార్పొరేషన్ చైర్‌పర్సన్ అమ్మాజీ, నాగమణి, బొట్టా కనకదుర్గ, సుధారాణి, హిమబిందు, అనిత, శ్రీలక్ష్మి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

## బంద్ ప్రశాంతం



**సాక్షి, అమరావతి బ్యూరో:** అభివృద్ధి వికేంద్రీకరణ దృష్ట్యా రాష్ట్రానికి మూడు రాజధానులు ఉండొచ్చని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొనడంతో రాజధాని అమరావతి ప్రాంతంలో ఆందోళన మొదలైంది. సీఎం తన ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ తాడేపల్లి, మంగళగిరి, తుళ్లూరు మండలాల్లోని ప్రజలు కొందరు గురువారం బంద్ నిర్వహించారు. ఉదయాన్నే రోడ్లమీదకు వచ్చి పాఠశాలలు, వ్యాపార సంస్థలు, బ్యాంకులను మూసివేయించారు. సచివాలయం, హైకోర్టుకు వెళ్లే వాహనాలను అడ్డుకున్నారు. తుళ్లూరు, మందడంలో రైతులు రోడ్లపై బైఠాయించారు. రాజధానిని అమరావతిలోనే ఉంచాలని డిమాండ్ చేశారు. రాజధాని పరిధిలోని 29 గ్రామాల్లో బంద్‌కు పిలుపునిచ్చినా, కొన్ని గ్రామాల్లో ప్రజలు బంద్‌కు మద్దతునివ్వలేదు. తుళ్లూరు మండల పరిధిలోని వెంకటపాలెం, మందడం, తుళ్లూరులో మాత్రమే బంద్ సంపూర్ణంగా సాగింది. పాలన వికేంద్రీకరణపై రైతుల్లోనే భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. అమరావతిలో రాజధానిని టీడీపీ నాయకులు స్వలాభం కోసం ఉపయోగించుకున్నారు తప్పితే సామాన్యులెవరూ లబ్ధి పొందలేదని వారు పేర్కొంటున్నారు.

## శ్రీవారి సేవలో..

ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉమాదేవి గురువారం శ్రీవారిని దర్శించుకున్నారు. అధికారులు ఆమెకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి రంగనాయకుల మండపంలో శ్రీవారి ప్రసాదం, చిత్రపటాన్ని అందజేశారు. – తిరుమల



తిరుమల శ్రీవారిని పుష్పగిరి శంకరాచార్య మహాసంస్థానం పీఠాధిపతి జగద్గురు అభినవోద్దండ విద్యాశంకర భారతి స్వామీజీ గురువారం దర్శించుకున్నారు. ఆలయం వద్ద స్వామీజీకి టీటీడీ అదనపు ఈవో ధర్మారెడ్డి, ఆలయ అర్చకులు ఇస్తికఫాల్ స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. – తిరుమల



తిరుమల శ్రీవారిని సినీనటి సమంత దర్శించుకున్నారు. బుధవారం తిరుమలకు చేరుకున్న ఆమె గురువారం ఉదయం వీఐపీ విరామ సమయంలో శ్రీవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆమెకు ఆలయాధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. సమంతను చూసేందుకు అభిమానులు ఉత్సాహం చూపించారు. – తిరుమల



## నేడు ఏపీ సెట్ ఫలితాలు

**ఏయూక్యాంపస్(విశాఖ తూర్పు):** రాష్ట్రస్థాయి అర్హత పరీక్ష (ఏపీ సెట్) 2019 పరీక్ష ఫలితాలు శుక్రవారం విడుదల చేయనున్నట్లు ఏపీ సెట్ మెంబర్ సెక్రటరీ ఆచార్య కె.శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 10 గంటలకు పరీక్ష ఫలితాలను విడుదల చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. అభ్యర్థులు తమ ఫలితాలను ఏపీసెట్ వెబ్‌సైట్ www. apset.net.in నుంచి పొందవచ్చన్నారు.

# ఫిరాయింపుల నిరోధక చట్టంలో లోపాలను సరిచేయాలి

- **చట్టం అమల్లోకొచ్చి పాతికేళ్లయినా ఇష్టానుసారం ఫిరాయింపులు**
- **చట్టంలోని లోపాల్ని సవరించకపోతే పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థకే ప్రమాదం**
- **చట్టసభల అధ్యక్షుల సదస్సులో ఏపీ అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం**

**సాక్షి, అమరావతి**



''పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టంలో ఉన్న లోపాలను సాకుగా తీసుకుని ఈ చట్టం అమలులోకి వచ్చిన 25 ఏళ్ల తరువాత కూడా యథేచ్ఛగా ఎమ్మెల్యేలు, ఎంపీలు ఒక పార్టీ నుంచి మరో పార్టీలోకి ఫిరాయిస్తున్నారు. ఇలా పార్టీ ఫిరాయించిన శాసనసభ్యుడిని తక్షణమే అనర్హుడిగా ప్రకటించేందుకు వీలుగా ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని సవరించాల్సిన ఆవశ్యకత ఎంతయినా ఉంది'' అని ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అభిప్రాయపడ్డారు. డెహ్రాడూన్‌లో రెండు రోజులుగా జరుగుతున్న అఖిల భారత చట్టసభల అధ్యక్షుల(ప్రిసైడింగ్ అధికారుల) సదస్సులో గురువారం ఆయన ప్రసంగించారు. 'ఫిరాయింపుల నిరోధక చట్టం–సంస్కరణల ఆవశ్యకత' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. చట్టంలోని లోపాలను తొలగించకపోతే భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్‌లో 2014–19 మధ్య కాలంలో జరిగిన ఎమ్మెల్యేల ఫిరాయింపులను ఆయన ఉదహరిస్తూ.. రాజ్యాంగ విలువలను అపహాస్యం చేసేవిగా ఇవి ఉన్నాయన్నారు. ఫిరాయించిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని ఎన్నిసార్లు ఫిర్యాదులు వచ్చినా అప్పటి సభాపతి వాటిని పట్టించుకోకపోవడం రాజ్యాంగ సూత్రాలను నిర్లక్ష్యం చేయడమేనన్నారు.

**జగన్ నిర్ణయానికి అన్ని పార్టీలూ మద్దతు తెలపాలి**

శాసనసభా సభ్యత్వానికి రాజీనామా చేయకుండా పార్టీలోకి ఇతర పక్షాలకు చెందిన ఏ సభ్యుడిని అనుమతించబోనని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న విలువలతో కూడుకున్న నిర్ణయానికి అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలపాలని తమ్మినేని కోరారు. పార్టీ ఫిరాయింపులపై వచ్చిన ప్రతి ఫిర్యాదును కచ్చితంగా ఇన్ని రోజుల వ్యవధి లోపల పరిష్కరించి తీరాలన్న నిబంధనను చట్టంలో చేర్చాలని సూచించారు. 'స్వచ్ఛందంగా సభ్యత్వాన్ని వదులుకోవడం' అన్న అంశానికి కచ్చితమైన నిర్వచనాన్ని కూడా చట్టంలో పొందుపర్చాలన్నారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టంలోని 'విలీన' నిబంధనను కూడా స్పష్టంగా నిర్వచించాల్సి ఉంటుందని ప్రతిపాదించారు. సభాపతులు సరైన న్యాయబద్ధమైన నిర్ణయాలను తీసుకోకపోవడం వల్లే స్పీకర్ల వ్యవస్థకు చెడ్డపేరు వస్తుందన్నారు. 18, 19 తేదీల్లో నిర్వహించిన ఈ సదస్సులో చట్టసభల నిర్వహణకు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చలు జరిగాయి.

# యువత చేతుల్లోనే జాతీయ సమైక్యత

**నేషనల్ రోలర్ స్పోర్ట్స్ ప్రారంభించిన గవర్నర్**

విశాఖ స్పోర్ట్స్

**జా**తీయ సమైక్యతను కాపాడాల్సిన బాధ్యత యువత చేతుల్లోనే ఉందని రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. విశాఖ సాగర తీరంలోని వుడా పార్క్ రింక్‌లో ఏర్పాటు చేసిన 57వ నేషనల్ రోలర్ స్పోర్ట్స్ చాంపియన్‌షిప్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పోటీల్లో పాల్గొంటున్న స్కేటర్లను ఉద్దేశించి మాట్లాడుతూ క్రమశిక్షణ అనేది క్రీడల ద్వారా వస్తుందన్నారు. యువత తమ చుట్టూ ఉండే సమాజం పట్ల అవగాహన కలిగిఉండాలని ఉద్బోధ చేశారు. ఇప్పటికే కాడెట్ నేషనల్స్ పూర్తి కాగా గురువారం నుంచి జూనియర్ నుంచి సీనియర్స్ కేటగిరీల్లో స్పీడ్, ఆర్టిస్టిక్, రోలర్‌హాకీ, ఇన్‌లైన్ హాకీ, ఇన్‌లైన్ ఫ్రీస్టయిల్, స్కేట్‌బోర్డ్, రోలర్ ఫ్రీస్టయిల్ తదితర అంశాల్లో పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తొలుత రాష్ట్ర యువజన సర్వీసులు, పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత ఆరు నెలల్లోనే రూ. రెండు కోట్లు క్రీడాకారులకు నజరానాగా ఇచ్చిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి స్వతహాగా క్రీడాకారుడు కావడంతో క్రీడల అభివృద్ధికి ఇతోధికంగా కృషిచేస్తున్నారన్నారు. వీఎంఆర్‌డీఏ చైర్మన్ ద్రోణంరాజు శ్రీనివాసరావు, స్కేటింగ్ సమాఖ్య ప్రతినిధులు తులసీరామ్, నరేష్‌కుమార్, టోర్నీ నిర్వాహక కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



సావనీర్‌ను విడుదలచేస్తున్న గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, డీజీపీ, నగర సీపీ

### పోలీస్ టెన్నిస్ పోటీలు ప్రారంభం

విశాఖ వేదికగా 20వ ఆలిండియా పోలీస్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌ను రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లా అండ్ ఆర్డర్ కాపాడటంలోనే కాకుండా విశాఖ నగరాన్ని అందంగా ఉంచేందుకు పోలీసులు చేస్తున్న కృషిని అభినందించారు. తొలుత నగర సీపీ ఆర్కే మీనా మాట్లాడుతూ దేశంలోని 18 జట్లు ఈ టోర్నీలో పాల్గొంటున్నాయన్నారు. కార్యక్రమంలో ఏపీ డీజీపీ దామోదర్ గౌతమ్ సవాంగ్, అదనపు డీజీపీ ఎన్.శ్రీధర్‌రావు పలువురు పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# 'ఉపాధి'లో రాష్ట్రానికి నాలుగు అవార్డులు

**కేంద్రమంత్రి చేతుల మీదుగా అందుకున్న రాష్ట్ర అధికారులు**

**సాక్షి, న్యూఢిల్లీ/అమరావతి:** ఉపాధి హామీ పథకం అమలులో అత్యుత్తమ పనితీరు కనబరిచిన ఆంధ్రప్రదేశ్.. నాలుగు అవార్డులు కైవసం చేసుకుంది. ఢిల్లీలోని జాతీయ వ్యవసాయ శాస్త్ర అకాడమీ (ఎన్ఏఎస్‌సీ)లో జరిగిన ఓ కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ ఈ అవార్డులు ప్రదానం చేశారు. పారదర్శకత, జవాబుదారీతనంలో మొదటిస్థానం, సుపరిపాలన సూచికల అమలులో మొదటి స్థానం సాధించినందుకుగాను అవార్డులను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ జీకే ద్వివేది, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఎం.గిరిజా శంకర్ అవార్డులు అందుకున్నారు. అలాగే, ఉత్తమ జిల్లా అవార్డు శ్రీకాకుళం సాధించింది. జిల్లా కలెక్టర్ జె.నివాస్, డ్వామా పీడీ హెచ్.కూర్మారావు అవార్డులు స్వీకరించారు. వ్యక్తిగత అవార్డుల్లో భాగంగా మండల స్థాయిలో జీఐఎస్ అసెట్ సూపర్ వైజర్ అవార్డును వైఎస్సార్ జిల్లా బద్వేల్ మండలం..



మైదాన ప్రాంతం కేటగిరీలో సాధించింది. ఈ అవార్డును మండలాభివృద్ధి అధికారి ఏకే రామకృష్ణయ్య అందుకున్నారు. కేటగిరీ–బి కింద శిక్షణలో ఉత్తమ పనితీరు కనబరిచినందుకు రాష్ట్రస్థాయి అవార్డును అధికారులు అందుకున్నారు. జాతీయ రూరల్ మిషన్ కింద జియో స్పేషియల్ ప్లాన్ డ్రాఫ్ట్‌కు గాను కంబదూరు క్లస్టర్ మొదటి స్థానంలో నిలిచింది. గ్రామీణ ప్రాంతాల్లో పట్టణ సదుపాయాల కల్పన ముఖ్యోద్దేశంగా కేంద్రం ఈ పథకాన్ని అమలుచేస్తోంది. మొదటి స్థానం సాధించినందుకు గాను కేంద్రమంత్రి చేతుల మీదుగా ద్వివేది, గిరిజా శంకర్ అవార్డులు అందుకున్నారు. అవార్డులందుకున్న అధికారులను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అభినందించారు.

- **బెంగళూరులో ఓ మహిళా కండక్టర్‌పై ఇద్దరు దుండగులు గురువారం యాసిడ్ దాడికి పాల్పడ్డారు. ఆమె ముఖం, చేతులకు తీవ్రగాయాలయ్యాయి.**

## అధికార వికేంద్రీకరణతోనే అభివృద్ధి

**వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అంబటి రాంబాబు**



**సాక్షి, అమరావతి:** అధికార వికేంద్రీకరణ అన్నది అభివృద్ధి చెందుతున్న సమాజంలో చాలా అవసరమని, ఒకే ప్రాంతంలో అభివృద్ధి జరగడం, సంపద పెరగడం సమంజసం కాదని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అంబటి రాంబాబు అభిప్రాయపడ్డారు. రాష్ట్రానికి మూడు రాజధానులు అవసరం రావచ్చని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన ప్రకటనపై దేశవ్యాప్తంగా చాలాచోట్ల హర్షం వ్యక్తమవుతోందన్నారు. ముఖ్యమంత్రి నిర్ణయం ఐదు కోట్ల మంది రాష్ట్ర ప్రజలకు మేలు చేస్తుందని ఆయన తెలిపారు. సీఎం చెప్పిన ప్రతిదాన్ని వ్యతిరేకించటం చంద్రబాబుకు అలవాటుగా మారిందని దుయ్యబట్టారు. వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం మీడియాతో మాట్లాడారు.

**రాజధాని అంటే నగరాల నిర్మాణం కాదు..**

మూడు రాజధానులు అంటే మూడు నగరాలు నిర్మించడం కాదనే విషయాన్ని చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు అర్థంచేసుకోవాలని అంబటి హితవు పలికారు. రాజధాని అంటే ఒక శాసనసభ, ఒక హైకోర్టు, ఒక సచివాలయం, వారు నివసించే ఇళ్లు.. ఇలా ముఖ్యమైన భవనాలు నిర్మించడమని స్పష్టంచేశారు. ఆర్థికంగా చితికిపోయిన రాష్ట్రానికి తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం పొందేలా చేయాల్సిన అవసరం ఉందన్నారు.

## ఆ కంపెనీలకు చెల్లింపులన్నీ చేస్తాం..

**సాక్షి, అమరావతి:** పవన, సౌర విద్యుత్ కంపెనీలకు చేయాల్సిన చెల్లింపులు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం తరఫున రాష్ట్ర అడ్వొకేట్ జనరల్(ఏజీ) ఎస్.శ్రీరామ్ హైకోర్టుకు నివేదించారు. ఈ విషయంలో సింగిల్ జడ్జి ఇచ్చిన ఆదేశాలకు తాము కట్టుబడి ఉన్నామన్నారు. నెల రోజుల్లో ఈ సమస్య పరిష్కారం అవుతుందని, చెల్లింపు విషయంలో ఎలాంటి సమస్య ఉండబోదని వివరించారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు.. పవన, సౌర విద్యుత్ కంపెనీలకు చేయాల్సిన చెల్లింపులకు సంబంధించిన పూర్తి వివరాలతో ఓ అఫిడవిట్ దాఖలు చేయాలని శ్రీరామ్‌కు స్పష్టం చేసింది. అలాగే సౌర విద్యుత్ కంపెనీల నుంచి విద్యుత్ ఎందుకు కొనుగోలు చేయడం లేదో కూడా ఆ అఫిడవిట్‌లో పొందుపరచాలని సూచించింది. తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి(సీజే) జస్టిస్ జితేంద్ర కుమార్ మహేశ్వరి, న్యాయమూర్తి జస్టిస్ ఎం.వెంకటరమణలతో కూడిన ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

**ఇప్పటికే రూ.200 కోట్లు విడుదల**

ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్‌సీ) ముందు విద్యుత్ కొనుగోలు ఒప్పందాల(పీపీఏ) వివాదం తేలేంత వరకు పవన, సౌర విద్యుత్ కంపెనీలు ఉత్పత్తి చేసిన విద్యుత్‌కు ఒక్కో యూనిట్‌కు రూ.2.43, రూ.2.44 చొప్పున చెల్లించాలంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ పలు పవన, సౌర విద్యుత్ కంపెనీలు అప్పీళ్లు దాఖలు చేశాయి. ఈ అప్పీళ్లపై గురువారం సీజే నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. ఏజీ శ్రీరామ్ స్పందిస్తూ.. ఈ కంపెనీలకు చెల్లింపుల నిమిత్తం ఇప్పటికే రూ.200 కోట్లు విడుదల చేశామని చెప్పారు. నెలలో సమస్య పరిష్కారమవుతుందన్నారు. గ్రిడ్ సమస్యల వల్లే సౌర విద్యుత్‌ను తీసుకోలేకపోతున్నామే తప్ప, ఇందులో ఎటువంటి దురుద్దేశాలు లేవన్నారు. పీపీఏల విషయంలో ఏపీఈఆర్‌సీ న్యాయ పరిధిపై పవన, సౌర విద్యుత్ కంపెనీలు అభ్యంతరం వ్యక్తం చేస్తూ దాఖలు చేసిన అనుబంధ పిటిషన్లపై విచారణ ఫిబ్రవరి 6వ తేదీకి వాయిదా పడింది.

## కృష్ణకిషోర్‌పై దర్యాప్తు నిలుపుదలకు హైకోర్టు నిరాకరణ

**సాక్షి, అమరావతి:** ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసినందుకు, ఇతర అక్రమాలకు పాల్పడినందుకు ఐఆర్ఎస్ అధికారి జాస్తి కృష్ణకిషోర్‌పై సీఐడీ అధికారులు నమోదుచేసిన కేసులో దర్యాప్తు నిలుపుదలకు హైకోర్టు నిరాకరించింది. దర్యాప్తును యథాతథంగా కొనసాగించుకోవచ్చని సీఐడీ అధికారులకు స్పష్టం చేసింది. అయితే కృష్ణకిషోర్‌ను అరెస్ట్ చేయవద్దని.. ఈ వ్యవహారానికి సంబంధించి పూర్తివివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని సీఐడీ అధికారులను ఆదేశించింది. తదుపరి విచారణను వచ్చే నెలకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు గురువారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేశారు. తనపై రాష్ట్ర సీఐడీ అధికారులు నమోదుచేసిన కేసును కొట్టేయాలని కోరుతూ కృష్ణకిషోర్ హైకోర్టును ఆశ్రయించారు. గురువారం మధ్యాహ్నం అత్యవసరంగా లంచ్‌మోషన్ రూపంలో పిటిషన్ దాఖలు చేశారు.

## జీవో నం.585పై వివరణ ఇవ్వండి

**రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం**

**సాక్షి, అమరావతి:** రాజధానితో పాటు రాష్ట్ర సమగ్రాభివృద్ధి నిమిత్తం విశ్రాంత ఐఏఎస్ అధికారి జీఎన్ రావు నేతృత్వంలో నిపుణుల కమిటీ ఏర్పాటు చేస్తూ జారీ చేసిన జీవో నం.585పై వివరణ ఇవ్వాలని హైకోర్టు గురువారం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని కేంద్ర హోంశాఖ కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సీఆర్‌డీఏ కమిషనర్, కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) సభ్య కార్యదర్శి, రెవెన్యూ, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శులు తదితరులను ఆదేశించింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 3వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి(సీజే) జస్టిస్ జితేంద్ర కుమార్ మహేశ్వరి, న్యాయమూర్తి జస్టిస్ ఎం.వెంకటరమణలతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే తయారు చేసిన ప్రణాళికల ప్రకారం రాజధాని నిర్మాణాలు కొనసాగించేలా ప్రభుత్వాన్ని ఆదేశించడంతోపాటు నిపుణుల కమిటీ ఏర్పాటు జీవోను రద్దు చేయాలని కోరుతూ రైతు పరిరక్షణ సమితి కార్యదర్శి ధనేకుల రామారావు హైకోర్టులో ఇటీవల ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై గురువారం సీజే నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ తరపు న్యాయవాది అంబటి సుధాకరరావు వాదనలు వినిపించారు. ప్రభుత్వం తరపున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ వాదించారు. పిటిషనర్ కేవలం ఒక్కరేనని, బాధిత రైతులు పిటిషన్ దాఖలు చేయలేదని తెలిపారు. అంతేకాక పిటిషనర్ సంఘం బైలాస్ ఏమిటో కూడా తెలియదన్నారు.

## సీఏఏను ఉపసంహరించాలి

**హైకోర్టు న్యాయవాదుల డిమాండ్**

**సాక్షి, అమరావతి:** పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా హైకోర్టు న్యాయవాదులు గురువారం నిరసన తెలిపారు. సీఏఏను కేంద్రం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దేశ సమగ్రతను దెబ్బతీసేలా, పౌర హక్కులను హరించేలా ఈ చట్టం ఉందని వారు పేర్కొన్నారు. కాగా, అమరావతిలోనే రాజధానిని కొనసాగించాలంటూ కొందరు న్యాయవాదులు హైకోర్టు వద్ద కొద్దిసేపు ధర్నా చేశారు.


**JAWAHARLAL NEHRU TECHNOLOGICAL UNIVERSITY COLLEGE OF ENGINEERING, PULIVENDULA**
Pulivendula-516 390 (A.P.) INDIA
**e-Procurement Notice**
Tenders are invited from the reputed dealers / suppliers through e-Procurement Electronic Tendering for the supply of the following equipments: 1. Lab Equipment for CIVIL 2. CTM & LAATM for CIVIL 3.Lab Equipment for EEE 4. Air conditioners 5.Desktop Computers for ELCS lab. The details can be seen e-procurement market place i.e., https://tender.apeprocurement.gov.in.The details also can seen in the college website www.jntuacep.ac.in
Sd/- PRINCIPAL

**ఆంధ్రప్రదేశ్ సోలార్ పవర్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్**
(ఆం.ప్ర. ప్రభుత్వ మరియు భారత ప్రభుత్వం యొక్క జాయింట్ వెంచర్ కంపెనీ)
**ఇ-ప్రొక్యూర్‌మెంట్ రివర్స్ వేలం టెండరు ప్రకటన**
దిగువ పేర్కొన్న పనులకు APSPCL ఇ-రివర్స్ వేలం టెండర్లను కోరుతున్నది. ఆంధ్రప్రదేశ్, వైయస్సార్ కడప జిల్లా, మైలవరం మండలం వద్ద నున్న "కడప అల్ట్రా మెగా సోలార్ పార్కు"లో స్టోరేజి ట్యాంకు, ఇన్‌టేక్ స్ట్రక్చర్, పంపులు & పంపు హౌస్, ఓవర్‌హెడ్ ట్యాంకులు మరియు పంపింగ్ మరియు పంపిణీ లైన్లతో సహా నీటి సరఫరా పథకము నిర్మాణము. పని అంచనా విలువ సుమారు : రూ.11.92 కోట్లు. బిడ్డులు లభ్యమగు తేదీ & సమయము : 18-12-2019 సాయంత్రం 5.00 గం.ల నుండి వివరాలకు దర్శించండి. www.apspcl.ap.gov.in (లేదా) www.apeprocurement.gov.in

**aptdc ANDHRAPRADESH TOURISM DEVELOPMENT CORPORATION LTD.**
**TENDER NOTICE**
**Tender Notice No.24/APTDC/2019-20, Dt: 20.12.2019**

| Sl.No. | Name of the work |
|---|---|
| 1 | The APTDC invites tenders for Water sports/ Adventure activities at Various locations in Andhra Pradesh. The details can be seen at **www.aptdc.in** |

**General Manager, WF APTDC LTD, 9705008111.**
DIPR Ro.No.282PP/CL/ADVT/1/1/2019-20, Dt: 19.12.2019

**ఫారం జి**
**ఆసక్తి వ్యక్తీకరణకు పిలుపు**
(ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్సీ (ఇన్‌సాల్వెన్సీ రిజల్యూషన్ ప్రాసెస్ ఫర్ కార్పొరేట్ పర్సన్స్) రెగ్యులేషన్స్, 2016 యొక్క రెగ్యులేషన్ 36ఎ(1) క్రింద)
**సంబంధిత వివరాలు**

| | | |
|---|---|---|
| 1 | కార్పొరేట్ డెటార్ పేరు | VMC సిస్టమ్స్ లిమిటెడ్ |
| 2 | కార్పొరేట్ డెటార్ ఇన్‌కార్పొరేషన్ తేదీ | 20-02-1997 |
| 3 | కార్పొరేట్ డెటార్ ఇన్‌కార్పొరేట్ అయిన/ నమోదైన అథారిటీ | ROC, హైదరాబాద్ రిజిస్ట్రేషన్ నం. 16201 |
| 4 | కార్పొరేట్ డెటార్ యొక్క కార్పొరేట్ ఐడెంటిటీ నంబరు/లిమిటెడ్ లయబిలిటీ ఐడెంటిఫికేషన్ నంబరు | U29199AP1997PLC026477 |
| 5 | కార్పొరేట్ డెటార్ యొక్క నమోదిత కార్యాలయం మరియు ప్రధాన కార్యాలయం (ఏదైనా ఉంటే) దాని చిరునామా | # 4వ అంతస్తు, D.No.2-56/2/19, విజయ టవర్స్, 100 అ. రోడ్, ఖానామెట్ గ్రామం, హైటెక్ సిటీ, మాదాపూర్, హైదరాబాద్, తెలంగాణ – 500081, ఇండియా. |
| 6 | కార్పొరేట్ డెటార్‌కు సంబంధించి ఇన్‌సాల్వెన్సీ ప్రారంభతేదీ | 19-08-2019 |
| 7 | ఆసక్తి వ్యక్తీకరణకు పిలుపు తేదీ | 20-12-2019 |
| 8 | కోడ్‌లోని సెక్షన్ 25(2)(h) క్రింద రిజల్యూషన్ దరఖాస్తుదార్ల అర్హత లభ్యత: | వివరాలను irp_vmcsl@aaip.co.inకు ఇ-మెయిల్ చేయుట ద్వారా పొందవచ్చును. |
| 9 | సెక్షన్ 29A క్రింద వర్తించు అనర్హత నిబంధనలు లభ్యత: | వివరాలను irp_vmcsl@aaip.co.inకు ఇ-మెయిల్ చేయుట ద్వారా పొందవచ్చును. |
| 10 | ఆసక్తి వ్యక్తీకరణ స్వీకరణకు ఆఖరి తేదీ | 04-01-2020 |
| 11 | కాగోరు రిజల్యూషన్ దరఖాస్తుదార్ల తాత్కాలిక జాబితా జారీ తేదీ | 14-01-2020 |
| 12 | తాత్కాలిక జాబితాకు అభ్యంతరాల దాఖలుకు ఆఖరి తేదీ | 19-01-2020 |
| 13 | కాగోరు రిజల్యూషన్ దరఖాస్తుదార్ల తుది జాబితా జారీ తేదీ | 29-01-2020 |
| 14 | కాగోరు రిజల్యూషన్ దరఖాస్తుదార్లకు సమాచార మెమోరాండం, ఇవాల్యూయేషన్ మ్యాట్రిక్స్ మరియు రిజల్యూషన్ ప్లాన్స్ కోసం అభ్యర్థన జారీ తేదీ | 19-01-2020 |
| 15 | రిజల్యూషన్ ప్లాన్ కోసం అభ్యర్థన, ఇవాల్యూయేషన్ మ్యాట్రిక్స్, సమాచార మెమోరాండం ("IM") మరియు తదుపరి సమాచారం పొందు విధానం | కాగోరు రిజల్యూషన్ దరఖాస్తుదారులను irp_vmcsl@aaip.co.in కు ఇ-మెయిల్ పంపాలని అభ్యర్థించడమైనది. కాన్ఫిడెన్షియాలిటీ ఎగ్రిమెంట్ చేపట్టిన తరువాత ఇన్ఫర్మేషన్ మెమోరాండం, RFRP మరియు ఇవాల్యూయేషన్ మ్యాట్రిక్స్ ఇ-మెయిల్/ డాటా రూమ్ ద్వారా ఏర్పాటు చేయబడును. |
| 16 | రిజల్యూషన్ ప్లాన్స్ దాఖలుకు ఆఖరు తేదీ | 18-02-2020 |
| 17 | రిజల్యూషన్ ప్రొఫెషనల్‌కు రిజల్యూషన్ ప్లాన్స్ దాఖలు చేయు విధానం | రిజల్యూషన్ ప్లాన్ సాఫ్ట్ కాపీని kvsrinivas12@gmail.com కు ఇ-మెయిల్ ద్వారా పంపవలెను మరియు హార్డ్ కాపీని కూడా ఫ్లెయిన్ సీల్డ్ కవర్‌లో మార్క్ చేసి డా. కొండపల్లి వెంకట్ శ్రీనివాస్, రిజల్యూషన్ ప్రొఫెషనల్, 4వ అంతస్తు, "కమల టవర్స్", 1-8-304 నుండి 307, పాటిగడ్డ రోడ్, బేగంపేట్, హైదరాబాద్ – 500003కు పంపవలెను. |
| 18 | ఆమోదానికి అడ్జుడికేటింగ్ అథారిటీకి రిజల్యూషన్ ప్లాన్ దాఖలు చేయాల్సిన అంచనా తేదీ | 19-03-2020 |
| 19 | రిజల్యూషన్ ప్రొఫెషనల్ పేరు మరియు రిజిస్ట్రేషన్ నంబరు | డా. కొండపల్లి వెంకట్ శ్రీనివాస్ Reg. No. IBBI/IPA-001/IP-P00520/2017-18/10945 |
| 20 | బోర్డు వద్ద నమోదైన విధంగా రిజల్యూషన్ ప్రొఫెషనల్ పేరు, చిరునామా మరియు ఇ-మెయిల్ | డా. కొండపల్లి వెంకట్ శ్రీనివాస్, 4వ అంతస్తు,"కమల టవర్స్", 1-8-304 నుండి 307, పాటిగడ్డ రోడ్, బేగంపేట్, హైదరాబాద్ – 500003 ఇ-మెయిల్: kvsrinivas12@gmail.com |
| 21 | రిజల్యూషన్ ప్రొఫెషనల్‌తో ఉత్తర ప్రత్యుత్తరాలకు ఉపయోగించే చిరునామా మరియు ఇ-మెయిల్ | డా. కొండపల్లి వెంకట్ శ్రీనివాస్, 4వ అంతస్తు,"కమల టవర్స్", 1-8-304 నుండి 307, పాటిగడ్డ రోడ్, బేగంపేట్, హైదరాబాద్ –500003 ఇ-మెయిల్: irp_vmcsl@aaip.co.in |
| 22 | తదుపరి వివరాలు వీరి వద్ద లభిస్తాయి | రిజల్యూషన్ ప్రొఫెషనల్ |
| 23 | ఫారం జి ప్రచురణ తేదీ | 20-12-2019 |

తేది : 19-12-2019
ప్రదేశం: హైదరాబాద్
డా. కొండపల్లి వెంకట్ శ్రీనివాస్, రిజల్యూషన్ ప్రొఫెషనల్, M/s VMC సిస్టమ్స్ లిమిటెడ్, Reg. No. IBBI/IPA-001/IP-P00520/2017-18/10945, # 4వ అంతస్తు, "కమల టవర్స్", 1-8-304 నుండి 307, పాటిగడ్డ రోడ్, బేగంపేట్, హైదరాబాద్ –500003, ఇ-మెయిల్ ఐడి: kvsrinivas12@gmail.com, irp_vmcsl@aaip.co.in

**ANDHRA PRADESH POWER DEVELOPMENT COMPANY LIMITED**
**E-PROCUREMENT NOTIFICATION**
**Notice Inviting Tender No.610000587**
APPDCL invites Tender for "Manufacturing, Testing & Supply of Coal Conveyor Belt 1000/4 for BCN 3 & 4 and 1250/4 for BCN 8A/B required for coal handling Plant" under open Tender system, on APGENCO e-procurement Platform.
Schedule available Date & Time : **From 19:00 Hrs on 19.12.2019**
Bid submission Closing Date & Time : **13:00 Hrs on 09.01.2020**
PQ / Technical Bid Opening Date : **15:00 Hrs on 09.01.2020**
Price Bid Opening Date & Time : **15:00 Hrs on 21.01.2020**
For Further details, pleaes visit website : **www.apgenco.gov.in**
**https://etender.apgenco.gov.in**
**Chief General Manager / APPDCL**

**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం**
**పోలీస్ శాఖ**
**సంక్షిప్త ఇ-టెండరు ప్రకటన**
**C.No.01/AP Police/Web TV/PCS&S/2019,** **తేది:18.12.2019**
ఆం.ప్ర.పోలీస్ కోసం వెబ్‌బేస్డ్ లైవ్ TV చానెల్ ఏర్పాటు చేయుట, సరఫరా, స్థాపన మరియు పనిచేయించుట కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం ద్వారా టెండరు కోరబడుచున్నది మరియు అది వెబ్‌సైట్ https://tender.apeprocurement.gov.in లో లభించును. సంప్రదించు వ్యక్తి ఫోన్/ సెల్ నంబర్లు: DSP ఇన్‌స్టాలేషన్ – 9440627627. టెండరు డాక్యుమెంట్ అమ్మకం: 18.12.2019 నుండి 30.12.2019 వరకు. ప్రి-బిడ్ సమావేశము: 23.12.2019. ప్రి-క్వాలిఫికేషన్ & సాంకేతిక బిడ్: 30.12.2019న 11.00 గం. & 15.00 గం. ధర బిడ్ తెరుచుట: 30.12.2019న 17.00 గం. ఇ-ప్రొక్యూర్‌మెంట్ హెల్ప్ డెస్క్: మెసర్స్ వుపాధి టెక్నో సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్. ఫోన్ (O): +91-40-39999700/701, ఫ్యాక్స్: +91-40-39999702. ఇ-మెయిల్: eprocsupport@vupadhi.com.
**సం/- DIG టెక్నికల్ సర్వీసెస్, ఆం.ప్ర., మంగళగిరి**
DIPR RO.No.1354/CL/Advt/1/1/2019-20, Dt.19.12.2019

**JAWAHAR NAVODAYA VIDYALAYA**
**Veleru , Krishna Dist, A.P. 521110.**
**TENDER NOTIFICTION NO. 5**
The Jawahar Navodaya Vidyalya (V), Bapulapadu (M) invites sealed tenders for supply of Provisions and Vegetables from January 2020 to March 2020. Last date for submission of Sealed Tenders in the office of the Vidyalaya is 08-01-2020 up to 4.00 PM. The Sealed Tenders will be opened on 09-01-2020 at 11-00. The Tender forms can be had from the Office during Office hours up to 12-00 Noon on 08-01-2020. by paying Rs. 100/-, or can be downloaded from the vidyalaya website (https://navodaya.gov.in/nvs/nvs-school/KRISHNA/en/home/) The other details will be available in the tender document.
19-12-2019 **PRINCIPAL**

**దక్షిణ మధ్య రైల్వే**
మమ్మల్ని అనుసరించండి @SCRailwayindia
ద.మ. రైల్వే టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.in లో చూడవచ్చును
**E-T.N.No.331/DRM/W/GNT/ ఆఫ్ 18.12.2019**
దిగువ తెలిపిన పనుల కోసం దిగువ సంతకందారు **09-01-2020న 15:30 గంటల వరకు** ఇ-టెండర్లు కోరుచున్నారు.
**క్ర.సం. 1 టెండరు Id:** 2265 **పని వివరణ:** GNT-GNT స్టేషన్ వద్ద ACP క్లాడింగ్ ఏర్పాటు చేయడం ద్వారా FOB ఈస్థటిక్ ఎలివేషన్. **సుమారు విలువ (రూ.):** 47,15,357/–, **బయానా (రూ.):** 94,300/–, **టెండరు ఫారం ధర (రూ.):** 3,000/–.
**క్ర.సం.2 టెండరు Id:** 2266 **పని వివరణ:** గుంటూరు డివిజన్: DEN/నార్త్/GNT సెక్షన్‌లో RDSO స్పెసిఫికేషన్(కంప్లీట్) ప్రకారం డ్యూయల్ అప్లికేటర్/వైపర్ బార్‌తో ట్రాక్ బేస్డ్ వే సైడ్ ల్యూబ్రికేటర్ (ఎలక్ట్రానిక్ టైప్) సరఫరా, స్థాపన, పనిచేయించుట మరియు నిర్వహణ. **సుమారు విలువ (రూ.):** 39,90,000/–, **బయానా (రూ.):** 79,800/–, **టెండరు ఫారం ధర (రూ.):** 3,000/–.
**క్ర.సం.3 టెండరు Id:** 2267 **పని వివరణ:** గుంటూరు డివిజన్: DEN/వెస్ట్/GNT సెక్షన్‌లో RDSO స్పెసిఫికేషన్(కంప్లీట్) ప్రకారం డ్యూయల్ అప్లికేటర్/వైపర్ బార్‌తో ట్రాక్ బేస్డ్ వే సైడ్ ల్యూబ్రికేటర్ (ఎలక్ట్రానిక్ టైప్) సరఫరా, స్థాపన, పనిచేయించుట మరియు నిర్వహణ. **సుమారు విలువ (రూ.):** 34,91,250/–, **బయానా (రూ.):** 69,800/–, **టెండరు ఫారం ధర (రూ.):** 3,000/–.
ఇ-బిడ్స్ ఆన్‌లైన్ దాఖలు కోసం ఆఖరు తేది 09-01-2020న 15:30 గంటల వరకు. సవివరమైన సమాచారానికి వెబ్‌సైట్ **www.ireps.gov.in** కు లాగాన్ అవండి. ఏదేని తదుపరి సమాచారం/సవరణ ఇ-పోర్టల్ **www.ireps.gov.in** ద్వారా తెలియజేయబడును.
**డివిజనల్ రైల్వే మేనేజర్ (వర్క్స్), గుంటూరు**
**ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన నం.164 తేది: 17.12.19**
దిగువ తెలిపిన టెండర్లు మరియు సవరణ ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా విడుదల చేయబడినవి. టెండరుదారులు వెబ్‌సైట్ www.ireps.gov.in ను దర్శించి వారి ఆఫర్లను దాఖలు చేయవలసిందిగా కోరబడుచున్నారు. స్వయంగా లేదా పేపర్ ద్వారా దాఖలు చేసిన ఆఫర్లు అంగీకరించబడవని గమనించగలరు. పోస్ట్ ద్వారా పంపిన ఆఫర్లు స్వీకరించబడవు.
**క్ర.సం.:1 టెండరు నం.:** TMC 2019028 **వివరణ:** ట్రాక్ మెషీన్స్ ఉపయోగం కోసం క్లచ్ కప్లింగ్స్ సరఫరా. వర్కింగ్ మరియు డ్రైవింగ్ **గడువు తేది:** 16.01.20
**క్ర.సం.:2 టెండరు నం.:** TMC 2019029 **వివరణ:** ట్రాక్ మెషీన్స్ ఉపయోగానికి షాక్ అబ్జర్వర్స్ సరఫరా. **గడువు తేది:** 16.01.20
**క్ర.సం.:3 టెండరు నం.:** TMC 2019030 **వివరణ:** ట్రాక్ మెషీన్స్ ఉపయోగానికి ట్రాన్స్‌డ్యూసర్స్ సరఫరా. **గడువు తేది:** 20.01.20
**క్ర.సం.:4 టెండరు నం.:** TMC 2019031 **వివరణ:** CSM ట్యాంపింగ్ యూనిట్ కోసం స్లైట్ మౌంటింగ్ బ్లాక్‌తో మోడిఫైడ్ ట్యాంపింగ్ గేర్ బాక్స్ సరఫరా. **గడువు తేది:** 20.01.20
టెండరు నోటీసు నం.162 (ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన)కు సవరణ నం.2 జారీ
**టెండరు ప్రకటన నం. & తేది:** టెండరు ప్రకటన నం.162 ఆఫ్ 18.11.19. టెండరు నం. TMC2019022. **వివరణ:** పరిమాణము మరియు బయానా & గడువు తేది మార్పు చేయబడినవి.
**టెండరు ప్రకటన నం. & తేది:** టెండరు ప్రకటన నం.162 ఆఫ్ 18.11.19. టెండరు నం. TMC2019024. **వివరణ:** గడువు తేది పొడిగించబడినది.
పూర్తి వివరాల కోసం www.ireps.gov.in ను రిఫర్ చేయగలరు.
**డిప్యూటీ చీఫ్ ఇంజనీర్/TM/HQ/ సికింద్రాబాద్**
A2028
**తదుపరి టెండరు నిబంధనలు / వివరాల కోసం మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కోసం దర్శించండి వెబ్‌సైట్ https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in**

# ఆందోళనలు.. అరెస్టులు

## పౌరసత్వ సవరణ చట్టంపై తీవ్రమైన నిరసనలు

- దేశవ్యాప్తంగా ఆందోళనలు; కర్ణాటకలో నిరసనల్లో ఇద్దరు మృతి
- పోలీసుల అదుపులో ఏచూరి, రామచంద్ర గుహ, బృందా కారత్ సహా వందలాది మంది ఆందోళనకారులు
- యూపీ, బిహార్‌ల్లో హింసాత్మకం

**న్యూఢిల్లీ:** 'పౌర' ఆగ్రహం తీవ్రమవుతోంది. ఆందోళనలపై ప్రభుత్వం కూడా తీవ్రంగానే స్పందిస్తోంది. పౌరసత్వ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ఆందోళనలు గురువారం కూడా కొనసాగాయి. పలు పట్టణాలు, విశ్వవిద్యాలయాల్లో వామపక్ష పార్టీలు, వామపక్ష విద్యార్థి సంఘాలు భారీగా నిరసన ప్రదర్శనలు నిర్వహించాయి. యూపీ, బిహార్‌ల్లో ఆందోళనలు హింసాత్మకమయ్యాయి. దేశంలోని పలు ప్రాంతాల్లో నిషేధాజ్ఞలను ఉల్లంఘించి ఆందోళనల్లో పాల్గొన్న లెఫ్ట్ నేతలు సీతారాం ఏచూరి, డీ రాజా, నీలోత్పల్ బసు, బృందా కారత్, స్వరాజ్ అభియాన్ నేత యోగేంద్ర యాదవ్, చరిత్రకారుడు రామచంద్ర గుహ సహా ఆందోళనకారులను ప్రభుత్వం అదుపులోకి తీసుకుంది. ఢిల్లీలోని ఎర్రకోట సహా పలు ప్రాంతాల్లో అధికారులు 144 సెక్షన్ విధించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ఇంటర్నెట్‌ను, మొబైల్ సేవలను నిలిపేశారు. సీఏఏ వ్యతిరేక నిరసనల కేంద్రంగా నిలిచిన అస్సాం, మేఘాలయ, త్రిపురల్లో శాంతియుత నిరసన ప్రదర్శనలు చోటుచేసుకున్నాయి. కేరళ, తమిళనాడు, చండీగఢ్, జమ్మూ, రాజస్తాన్, మధ్యప్రదేశ్, గుజరాత్‌ల్లో నిరసన ప్రదర్శనలు జరిగాయి. మరోవైపు, పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ)తో పాటు జాతీయ పౌర పట్టిక(ఎన్నార్సీ)ని దేశవ్యాప్తంగా అమలు చేయడం తథ్యమని బీజేపీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జేపీ నడ్డా స్పష్టం చేశారు.

**ఢిల్లీలో..**

144 సెక్షన్ విధించినప్పటికీ నిరసనకారులు వెనక్కుతగ్గలేదు. వేలాదిగా ఎర్రకోట, జంతర్‌మంతర్, మండిహౌజ్ తదితర ప్రాంతాల్లో నిరసనలు తెలిపారు. 1975 నాటి ఎమర్జెన్సీ కన్నా పరిస్థితి దారుణంగా ఉందని మండిహౌజ్ వద్ద ఆందోళనల్లో పాల్గొని అరెస్టైన సీపీఎం నేత ఏచూరి అన్నారు. పలు సమస్యాత్మక ప్రాంతాల్లో మునుపెన్నడూ లేని విధంగా కొన్ని గంటల పాటు కాల్స్, ఎస్ఎంఎస్, ఇంటర్నెట్ సహా అన్ని మొబైల్ సేవలను నిలిపేశారు. 'నిర్భయ' ఆందోళనలు, అన్నాహజారే అవినీతి వ్యతిరేక ఉద్యమ సమయంలోనూ పోలీసులు ఇంతటి చర్య తీసుకోలేదు.



లక్నోలో ఆందోళనకారులు నిప్పుపెట్టడంతో అగ్నికి ఆహుతి అవుతోన్న మీడియా వాహనాలు

**ఉత్తరప్రదేశ్‌లో..**

ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నో రణరంగమైంది. నగరవ్యాప్తంగా నిరసనలు జరిగాయి. ఒక పోలీస్ ఔట్‌పోస్ట్ వెలుపల వాహనాలను ఆందోళనకారులు తగలబెట్టారు. పోలీసులపై రాళ్లు రువ్వారు. పోలీసులు వారిని చెదరగొట్టేందుకు లాఠీచార్జ్, టియర్ గ్యాస్‌ను ప్రయోగించారు. సంబల్ ప్రాంతంలో ఆందోళనకారులు ఆర్టీసీ బస్సును తగలపెట్టారు.

**బిహార్‌లో..**

వామపక్ష విద్యార్థులు రోడ్లను, రైల్వే ట్రాక్‌లను నిర్బంధించి నిరసన తెలిపారు. పట్నాలో మాజీ ఎంపీ పప్పు యాదవ్ నేతృత్వంలోని జన అధికార పార్టీ కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. రోడ్లపై టైర్లను తగలబెట్టి వాహనాలను అడ్డుకున్నారు. జహానాబాద్‌లో సీపీఐఎంఎల్ కార్యకర్తలు రోడ్ రోకో నిర్వహించారు.

**మహారాష్ట్రలో..**

ముంబైలోని క్రాంతి మైదాన్‌లో కాంగ్రెస్, ఎన్సీపీ, పలు ఇతర పార్టీలు 'హమ్ భారత్ కే లోగ్' పేరుతో ఫ్రంట్‌ను ఏర్పాటు చేసి నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ నిరసనలో వేలాదిగా పార్టీల కార్యకర్తలు, విద్యార్థులు, బాలీవుడ్ ప్రముఖులు పాల్గొన్నారు. ఇదే మైదానం నుంచి 1942లో మహాత్మాగాంధీ క్విట్ ఇండియా' నినాదం ఇచ్చారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న 94 ఏళ్ల జీజీ పారిఖ్ సీఏఏ వ్యతిరేక ప్రదర్శనలోనూ పాల్గొని చరిత్ర సృష్టించారు.



ఢిల్లీలోని ఎర్రకోట వద్ద అప్రమత్తంగా ఉన్న ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సభ్యులు

**పశ్చిమబెంగాల్‌లో..**

కోల్‌కతాలో వరుసగా నాలుగోరోజు ముఖ్యమంత్రి మమత బెనర్జీ సీఏఏ వ్యతిరేక ఆందోళనల్లో స్వయంగా పాల్గొన్నారు. సీఏఏ, ఎన్నార్సీలపై దేశవ్యాప్తంగా ఐక్యరాజ్యసమితి పర్యవేక్షణలో ప్రజాభిప్రాయ సేకరణ జరపాలని మోదీ సర్కారును సవాలు చేశారు. ఈ రెఫరండంలో ఓడిపోతే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

### కర్ణాటకలో ఇద్దరి మృతి

మంగళూరులో పోలీసుల కాల్పుల్లో ఇద్దరు ఆందోళనకారులు చనిపోయారు. మంగళూరు నార్త్ పోలీస్ స్టేషన్‌ను ముట్టడించి, పోలీసులపై దాడికి ఆందోళనకారులు ప్రయత్నించారని, వారిని అడ్డుకునే ప్రయత్నంలో జరిపిన కాల్పుల్లో ఇద్దరు చనిపోయారని పోలీస్ అధికారులు తెలిపారు. బెంగళూరు, హుబ్బలి, కలబుర్గి, హాసన్, మైసూర్, బళ్లారిల్లో విపక్షాలు, ఆందోళనకారులు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. బెంగళూరులో ఆందోళనల్లో పాల్గొన్న రామచంద్ర గుహను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శాంతియుత నిరసనలకు కూడా అనుమతించకపోవడం అప్రజాస్వామికమని గుహ విమర్శించారు.



గుహ అరెస్ట్ దృశ్యం



# ట్రంప్‌పై అభిశంసనకు ప్రతినిధుల సభ ఆమోదం

- సెనేట్‌లో తేలనున్న భవిష్యత్తు
- అభిశంసనను ఎదుర్కొన్న మూడో అధ్యక్షుడు ట్రంప్

**వాషింగ్టన్:** అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను దిగువ సభ అభిశంసించింది. సెనేట్‌లోనూ అభిశంసన ఆమోదం పొందితే అధ్యక్షపదవి నుంచి ట్రంప్ దిగిపోవాల్సిందే. అమెరికాలోని డెమొక్రాట్లు మెజారిటీగా ఉన్న ప్రతినిధుల సభలో విశ్వాసపరీక్షలో ట్రంప్‌పై రెండు అంశాల ప్రాతిపదికగా అవిశ్వాస తీర్మానం పెట్టారు. ట్రంప్ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డాడన్న ఆరోపణ ఒకటైతే, కాంగ్రెస్‌ను అడ్డుకున్నారనేది రెండో ఆరోపణ. ట్రంప్ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారన్న ఆరోపణలకు అనుకూలంగా 230 ఓట్లు పడగా, వ్యతిరేకంగా 197 ఓట్లు పడ్డాయి. కాంగ్రెస్‌ను అడ్డకున్నారన్న ఆరోపణలకు అనుకూలంగా 229 ఓట్లు, వ్యతిరేకంగా 198 ఓట్లు వచ్చాయి. తన ప్రత్యర్థి, డెమొక్రటిక్ పార్టీ తరఫున అమెరికా అధ్యక్ష అభ్యర్థిగా బరిలో నిలిచిన జో బిడెన్ మీద వచ్చిన అవినీతి ఆరోపణలపై విచారణ చేపట్టాలని ఉక్రెయిన్‌ను ఒత్తిడిచేసి, ఆ దేశాన్ని తనకు రాజకీయంగా సాయం చేయాలని ట్రంప్ కోరడం అధికార దుర్వినియోగమని అభియోగంలో పేర్కొన్నారు. ప్రతినిధుల సభ విచారణకు ట్రంప్ సహకరించకుండా కాంగ్రెస్‌ను అడ్డుకున్నారన్నది రెండో అభియోగం.

**సెనేట్‌కి అభిశంసన తీర్మానం**

ప్రతినిధుల సభ ఆమోదం తర్వాత ట్రంప్ అభిశంసన తీర్మానం సెనేట్‌కు వెళుతుంది. అమెరికా అధ్యక్ష పదవిలో ట్రంప్ కొనసాగాలా? లేదా? అన్నది సెనేట్ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. ప్రతినిధుల సభలో అభిశంసన పూర్తయినప్పటికీ సెనేట్‌లోనూ నెగ్గడం కీలకం. సెనేట్‌లోనూ అభిశంసన ఆమోదం పొందితే ట్రంప్ అధికారం నుంచి వైదొలగాలి. అయితే అభిశంసన ఆమోదం పొంచే అవకాశమే లేదు. సెనేట్‌లో ట్రంప్ సొంత పార్టీ అయిన రిపబ్లికన్లకు స్పష్టమైన మెజారిటీ ఉంది. అభిశంసన ఆమోదం పొందాలంటే అందుకు సెనేట్‌లో మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం. అది జరిగే అవకాశమే లేదు. దీంతో ట్రంప్ అధికారపీఠాన్ని దిగకపోవచ్చు. అయినప్పటికీ అమెరికా రాజకీయ చరిత్రలో అభిశంసనను ఎదుర్కున్నారనే మరక మాత్రం ట్రంప్‌పై పడింది. జనవరి రెండోవారంలో సెనేట్‌లో ఓటింగ్ ఉండే చాన్సుంది.





**అభిశంసనను ఎదుర్కొన్న మూడో అధ్యక్షుడు ట్రంప్**

అమెరికా చరిత్రలో అభిశంసనను ఎదుర్కొన్న అధ్యక్షుల్లో ట్రంప్ మూడోవ్యక్తి. గతంలో ఆండ్ర్యూ జాన్సన్, బిల్‌క్లింటన్‌లకు ఈ చేదు అనుభవం ఎదురైంది. ప్రతినిధుల సభలో ఓటింగ్ జరుగుతున్నప్పుడు ట్రంప్, ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్‌తో కలిసి మిచిగాన్‌లోని బాటిల్‌క్రీక్‌లో ఎన్నికల ప్రచారంలో ఉన్నారు. తనపై అభిశంసనపై ట్రంప్ మాట్లాడుతూ 'అధికారంలోకి వచ్చిన తొలి రోజు నుంచే వాళ్లు నాపై అభిశంసనకు యత్నిస్తున్నారు. లక్షలాది మంది ఓటర్లు ఎన్నుకున్న మా ప్రభుత్వాన్ని గద్దెదించాలని డెమొక్రాట్లు ప్రయత్నిస్తున్నారు' అని అన్నారు.

**అభిశంసన ఎదుర్కొన్నవారు మళ్లీ గెలవలేదు**

ఇప్పటివరకు అభిశంసనను ఎదుర్కొన్న అధ్యక్షులెవరూ తిరిగి ఆ తర్వాతి ఎన్నికల్లో గెలవలేదు. 1868లో అభిశంసనకు గురైన అమెరికా అధ్యక్షుడు ఆండ్ర్యూ జాన్సన్ ఆ తరువాత జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా గెలవలేకపోయారు, బిల్ క్లింటన్‌పై 1998లో అభిశంసన ప్రవేశ పెట్టారు. రెండోసారి అధ్యక్ష ఎన్నికల్లో క్లింటన్ విజయం సాధించలేకపోయారు. 1974లో నాటి అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్ అభిశంసన ప్రక్రియ సభ ముందుకు రాకముందే పదవికి రాజీనామా చేశారు.





చేతులకు బిగించిన రిమోట్ పరికరాలతో ఎడమవైపు ఉన్న వ్యక్తి ఎలాచేస్తే అచ్చం అలాగే చేతులు, కాళ్లు కదుపుతున్న అధునాతన రోబో ఇది. దీని పేరు టీ-హెచ్‌ఆర్3. టోక్యోలో టొయోటా సంస్థ దీన్ని ఆవిష్కరించింది.

## ముషారఫ్ శవాన్నైనా మూడ్రోజులు వేలాడదీయండి

**ఉరిశిక్షకు ముందే మరణిస్తే ఎలా అన్నదానిపై పాక్ ప్రత్యేక కోర్టు**

**ఇస్లామాబాద్:** పాకిస్తాన్ మాజీ అధ్యక్షుడు పర్వేజ్ ముషారఫ్ ఉరిశిక్షకు ముందే మరణిస్తే అతడి శరీరాన్ని అయినా మూడ్రోజులు ఉరికి వేలాడదీయాల్సిందేనని ఆ దేశ ప్రత్యేక కోర్టు గురువారం స్పష్టంచేసింది. దేశద్రోహం కేసులో పాకిస్తాన్ కోర్టు మరణశిక్ష విధించిన సంగతి తెలిసిందే. దీనికి సంబంధించిన 167 పేజీల తీర్పు కాపీలో 'అతడు చేసిన ప్రతి దానికి ఉరికి వేలాడాల్సిందే. ఒకవేళ ఉరికి ముందే మరణించినా వేలాడదీయాల్సిందే' అంటూ జస్టిస్ వఖార్ అహ్మద్ సేథ్ తీర్పు రాశారు. అధ్యక్షుడు, ప్రధాని, పార్లమెంటుతో పాటు ఇతర ప్రభుత్వ భవనాలకు దగ్గరగా ఉండే డీ–చౌక్ వద్ద అతడి మృతదేహం మూడు రోజుల పాటు వేలాడాలని చెప్పారు.

## కొత్త రేషన్ కార్డులు సిద్ధం

**న్యూఢిల్లీ:** 'వన్ నేషన్–వన్ రేషన్ కార్డు'దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దేశమంతటా ఒకే రేషన్ కార్డు ఉండేలా కార్డులకు ఒక ప్రామాణిక ఆకృతిని నిర్ణయించింది. వీటిని ప్రామాణికంగా తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. రేషన్ కార్డులపై రెండు భాషలు ఉండేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలు కోరాయి. ఒకటి ప్రాంతీయ భాష కాగా.. మరొకటి హిందీ లేదా ఇంగ్లిష్ ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశాయి. కార్డులో 10 అంకెలు ఉండేలా చూడాలని కోరాయి. ఈ 10 అంకెల్లో మొదటి రెండు అంకెలు రాష్ట్ర కోడ్, తర్వాతి రెండు అంకెలు రేషన్ కార్డు నంబర్‌ను తెలిపేలా ఉండాలని పేర్కొన్నాయి.

## డాక్టర్ల కోసం యూకే ప్రత్యేక వీసా

**లండన్:** భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా ఉన్న అర్హులైన వైద్యులు, నర్సుల కోసం ప్రత్యేకంగా ఒక వీసాను ప్రారంభించనున్నట్లు బ్రిటన్ ప్రకటించింది. ప్రభుత్వ నిధులతో నిర్వహించే నేషనల్ హెల్త్ సర్వీసెస్‌లో నిపుణుల కొరత తీవ్రంగా ఉన్న కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఈ 'ఎన్‌హెచ్ఎస్ వీసా' హామీని ఇటీవలి ఎన్నికల ప్రచారం సందర్భంగా ప్రధాని బోరిస్ తెరపైకి తెచ్చారు. అర్హులైన డాక్టర్లు, నర్సులు, ఇతర వైద్య నిపుణులు త్వరితగతిన బ్రిటన్‌కు వచ్చేందుకు ఈ వీసా దోహదపడుతుందని భావిస్తున్నారు.

## నిజాం కేసులో పాక్‌కు మరో దెబ్బ

**లండన్:** లండన్‌లోని నేషనల్ వెస్ట్ మినిస్టర్(నాట్‌వెస్ట్) బ్యాంక్‌లో దశాబ్దాలుగా ఉన్న హైదరాబాద్ నిజాంలకు చెందిన 3.5 కోట్ల పౌండ్ల నిధులు భారత ప్రభుత్వం, నిజాం వారసులకే చెందుతాయని అక్టోబర్‌లో ఇంగ్లండ్ హైకోర్ట్ తీర్పునిచ్చిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆ కేసుకు సంబంధించి న్యాయమూర్తి మార్కస్ స్మిత్ మరో తీర్పునిచ్చారు. ఇది కూడా పాకిస్తాన్‌ను దెబ్బతీసేదే. పాకిస్తాన్ తమ ప్రతివాదులకు అయిన ఖర్చుల మొత్తంలో 65% చెల్లించాలని గురువారం తీర్పునిచ్చారు. 'ఖర్చుల కింద వారికి ఎంత మొత్తం చెల్లించాలనే విషయంలో ఒక అంగీకారానికి రాని పక్షంలో.. ప్రతివాదులకైన ఖర్చులో 65% పాకిస్తాన్ చెల్లించాలి' అని స్పష్టంచేశారు. 65% పాక్ చెల్లిస్తే.. ప్రతివాదులైన భారత ప్రభుత్వానికి సుమారు 28 లక్షల పౌండ్లు, ప్రిన్స్ ముఫఖం ఝాకు సుమారు 18 లక్షల పౌండ్లు, ప్రిన్స్ ముఖరం ఝాకు సుమారు 8 లక్షల పౌండ్లు లభిస్తాయి.

**1948లో....** 1948లో ఏడవ నిజాం ఉస్మాన్ 10 లక్షల పౌండ్లను బ్రిటన్‌లోని పాకిస్తాన్ హైకమిషనర్ హబీబ్ ఇబ్రహీంకు పంపించారు. హైదరాబాద్‌లోని తన ఖాతా నుంచి లండన్‌లోని నాట్‌వెస్ట్ బ్యాంక్‌లోని హబీబ్ ఖాతాకు ఆ మొత్తాన్ని బదిలీ చేశారు. దాని విలువ ప్రస్తుతం 3.5 కోట్ల పౌండ్లకు చేరింది. ఆ మొత్తం తమదేనని నిజాం వారసులు, భారత ప్రభుత్వం వాదించగా, ఆ నిధులు తమవని పాక్ వాదించింది. నిజాం వారసులు, భారతసర్కార్ ఒక ఒప్పందానికి వచ్చి ఒక్కటిగా తమ వాదనలు వినిపించాయి. అనంతరం ఆ నిధులు నిజాం వారసులు, భారత్‌కే చెందుతాయని కోర్టు తీర్పునిచ్చింది.

## 'నిర్భయ' దోషి ఆనాడు మైనర్ కాదు

**న్యూఢిల్లీ:** 2012 నాటి 'నిర్భయ' గ్యాంగ్‌రేప్, హత్య కేసులో దోషి పవన్ కుమార్ గుప్తా ఆ ఏడాది తాను మైనర్‌నంటూ చేసుకున్న అభ్యర్థనను ఢిల్లీ హైకోర్టు తోసిపుచ్చింది. దోషి తరఫున ఏపీ సింగ్ వాదించారు. ఘటన జరిగే నాటికి పవన్ కుమార్ మైనర్ అని, దీనికి సంబంధించి మరిన్ని నివేదికలు సమర్పించేందుకు సమయం కావాలని కోరారు. అందుకు జస్టిస్ సురేశ్ కుమార్ కైత్ అంగీకరించి కేసును జనవరి 24కు వాయిదా వేశారు. అయితే గతంలో ఇదే విషయంపై ట్రయల్‌కోర్టులో విచారణ జరిగిందని, ఘటన జరిగే నాటికి పవన్ కుమార్ మైనర్ కాదని తేలిందని తల్లిదండ్రుల తరఫున వాదిస్తున్న లాయర్లు చెప్పారు. దీనిపై విచారించేందుకు లాయర్ ఏపీ సింగ్‌కు సమాచారం ఇచ్చినప్పటికీ ఆయన హాజరు కాలేదు. దీంతో కోర్టు ఎదుట హాజరు కాకపోవడాన్ని తప్పుపడుతూ న్యాయవాదికి కోర్టు 25వేల రూపాయల జరిమానా విధించింది. దోషి వయసుని తక్కువ చేసి చూపిస్తూ తప్పుడు ధృవీకరణ పత్రాన్ని జత చేసినందుకు దోషి తరపు లాయర్‌పై చర్యలు తీసుకోవాలంటూ ఢిల్లీ బార్ కౌన్సిల్‌ని కోర్టు ఆదేశించింది.

## మన్మోహనే చెప్పారు!

**న్యూఢిల్లీ:** కేంద్రం అమలు చేయనున్న పౌరసత్వ సవరణ చట్టంలో ఉన్నవి 2003లో పార్లమెంట్లో మన్మోహన్ సింగ్ సూచించిన విషయాలేనని కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ చెప్పారు. పాక్, బంగ్లా, అఫ్గాన్‌ల నుంచి మత వేధింపుల బాధితులుగా భారత్‌కు వచ్చినవారికి పౌరసత్వం కల్పించాలని 2003లో రాజ్యసభలో విపక్ష నేత హోదాలో మన్మోహన్ చెప్పారని జితేంద్ర అన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ఓటుబ్యాంకు రాజకీయాలకు పాల్పడుతూ మాట మారుస్తోందన్నారు.

## ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరు మావోల మృతి

**చర్ల/సుకుమా:** ఛత్తీస్‌గఢ్‌లో వేర్వేరు ఎన్‌కౌంటర్‌లలో ఇద్దరు మావోయిస్టులు మృతిచెందారు. సుకుమా జిల్లాలోని సింగనమడుగు అటవీ ప్రాంతంలో గురువారం కూంబింగ్‌లో పాల్గొన్న పోలీసులకు మావోలు తారసపడి కాల్పులు జరిపారు. దీంతో పోలీసులు జరిపిన ఎన్‌కౌంటర్‌లో ఒక మహిళా మావోయిస్టు మృతిచెందింది. ఆమె మృతదేహాన్ని తరలిస్తుండగా మార్గమధ్యంలో మళ్లీ మావోలు కాల్పులు జరిపారు. తర్వాత జరిగిన పోలీసు ఎదురుకాల్పుల్లో మరో మావో మరణించాడు.


సాక్షి ఉద్యోగ అవకాశాలు

**WALK IN INTERVIEW**

Applications are invited for the following positions in API/Bulk Drug Manufacturing industry. Fresh or Min 2-5 years experience in the respective fields with **Intermediate/ B.Sc/M.Sc/B.Pharmacy qualification.**

1. Production Assistant 2. Production Tr. Chemist
3. Production Chemist 4. Production Incharge

Interested candidates may attend for the **Walk In Interview** between **17.12.2019 to 31.12.2019** from **10.00 am to 5.00 pm** at below given Factory.

**INCHEM LABORATORIES PVT LTD**

IDA, Kondapalli, Vijayawada, Cell:9959806383

If unable for walk in, pls send resume to **office.inchemlabs@gmail.com**

**WANTED FACULTY**

FOR DIGITAL VIDEO CLASSES

REQUIRE SUBJECT EXPERTISE

ATTRACTIVE SALARY (ACCOMMODATION + FOOD For Non Locals)

**Mail Demo Video (5-8 Mins) on Below Topics**

Before 1st January 2020

MATHS - CONSTRUCTIONS
BIOLOGY - REPRODUCTION
PHYSICS - MOTION, FORCE, WORK
CHEMISTRY - PERIODIC CLASSIFICATIONS

eMail Id : info@bpreprd.com
Whatsapp / WalkIn Appointments 7997 84 6667, Madhapur, Hyderabad.

SELECTED VIDEOS WILL BE AWARDED ₹10,000 CASH PRIZE

**Centre for Personnel Talent Management (CEPTAM)**

*Scrutinize, Actualize & Recognize Human Potential*

**Defence Research & Development Organisation (DRDO)**
**Ministry of Defence, Government of India**

ISO 9001:2015

*"Government strives to have a workforce which reflects gender balance and women candidates are encouraged to apply"*

**ADVT No.: DRDO ENTRY TEST:2019-20/MTS**

DRDO is looking for young, promising and energetic aspirants to serve the Nation in Group-C, Non-Gazetted Post as Multi Tasking Staff (MTS) [1817 Vacancies#]

POST CODE- 1301; POST NAME:- Multi Tasking Staff (MTS)

**Essential Qualification$**
❑Pass in 10th Standard from a recognised Board *or*
❑Industrial Training Institute (ITI) pass

**Age Limit**
18 and 25 Years of age (Relaxations as per extant Govt. of India rules).

**Scheme of Exam**
Tier-I : Computer Based Test (CBT) for Screening
Tier-II: Computer Based Test (CBT) for Final Selection

**REMUNERATION & OTHER BENEFITS**

Pay matrix Level-1 (Rs 18000-56900) as per 7th CPC pay matrix. CSD, Medical Facility, Leave Travel Concession, Children Education Allowance and other allowances/advances as per extant Govt of India rules.

$The full advertisement regarding detailed information of vacancies, eligibility, registration, application & selection procedure will be published in Employment News dated 21-27 December 2019 and will also be available on (https://www.drdo.gov.in). Online registration will begin on 23rd December 2019 (10:00 hrs) and closing date is 23rd January 2020 (17:00 hrs). Apply early, to avoid network congestion and ensure your candidature for the online examination. The Date of Exam will be published on our website later.

Helpdesk Support:
Email: mtshelpdesk@detceptam.com
Helpline: 011-23882323, 23819217
Website: www.drdo.gov.in

# The Number of Vacancies may vary depending on organisational requirements

DAVP 10301/11/0122/1920

సాక్షి
శుక్రవారం, డిసెంబర్, 20

# కటోవీస్ దారిలోనే మాడ్రిడ్!

పారిస్ శిఖరాగ్ర సదస్సులో కర్బన ఉద్గారాల తగ్గింపుపై చరిత్రాత్మక ఒడంబడిక కుదిరినప్పటినుంచీ దాన్ని ఉల్లంఘించడమే ధ్యేయంగా పనిచేస్తున్న దేశాలకు ఏటా ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో జరిగే కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్(కాప్) సదస్సులు తప్పనిసరి లాంఛనం. ఈనెల 2 నుంచి 15 వరకూ స్పెయిన్‌లోని మాడ్రిడ్‌లో జరిగిన కాప్–25 సదస్సు కూడా ఆ కోవలోనిదే. దాదాపు 200 దేశాల నుంచి వచ్చిన ప్రతినిధులతో పారిస్ శిఖరాగ్ర సదస్సు ఆమోదించిన ఒడంబడిక 2030నాటికి అన్ని దేశాలూ 2005నాటి కర్బన ఉద్గారాల స్థాయిలో 33 నుంచి 35 శాతాన్ని తగ్గించాలని నిర్దేశించింది. ఆ దిశగా ఏ దేశం ఎలాంటి లక్ష్యాలు నిర్ణయించుకుంటున్నదో, ఆచరణలో అవి ఏవిధంగా సాగుతున్నాయో, సాఫల్యవైఫల్యాలేమిటో సమీక్షించడం కాప్ సదస్సుల ధ్యేయం. కానీ ఏడాది పొడవునా నిర్వ్యాపకత్వంతో ఉండిపోయి, ఈ సదస్సులకు ప్రతి దేశమూ ముఖాలు వేలాడేసుకు వస్తున్నాయి. సాధించిందేమీ లేక, చెప్పడానికేమీ మిగలక తదుపరి కాప్ సదస్సుకు చర్చలను వాయిదా వేసుకుని తిరుగు ముఖం పడుతున్నాయి. తమ చేతగానితనాన్ని, వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఈ సదస్సులను అనుకున్న కంటే మరో రెండురోజులో, నాలుగురోజులో, వారంరోజులో పొడిగించడం, ఏదో జరుగుతోందన్న అభిప్రాయం ప్రపంచ పౌరుల్లో కలిగించడం దేశాలు అనుసరించే ఎత్తుగడ. వాస్తవానికి కాప్–25 సదస్సుకు తాము ఆతిథ్యమిస్తామని రెండేళ్లక్రితం చెప్పిన బ్రెజిల్ అక్కడ ప్రభుత్వం మారాక నిరుడు మాట మార్చింది. దాంతో ఆ వేదికను చిలీ రాజధాని శాంటియాగోకు మార్చవలసి వచ్చింది. అయితే ఉద్యమాలతో అట్టుడుకుతున్న చిలీ ఈ సదస్సును నిర్వహించే స్థితిలో లేకపోవడంతో అది కాస్తా మాడ్రిడ్‌కు మారింది. ఈసారి సదస్సు సమయానికి ఒక్క చిలీ మాత్రమే కాదు... వేరే దేశాలు కూడా వేర్వేరు సమస్యల్లో చిక్కుకున్నాయి. ఫ్రాన్స్‌లో దేశవ్యాప్త సమ్మె సాగింది. బ్రిటన్ ఎన్నికల హడావుడి, ప్రభుత్వం ఏర్పాటు వగైరాల్లో బిజీగా ఉంది. ప్రపంచంలో అతి పెద్ద కాలుష్య కారక దేశంగా ముద్రపడిన చైనా హాంకాంగ్ ఉద్యమంతో ఊపిరాడకుండా ఉంది. రెండో స్థానంలో ఉన్న అమెరికా ఇప్పటికే పారిస్ ఒడంబడిక నుంచి తప్పుకుంది. అమెజాన్ మహారణ్యాల్లో ఏడు శాతం వరకూ వాటావున్న బొలీవియాలో ప్రభుత్వం సైనిక తిరుగుబాటులో కుప్పకూలింది. ఇక ఆ అరణ్యాలు 60 శాతం మేర ఉన్న బ్రెజిల్ దాన్ని కనీవినీ ఎరుగని రీతిలో ధ్వంసం చేసింది. పర్యావరణానికి ప్రమాదం ముంచుకొస్తున్నదన్న వాదనంతా పెట్టుబడిదారీ దేశాలను దెబ్బతీయడానికి 'మార్క్సిస్టులు' పన్నిన కుట్రగా జైర్ బోల్సొనారో నాయకత్వంలోని మితవాద ప్రభుత్వం అభివర్ణిస్తోంది.

భూగోళం ఉనికికే పెనుముప్పు తీసుకురాగల కాలుష్యాన్ని అంతం చేసే విషయంలో కఠినంగా వ్యవహరించలేకపోవడమే కాప్ సదస్సుల వరస వైఫల్యానికి కారణం. పారిస్ ఒడంబడిక ఎంత చరిత్రాత్మకమైనది అయినా అందులోని అంశాలు అమలు చేయని దేశాలకు భారీ జరిమానా విధించడం, అభిశంసించడం వంటి నిబంధనలు లేకపోవడంతో ఆ లక్ష్యాలను సాధించడానికి ఏ దేశమూ చిత్తశుద్ధితో పనిచేయడం లేదు. పర్యావరణం ప్రమాదంలో పడిందన్న విషయంలో అమెరికా, బ్రెజిల్ తప్ప అందరూ ఏకీభవిస్తున్నారు. నిజానికి పారిస్ ఒడంబడిక ఆ ప్రమాదాన్ని అవసరమైన స్థాయిలో పట్టించుకోలేదన్న విమర్శలు సైతం ఉన్నాయి. ఈ ఏడాది ప్రపంచ దేశాలు అనేక ఉత్పాతాలను చవిచూశాయి. మొన్న సెప్టెంబర్‌లో బహామస్‌ను చుట్టుముట్టిన పెనుతుపాను డోరియన్ సృష్టించిన బీభత్సం అంతా ఇంతా కాదు. కేటగిరీ 5లో చేర్చిన ఈ తుపాను వల్ల 70మంది ప్రాణాలు కోల్పోగా, 340 కోట్ల డాలర్ల ఆస్తి నష్టం సంభవించింది. అగ్రరాజ్యాల చర్యల పర్యవసానాలను చిన్న దేశాలు ఎలా భరించవలసి వస్తున్నదో చెప్పడానికి బహామస్ దేశమే ఉదాహరణ. ఇదొక్కటే కాదు... వనౌతు, తువాలు వంటి అతి చిన్న ద్వీపకల్ప దేశాలు కూడా తరచూ ఇలాంటి ప్రకృతి వైపరీత్యాల్లోనే చిక్కుకుంటున్నాయి. ఇలాంటి చిన్న దేశాలను ఆదుకోవాల్సిన నైతిక బాధ్యత, శిలాజ ఇంధనాల్ని యథేచ్ఛగా వాడుతూ లాభాలు గడిస్తున్న అమెరికా, కెనడా, జపాన్, ఆస్ట్రేలియా, సౌదీ అరేబియా వంటి దేశాలపై ఉంది. కానీ వీరిలో ఏ ఒక్కరూ ఆ సంగతిని గుర్తించడం లేదు. మాడ్రిడ్ సదస్సులో జరిగిన చర్చల తర్వాత ఈ దేశాలు నామమాత్రమైన సాయాన్ని విదిల్చి తమ బాధ్యత తీరినట్టు ప్రవర్తించాయి.

పారిస్ ఒడంబడిక లక్ష్యాలు ఏమిటో, వాటిని సాధించడానికి ఏం చేయాలో ప్రతి దేశానికీ తెలుసు. అన్ని దేశాలూ ఒకే స్థాయిలో కాలుష్యానికి కారణం కావడం లేదు. అలాగే ఈ కాలుష్య పర్యవసానాలను అన్ని దేశాలూ సమాన స్థాయిలో చవి చూడటం లేదు. ఏ ఒక్క దేశమో పూనుకుని ఈ కాలుష్యాన్ని అదుపు చేయడం సాధ్యం కాదు. కనుక ప్రతి దేశమూ కాలుష్యంలో తన బాధ్యతను నిజాయితీతో గ్రహించి, దాని అదుపునకు గరిష్టంగా ఏం చేయగలనో నిర్ణయించుకోవాలి. అందరి లక్ష్యమూ కాలుష్యాన్ని అంతం చేయడమే అయినా, ఎవరెంత కారకులన్న దాన్నిబట్టి భారాన్ని పంచుకోవాలి. కానీ సంపన్న దేశాల వైఖరి వేరుగా ఉంది. అతిగా కాలుష్యాన్ని విడుస్తున్నా దానికి దీటైన చర్యలుండటం లేదు. కనుకనే అందరి మెడలూ వంచే విధంగా నిబంధనలుండాలి. ఆ నిబంధనల మాట అటుంచి కర్బన ఉద్గారాల లక్ష్యాలను సాధించడంలో విఫలమైన దేశాలు తప్పించుకోవడానికి పారిస్ ఒడంబడిక వీలు కల్పించింది. అందులోని ఆరో అధికరణ అటువంటిదే. కర్బన ఉద్గారాల అదుపులో విఫలమైన సంపన్న దేశం... వాగ్దానానికి మించి అదుపు చేసిన దేశాలనుంచి ఆ 'అదనాన్ని' కొనుగోలు చేయొచ్చునని చెప్పే ఈ అధికరణ పరిస్థితి మెరుగుదలకు ఏమైనా దోహదపడుతుందా? మొత్తానికి ఈ సదస్సు ఎప్పటిలాగే సమస్యల్ని వాయిదా వేసింది. వచ్చే ఏడాది బ్రిటన్‌లోని గ్లాస్గోలో వాటిని పరిష్కరిస్తామని ఆశాభావం వెలిబుచ్చింది. కానీ నమ్మేదెవరు? నిర్ణయాత్మకంగా వ్యవహరించలేని ఇలాంటి సదస్సులు చివరకు నిరర్థకమవుతాయి తప్ప సాధించేదేమి ఉండదు.

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు మార్గశిర మాసం, తిథి బ.నవమి రా.7.50 వరకు, తదుపరి దశమి, నక్షత్రం హస్త రా.10.15 వరకు, తదుపరి చిత్త, వర్జ్యం ఉ.7.40 నుంచి 9.10 వరకు, దుర్ముహూర్తం ఉ.8.38 నుంచి 9.22 వరకు, తదుపరి ప.12.17 నుంచి 1.03 వరకు అమృతఘడియలు... సా.4.36 నుంచి 6.02 వరకు.

సూర్యోదయం : 6.28
సూర్యాస్తమయం: 5.26
రాహుకాలం : ఉ.10.30 నుంచి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుంచి 4.30 వరకు

# వలస పాలనకు ప్రతిరూపమీ చట్టం

విశ్లేషణ



అరుణ్ కుమార్

**ఒక విదేశీ శక్తి.. పాలనకు సంబంధించి విభజించి పాలించు సూత్రాన్ని కోరుకుందంటే దానికి కారణాల్ని ఎవరైనా అర్థం చేసుకోవచ్చు. కానీ ఒక జాతీయవాద పార్టీ ఆ పని ఎందుకు చేయాలి? దేశంలోని నిజమైన సమస్యలను పరిష్కరించడంలో అసమర్థంగా వ్యవహరిస్తున్నప్పటికీ అధికారాన్ని ఎలాగోలా బలోపేతం చేసుకోవడానికేనా? ''జాతీయతా స్ఫూర్తిని చైతన్యవంతంగా కలిగి ఉన్నవారు మరొకరి మత వ్యవహారాల్లో జోక్యం చేసుకోరు. అలా జోక్యం చేసుకుంటే వారు ఒక జాతిగా గుర్తించబడరు. భారత్‌లో తాము మాత్రమే ఉండాలని హిందువులు భావించినట్లయితే వారు ఒక కలల లోకంలో జీవిస్తున్నట్లే లెక్క'' అని ఏనాడో గాంధీజీ 'హిందూ స్వరాజ్'లో రాసిన అంశాన్ని జాతి ఎన్నటికీ మర్చిపోకూడదు.**

పౌరసత్వ సవరణ బిల్లు (సీఏబీ) ఇప్పుడు చట్టమైంది. న్యాయస్థానాలు ఈ చట్టాన్ని తోసిపుచ్చినా లేక దాని అమలుపై స్టే విధించినా జాతీయ రాజ్యమైన భారతదేశం స్వభావం గురించి ఇది కొన్ని కీలక ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఇతర దేశాల భూభాగాల్లో అణచివేతను ఎదుర్కొంటున్న వారికి భారత్‌లో ఆశ్రయమిచ్చి, ఉపశమనం కలిగించి, పౌరసత్వాన్ని మంజూరు చేయడం అనే భావనను ఏ ఒక్కరూ వ్యతిరేకించరు. సమస్యల్లా ఏమిటంటే, భారత్ వంటి ఉదార ప్రజాస్వామిక దేశంలో ఎవరికి పౌరసత్వం ఇవ్వాలి, ఎవరికి ఇవ్వకూడదు అనే అంశాన్ని మతం నిర్ణయించవచ్చా? ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఈ అంశంపై మూడు భావధారలు వ్యాప్తి చెందుతున్నాయి.

మొదటగా, సవరణ బిల్లుకు అనుకూలంగా ఓటు వేసినవారు.. ఇరుగుపొరుగు ఇస్లామిక్ దేశాల్లో మతపర మైనారిటీలను తొక్కిపెడుతున్నారని, వీరికి రక్షణ కల్పించాలనే ప్రాతిపదికను ఎంచుకున్నారు. ఇస్లామిక్ దేశాల్లో ముస్లింలను అణిచివేయరు కాబట్టి వీరిని పౌరసత్వ సవరణ బిల్లునుంచి మినహాయించవచ్చని వీరి వాదన.

### శ్రీలంక హిందువులకు మినహాయింపు ఎందుకు?

పైగా, ఇతరదేశాల్లో ప్రత్యేకించి శ్రీలంకలోని హిందూ, ముస్లిం లకు భారత పౌరసత్వం ఇవ్వకుండా ఈ బిల్లులో ఎందుకు మినహాయించారు అంటే 1964లో నాటి శ్రీలంక ప్రధాని సిరిమావో బండారనాయకే, నాటి భారత ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి మధ్య కుదిరిన ఒప్పందం మేరకు కొన్ని లక్షల మంది శ్రీలంక తమిళులకు భారతీయ పౌరసత్వం ఇవ్వడానికి అంగీకరించారు కాబట్టి, ఇప్పుడు వారికోసం మరొక నిబంధన చేర్చాల్సిన అవసరం లేదని వీరి వాదన.

పైగా, నాటి భారత, పాక్ ప్రధానులు నెహ్రూ, లియాఖత్ మధ్య 1950లో కుదిరిన ఒప్పందానికి భారత్ కట్టుబడగా, పాకిస్తాన్ దాన్ని గౌరవించలేదని వీరు వాదిస్తున్నారు. భారత్‌లోని మైనారిటీలను ఇండియా పరిరక్షిస్తూ రాగా, పాకిస్తాన్ నుంచి భారీ సంఖ్యలో హిందువులు భారత్‌కి వలస వచ్చారని వీరి వాదన. పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లలోని హిందువుల జనాభా శాతం బాగా తగ్గిపోతూండగా, భారత్‌లోని ముస్లింల జనాభా పెరుగుతూ వచ్చిందన్న వాస్తవమే తమవాదనకు నిదర్శనం అని చెబుతున్నారు. అంటే ముస్లింలు కోరుకుంటే ఇస్లామిక్ దేశాల్లో ఆశ్రయం తీసుకోవచ్చు కానీ ఇతర దేశాల్లో అణచివేతకు గురైన హిందువులు మాత్రం ఆశ్రయం కోరి భారత్‌కి మాత్రమే రాగలరు కాబట్టి వారి పట్ల జాతి సానుభూతితో ఉండాలని వీరు చెబుతున్నారు.

ఇక రెండోవాదన ఈశాన్య భారత రాష్ట్రాల్లో పౌరసత్వ సవరణ చట్టాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న వారి నుంచి వస్తోంది. భారతదేశంలోకి ఏ మతానికి సంబంధించినవారైనా సరే.. వలస రావడాన్ని వీరు వ్యతిరేకిస్తున్నారు. వలసలు వెల్లువెత్తితే తమ ప్రాంతం వనరులను ఊడ్చేస్తారని, తమ భాష, సంస్కృతి కూడా క్షీణించిపోతుందని వీరి భయం. బంగ్లాదేశ్ నుంచి వచ్చిన బెంగాలీలు ఈ రాష్ట్రాల్లో ఇప్పటికే జనాభా స్వరూపాన్ని ప్రభావితం చేశారు. ఇప్పుడు పౌరసత్వ సవరణ చట్టాన్ని అమలు చేస్తే వలసలు మరింతగా పెరిగి స్థానిక ప్రజలు అస్తిత్వాన్నే కోల్పోయే ప్రమాదముందని వీరి భావన. అందుకే వలస వచ్చే విదేశీయులను దేశంలోని ఇతర ప్రాంతాల్లో సర్దుబాటు చేస్తే ఈశాన్య రాష్ట్రాల ప్రజల భయాలు చాలావరకు సద్దుమణుగుతాయి.




దేశంలో పేలవమైన పాలన, జాతీయ పౌర పట్టిక అమలు సమయంలో తలెత్తిన కల్లోల పరిస్థితుల వల్ల ఈశాన్య రాష్ట్రాల ప్రజలు తమకు కేంద్రప్రభుత్వం ఇచ్చిన హామీలపై విశ్వాసం చూపడం లేదు. ఇక్కడి స్థానిక ప్రజలు కానీ, హిందువులు, ముస్లింలు కానీ రానున్న సంవత్సరాల్లో తమకు న్యాయం జరుగుతుందని విశ్వసించడం లేదు. పైగా, ఈశాన్య రాష్ట్రాల్లోని ఆర్థిక దుస్థితి రీత్యా, ఇప్పటికే తక్కువగా ఉన్న ఉద్యోగాలను వలస ప్రజలు కొల్లగొడతారని, స్థానికుల ఆర్థిక అవకాశాలను తగ్గించివేస్తారని ప్రజలు భయపడుతున్నారు.

### దేశ లౌకిక, సామాజిక నిర్మాణంపైనే దాడి

ఇక మూడో వాదన మతపరమైన వివక్ష ప్రాతిపదికన పౌరసత్వ సవరణ బిల్లును వ్యతిరేకిస్తున్న వారినుంచి వస్తోంది. ఈ బిల్లు నుంచి ముస్లింలను మినహాయించాలని వీరు కోరుకోవడం లేదు. పైగా ఈ చట్టం దేశ లౌకిక సామాజిక నిర్మాణంపైనే దాడిగా వీరు భావిస్తున్నారు. పొరుగుదేశాలనుంచి అణచివేత కారణంగా భారత్‌కు వస్తున్నవారు మతపర కారణాలతోటే కాకుండా జాతి, భాషా పరమైన కారణాల వల్ల కూడా వలస వస్తున్నారని వీరి వాదన.

దారిద్ర్యం వంటి ఆర్థిక కారణాలే వలసలను ప్రభావితం చేస్తుంటాయి. పైగా బలహీనపడుతున్న ఆర్థిక వ్యవస్థ నుంచి దృష్టి మరల్చడానికి పౌరసత్వ సవరణ చట్టాన్ని తీసుకువచ్చారని ప్రతిపక్షం ఆరోపిస్తోంది. పైగా ఈ చట్టం దేశంలో మతపరమైన విభజనను మరిం తగా పెంచి ముస్లిం కమ్యూనిటీని ఏకాకులను చేస్తుంది.

దేశంలో మతతత్వపరమైన వాతావరణం పెరుగుతున్న తరుణంలో మైనారిటీలు అణచివేతకు పాలబడి రెండో తరగతి పౌరులుగా వ్యవహరించబడే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో దేశంలో ఏ ముస్లిం పైన అయినా విదేశీయుడిగా ముద్రవేయడమే కాకుండా తాము విదేశీయులం కామని వారే నిరూపించుకోవలసి ఉంటుంది. జాతీయ పౌర పట్టీ ప్రక్రియ సమయంలో ఈశాన్య రాష్ట్రాల్లో చాలా మంది తగిన డాక్యుమెంటేషన్ కలిగిలేరు. ఇలాంటి వ్యక్తులను పొరుగుదేశాలు అంగీకరించవు కాబట్టి వీరిని శాశ్వతంగా నిర్బంధ శిబిరాల్లోనే ఉంచాల్సి వస్తుందేమో అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పైగా ఇలాంటి వారి జనాభా కూడా అధికంగా ఉంటోంది.

పైగా నిర్బంధ శిబిరాలను ఏర్పర్చి అసంఖ్యాక ప్రజలను వాటిలో పెట్టి నిర్వహించడం భారీ ఆర్థిక భారాన్ని మోపుతుంది. ప్రస్తుతం దేశ ఆర్థిక వ్యవస్థ స్థితి కారణంగా ఇంత అదనపు భారాన్ని మోయడం సాధ్యమేనా? ఇలాంటి అనిశ్చిత పరిస్థితుల వల్ల మదుపు, ప్రత్యేకించి విదేశీ మదుపులు వెనక్కి పోతాయి. దీనివల్ల ఇప్పటికే మాంద్యంలో ఉన్న ఆర్థిక వ్యవస్థ మరింత దిగజారిపోయే ప్రమాదముంది.

మరోవైపున ఎన్నికల మేనిఫెస్టోలో తాము చేసిన వాగ్దానాన్ని నెరవేరుస్తున్నామని బీజేపీ వాదిస్తోంది. ఒక పార్టీ ఎన్నికల ప్రణాళికలో హామీ ఇస్తే అధికారంలోకి వచ్చాక దాని పూర్వాపరాలను పట్టించుకోకుండా దాన్ని అమలు చేయవలసిందేనా? పైగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం చాలా వాగ్దానాలు చేసింది. కానీ అవి అమలుకు నోచుకోలేదు. పైగా ఎన్నికల సమయంలో చేసిన వందలాది హామీలలో ఒక ప్రత్యేక హామీ కోసం ప్రజలు పార్టీలకు ఓటు వేయరు కూడా. పైగా 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ విజయానికి పౌరసత్వ సవరణ చట్టం కారణం కాదు. అనేక ఇతర అంశాలు, ప్రత్యేకంగా ఆర్థిక దుస్థితిని నేర్పుగా పక్కన బెట్టేశారు. అందుకే పాలకపార్టీ హిందూ అనుకూల, ముస్లిం అనుకూల వైఖరిలలో ఏదో ఒకదానిని ప్రజలు స్వీకరించే ఎజెండాతో పనిచేస్తోందా?

### ఏకజాతిగా మనుగడ సాగించలేం!

గాంధీజీ 150వ జయంతి ఉత్సవాలను భారత్ జరుపుకుంటోంది. ఈ సందర్భంగా ఆనాడు హిందూ స్వరాజ్‌లో ''ది హిందూస్ అండ్ మహమ్మదియన్స్' పదవ అధ్యాయంలో గాంధీ ఇలా చెప్పారు. 'భారత్ ఏక జాతిగా మనుగడ సాగించలేదు. ఎందుకంటే అనేక మతాలకు సంబంధించిన ప్రజలు ఇక్కడ నివసిస్తున్నారు. విదేశీయులు ప్రవేశించడం అనే ఒక్క కారణం జాతిని ధ్వంసం చేయలేదు. వారు దేశంలో భాగం అవుతారు... జాతీయతా స్ఫూర్తిని చైతన్యవంతంగా కలిగి ఉన్నవారు మరొకరి మత వ్యవహారాల్లో జోక్యం చేసుకోరు. అలా జోక్యం చేసుకుంటే వారు ఒక జాతిగా గుర్తించబడరు. భారత్‌లో తాము మాత్రమే ఉండాలని హిందువులు భావించినట్లయితే వారు ఒక కలల లోకంలో జీవిస్తున్నట్లే లెక్క''

అందుచేత, దేశాన్ని మతపరంగా విభజించి పాలించాలనే బ్రిటిష్ వలస పాలకుల అసంపూర్ణ కార్యక్రమాన్ని పూర్తి చేయడానికి ఇప్పుడు మనం మతపరంగా విభజించే ఎజెండాను అమలు చేసుకుంటూ పోతున్నామా? ఒక విదేశీ శక్తి విభజించి పాలించు సూత్రాన్ని కోరుకుందంటే దానికి కారణాల్ని ఎవరైనా అర్థం చేసుకోవచ్చు. కానీ ఒక జాతీయవాద పార్టీ ఆ పని ఎందుకు చేయాలి? దేశంలోని నిజమైన సమస్యలను పరిష్కరించడంలో అసమర్థంగా వ్యవహరిస్తున్నప్పటికీ అధికారాన్ని ఎలాగోలా బలోపేతం చేసుకోవడానికేనా?

(ది వైర్ తోడ్పాటుతో)

వ్యాసకర్త మాల్కొమ్ ఎస్ ఆదిశేషయ్య చైర్ ప్రొఫెసర్, ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్, రచయిత

## సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!




సోషల్ మీడియా

### సిగ్గుచేటు



"ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా శాంతియుతంగా దేశ ప్రజలు నిరసన తెలపడం ఇప్పుడు నేరమా? ఆ నిరసన తెలుపుతున్న వ్యక్తి కాంగ్రెస్ నేతలకు సంబంధించిన వ్యక్తి కావడం రెండింతలు నేరమా? పద్దెనిమిదేళ్ల అజయ్ మాకెన్ కుమారుడు సాహిల్‌ను లాక్కుపోయి బస్‌లో తోశారు. ఆయన తన కుమారుడితో మండీ హౌస్ దగ్గర మాట్లాడుతూ ఉండగా ఆయన భార్య, కుమార్తెలను కూడా బలవంతంగా లాక్కెళ్లి బస్‌లో తోశారు. వీళ్లందరినీ మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించారు"

– శర్మిష్ఠా ముఖర్జీ, కాంగ్రెస్ నేత

### శాంతి



"అంతా శాంతిని నెలకొల్పండి. హింసాత్మక చర్యలను నిలిపి వేయండి, ఇది ఎవరికీ మేలు చేయదు. హింసాయుతంగా కాకుండా అనేక ఇతర మార్గాల ద్వారా ఈ సమస్యను పరిష్కరించుకోవచ్చు. విద్యార్థులు, పోలీసులు, అధికారులందరికీ ఈ విజ్ఞప్తి చేస్తున్నా"

– హర్భజన్ సింగ్, క్రికెటర్

### ఇదే రోజు



"మేము ఢిల్లీలో వైఫై సర్వీసులను ప్రారంభించిన రోజే మొబైల్ సేవలు అందించేవారు ఇంటర్నెట్‌ను నిలిపివేయడం విషాదకరం. కేవలం ఇంటర్నెట్ మాత్రమే కాదు, ఎస్ఎంఎస్, వాయిస్ సేవలను కూడా కొన్ని ప్రాంతాల్లో నిలిపివేశారు"

– అమన్ శర్మ, జర్నలిస్ట్

### నిలిపివేత



"ఈ దక్షిణ ఢిల్లీలో కూడా కాసేపు మొబైల్, ఇంటర్నెట్ సేవలను నిలిపివేస్తే బావుంటుందని అనుకుంటున్నా. అప్పుడు నేను ఒక్కడినే వొడాఫోన్ వినియోగదారుడినని అర్థం చేసుకుంటా. వొడాఫోన్ వినియోగదారులెప్పుడూ ఎరోప్లేన్ మోడ్‌లోనే ఉంటారు"

– ఆనంద్ రంగనాథన్, రచయిత

### అంతే



"మన దేశంపై చాలా విస్తృతమైన, లోతైన, ఆలోచనను రేకెత్తించే పుస్తకాల్లో రామచంద్ర గుహ రాసిన 'ఇండియా ఆఫ్టర్ గాంధీ' ఒకటి. ఇవాళ ఆయనను కూడా నిర్బంధించారు. ఇంతకంటే చెప్పడానికేమీ లేదు" – పర్మీందర్ సింగ్, మాజీ ఎండీ

### సమావేశం



"సెలవులకు దక్షిణ కొరియా వెళ్లిన నేత నుంచి సమాచారం అందాక వర్కింగ్ కమిటీ సమావేశం ఏర్పాటుపై చర్చించడానికి కాంగ్రెస్ కోర్ గ్రూప్ త్వరలో సమావేశం అవుతుంది. అనంతరం దేశవ్యాప్తంగా అలుముకున్న అశాంతిపై సోనియా గాంధీ స్పందనను ఎప్పుడు ప్రకటించాలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ నిర్ణయించనుంది"

– శివ్ అరోరా, జర్నలిస్ట్

### సరిదిద్దాలి



"సీఏఏలాంటి చట్టం ఎందుకు? విదేశీయుల నుంచి మనవారికి ఎక్కువ ఇబ్బందులు ఎదురవుతున్నాయనా? ఎన్నార్సీ పేరుతో మరో చట్టం వస్తోంది. తమను తాము దేశీయులమని నిరూపించుకోకపోతే భారతీయులంతా విదేశీయులైపోతారు. దీన్ని సరిదిద్దాల్సి ఉంది" – చేతన్ భగత్, రచయిత

# మీకిది తగునా?

విశ్లేషణ



మాడభూషి శ్రీధర్

'బోలెడంత మంది బ్లాక్ మెయిల్ చేస్తున్నారు... వసూళ్లు నడుస్తున్నాయి' అని ఆర్టీఐ గురించి మన దేశంలో సర్వోన్నత న్యాయమూర్తి బోబ్డేగారు సెలవిచ్చారు. జస్టిస్ బి ఆర్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్ తో కలిసి ప్రధాన న్యాయమూర్తి ఎస్ ఎ బోబ్డే ఒక ప్రజా ప్రయోజన వ్యాజ్యం విచారిస్తున్నారు. ఇదివరకు సుప్రీంకోర్టు అంజలీ భరద్వాజ్ కేసులో సమాచార కమిషనర్ల నియామకంలో ఆలస్యం చేయరాదని ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పుడు ఆ తీర్పులో ఇచ్చిన సూచనలు అమలు చేయడం లేదని కేంద్రంగానీ రాష్ట్రాలు గానీ సమాచార కమిషనర్లను నియమించడం లేదని న్యాయార్థులై నిలబడ్డారు. కోర్టుకు వెళ్లి ఆదేశాలు తెచ్చుకుంటే తప్ప ప్రభువులు నిశ్చర్య నుంచి నిద్రనుంచి మేలుకోవడం లేదు.

ఆర్టీఐని బ్లాక్ మెయిల్ కోసం వాడుకుంటున్నారనేది ఆరోపణ. అందులో కొంత నిజం ఉందా లేదా అనడానికి సర్వే లేదు సాక్ష్యం లేదు. బ్లాక్ మెయిల్ అంటే ఏమిటి? లంచం తీసుకోవడం వంటి ఒక తప్పు చేసి దాచిపెట్టిన అధికారి అక్రమాల సమాచారం సేకరించి బయట పెట్టడానికి ఆర్టీఐ కార్యకర్త ప్రయత్నించి ఆ పని ఆపడానికి డబ్బు అడిగినా, అతను అడగకపోయినా ఆ అధికారి డబ్బు ఇచ్చి కప్పిపుచ్చడానికి ప్రయత్నించినా అది నేరమే. ఆ నేరానికి వారిద్దరికీ శిక్షలు విధించాల్సిందే. కానీ ఆ విధంగా బ్లాక్ మెయిల్ చేయకుండా ఉండేందుకు ఆర్టీఐ ద్వారా సమాచారం సేకరించే శక్తి పైన కోతలు విధిస్తానంటే ఎంత వరకు సమంజసం.

ఒక సందర్భంలో అవినీతి పరుడైన ఒక ఇంజనీరు ఢిల్లీ ప్రభుత్వంలో లంచాలు తీసుకుని అందుకు అనుగుణంగా కాంట్రాక్టు ఫైళ్లను మార్చాడని తెలుసుకున్న ఒక ఆర్టీఐ కార్యకర్త ఆ ఫైల్ కాగితాల ప్రతులను సేకరించారు. దాంతో ఆ అధికారి పదివేలు లంచం ఇవ్వడానికి సంసిద్ధుడైనాడు. లంచం ఇవ్వజూపిన సంభాషణలను రికార్డు చేసి ఆ ఆర్టీఐ కార్యకర్త రెండో అప్పీలులో ఆ విషయమై ఫిర్యాదు చేశాడు. లంచం ఇవ్వబోయిన ఆ ప్రభుత్వ అధికారిపైన చర్య తీసుకోవాలని కోరాడు. సంభాషణ రికార్డు ఉన్న సీడీని కూడా కమిషన్‌కు సమర్పించాడు.

లంచం ఇచ్చినా నేరమే తీసుకున్నా నేరమే. కానీ అది ప్రభుత్వ అధికారి విషయంలో, ప్రభుత్వ కార్యక్రమం విషయంలో నేరమవుతుంది. ఆర్టీఐ కింద సమాచారం అడగకుండా ఉండడానికి మామూలు పౌరుడికి లంచం ఇవ్వడానికి ప్రభుత్వం అధికారి ప్రయత్నిస్తే, లేదా ఇచ్చినట్టు తేలిన తరువాత కూడా అతని పైన ఏ చట్టం కింద చర్య తీసుకోవాలి?

అవినీతి నిరోధక చట్టాలలో ఇటువంటి లంచగొండితనాన్ని శిక్షించేందుకు ఏ నియమాలు చట్టాలూ లేవు. పౌరుడికి ప్రభుత్వేతర పనికోసం ప్రభుత్వ అధికారి లంచం ఇవ్వడాన్ని తీవ్రమైన నేరంగా పరిగణిస్తూ మరో చట్టం తెస్తే అందుకు వీలవుతుంది. లేకపోతే ఏం చేయాలి?

ఎప్పుడూ జనం నుంచి లంచాలు వసూలు చేసే ప్రభుత్వ అధికారి పౌరుడికి లంచం ఇచ్చే పరిస్థితి రావడం ఒక వింత, విచిత్రం, రాజ్యాంగ పాలన అమలైన 70 సంవత్సరాల కాలంలో ఇటువంటి సంఘటన ఎప్పుడూ జరగలేదు. ఇందుకు సంతోషించాలో గర్వించాలో ఆలోచించుకోవచ్చు.

లంచం ఇవ్వకుండా లంచగొండి అధికారిని రక్షించాలన్నది మన లక్ష్యం కాదు. ఆర్టీఐ దుర్వినియోగం పేరుతో కొందరు బ్లాక్ మెయిల్ చేస్తున్నారనే ప్రచారంతో మనం ఆర్టీఐ కార్యకర్తలను నిరోధించడానికి ఈ చట్టాన్ని సవరించి, పరిమితులు విధించి, ఈ హక్కు ను నీరసించేట్టు చేస్తే అది ధర్మమని అంటారా? అది న్యాయమా?

130 కోట్ల మంది ప్రజలలో కేవలం 3 కోట్ల యాభై లక్షల మంది దాకా ఆర్టీఐ వాడుకున్నారని, వారిలో చాలామంది సమాచారం పొందారని, పదిపదిహేను శాతం వరకు సమాచారం కోసం కోర్టులకెక్కి పోరాడవలసి వస్తున్నదని ఒక అంచనా. అంటే మన జనాభాలో కేవలం రెండు లేదా మూడు శాతం మంది సమాచార హక్కును వినియోగించుకుంటేనే ఇంతమంది ఇంతగా భయపడుతున్నారంటే ఆశ్చర్యం వేస్తుంది. మన స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను రక్షించే ఒకే ఒక ఉత్తమ ఉన్నత సంస్థ న్యాయస్థానం. అంటే సుప్రీంకోర్టు. కానీ ఆ సర్వోన్నత న్యాయపీఠం కూడా సమాచార హక్కు గురించి ఇంతగా చర్చించడం, ధర్మాసనం నుంచి ఇటువంటి తీవ్ర వ్యాఖ్యలు చేయడం ఏ పరిణామాలకు సంకేతం?

వ్యాసకర్త బెన్నెట్ యూనివర్సిటీ ప్రొఫెసర్, కేంద్ర సమాచార మాజీ కమిషనర్

madabhushi.sridhar@gmail.com

# గరిమెళ్ల గర్జనకు వందేళ్లు!

సందర్భం



అట్టాడ అప్పల్నాయుడు

గాంధీ పిలుపుతో ఉధృతంగా సాగుతోన్న సహాయనిరాకరణోద్యమ సమయంలో ఉద్యమకారుల గళాలు గర్జించిన 'మాకొద్దీ తెల్లదొరతనం...' గీతానికి వందేళ్లు! జాతి యావత్తుకీ ఉద్యమ గీతమందించిన గరిమెళ్ల సత్యనారాయణ రాజకీయోద్యమ రచయిత! సాహిత్యాన్ని సామాజిక అభ్యున్నతికి వినియోగించాలనే లక్ష్యాన్ని కలిగిన రచయిత! స్వాతంత్ర్యోద్యమ సందర్భాన రాసిన 'స్వరాజ్యగీతాలు' (1921), 'హరిజన పాటలు' (1923) వంటి గీతాలు ఉత్తేజాన్ని రగిలించాయి. దాంతో గరిమెళ్లను తెల్లదొరలు నిర్బంధానికి గురిచేశారు. కేవలం 'మాకొద్దీ తెల్లదొరతనం...' గీతాలాపన కలిగించే ఉద్రేకాన్నీ, ఉత్తేజాన్నీ స్వయానా విని గ్రహించిన ఆంగ్లేయ అధికారి, తెలుగుభాష తెలియని తననే యింతటి సంచలనానికి గురిజేస్తే, భాష తెలిసిన ప్రజలనింకా సంచలనానికి గురిజేసి ఉద్యమోన్ముఖులను జేస్తుందని రాజద్రోహనేరం ఆరోపించి గరిమెళ్లను ఏడాది పాటు జైల్లోకి నెట్టారు. జైలులో వున్నపుడే గరిమెళ్ల తండ్రి, తాతయ్య, భార్య మరణించారు. జైలులో నున్న గరిమెళ్ల ఈ విషాద సందర్భంలోనయినా పెరోల్‌పై విడుదల కోసం, క్షమాభిక్ష కోరడం వంటి చర్యలకు దిగజారలేదు.

జాతీయోద్యమం ఉధృతంగా ఉన్నపుడు ప్రజలను ఉత్తేజపరచడానికి ఉపయోగపడే పాటలను రాసిన గరిమెళ్ల ఉద్యమం నెమ్మదించినపుడూ, స్వాతంత్ర్యం సిద్ధించాక ప్రజలను ఆలోచింపచేయడానికి వ్యాసరచనలు చేశాడు. రాజకీయాలను ప్రభావితం చేసే ఆర్థిక పరిస్థితుల గురించి, జస్టిస్ పార్టీ, స్వరాజ్యవాదుల గురించీ ఆంధ్రరాష్ట్ర ఏర్పాటుకు గరిమెళ్ల తన భావాలను వెల్లడించారు. అభ్యుదయకర భావావేశం, రష్యా కమ్యూనిజంపట్ల అనురక్తీ వుండినా భారతదేశానుకూల కమ్యూనిజం కావాలనడం, దేశాన్ని అభివృద్ధి చేయడానికి 'అవతారమూర్తి దిగిరావాలనడం' వంటి భావాల పరిమితి గరిమెళ్ల వ్యాసాల్లో కన్పించినా ఆయన నిబద్ధ ప్రజా పక్షపాత రాజకీయ రచయితే! రాజకీయ సంబంధ అంశాలతో పాటు కథ, నవల, భాషా పరిణామం వంటి సాహిత్యాంశాల మీద కూడా అనేక రచనలు చేశారు. గృహలక్ష్మి, కృష్ణాపత్రిక, ఆనందవాణి, ఢంకా, ఆంధ్రప్రభ నుంచి భారతి దాకా అనేక పత్రికల్లో గరిమెళ్ల రచనలు ప్రచురణ అయ్యాయి. తమిళంలోని 'తిరుక్కుళ్', 'నందియార్' లనూ; కన్నడలోని 'తళ్లికోట' రచననూ తెలుగులోకి అనువదించారు. భోగరాజు పట్టాభి సీతారామయ్య గారి 'ఎకనమిక్ కాంక్వెస్ట్ ఆఫ్ ఇండియా' రచనను తెలుగులోకి అనువదించారు. తనకూ, తనతో మిగిలిన తల్లి, చెల్లెలకూ పట్టెడన్నం పెట్టలేక స్వగ్రామాన్ని వదిలి వెళ్లాల్సిన సందర్భంలో కూడా సాహిత్యం కోసం తాతలనాటి ఇంటిని అమ్మేసి 'శారదా గ్రంథమాల' స్థాపించారు. రచనారంగం, రాజకీయభావజాలం కారణంగా ఉపాధ్యాయ ఉద్యోగం, గుమస్తా ఉద్యోగం కోల్పోయేరు. తర్వాత జీవికకోసం చిన్నచిన్న నౌకరీలు చేశారు. దుర్భర దారిద్ర్యాన్ని అనుభవించారు. బతుకుతెరువు కోసం చివరికి బిచ్చమెత్తుకొని జీవించారు. తన గళాన్నీ, కలాన్నీ దేశాభ్యుదయానికే వినియోగించిన ఆ మహనీయుడు 1952 డిసెంబర్ 18న మద్రాస్‌లో మహానగరంలో అనామకుడిగా మరణించాడు.



గరిమెళ్ల జాతికి అందించిన 'మాకొద్దీ తెల్ల దొరతనం...' ఉద్యమగీతానికి వందేళ్లు! స్వాతంత్ర్యోద్యమంలో ఏ ఆశయాలతో, ఆకాంక్షలతో గరిమెళ్ల వంటి అనేకులు త్యాగాలు చేశారో ఆ ఆశయాలు, ఆకాంక్షలేవీ నెరవేరలేదు. కుల, మత, లింగ, ప్రాంత అసమానతలతో మండుతున్న ఖండంలా ఉంది దేశం! 'కుక్కలతో కొట్లాడీ కూడూ తింటామండీ' అన్న గరిమెళ్ల ఆవేదన యిప్పటికీ మాసిపోలేదు. వందేళ్ల నాటి గరిమెళ్ల గర్జనను మళ్లీ అందిపుచ్చుకోవాల్సిన సందర్భంలోనే దేశమింకా వుంది.

(డిసెంబర్ 22వ తేదీన శ్రీకాకుళంలో గరిమెళ్ల సంస్మరణోత్సవం)

వ్యాసకర్త అధ్యక్షులు, ఉత్తరాంధ్ర రచయితలు, కళాకారుల వేదిక

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
శుక్రవారం ॥ 20-12-2019





ప్రియా సేథ్

# ఎగతాళి చేసినా లెక్కచేయలేదు

**సినిమా ఒక రంగుల ప్రపంచం. ఇరవై నాలుగు విభాగాలతో నడిచే పరిశ్రమ. వాటిల్లో ఎక్కువ భాగం పురుషులే ఉంటారు. మహిళలు రావాలనుకున్నా వింతగా చూస్తారు. 'మీ వల్ల అవుతుందా?' అని నిరుత్సాహపరుస్తారు. అడుగడుగునా పైకి కనిపించని అవాంతరాలు సృష్టిస్తారు. అయితే "వీటన్నిటినీ ఎదుర్కొని ముందుకు వెళ్లాలి" అంటున్నారు ఈ ముగ్గురు మహిళా సినిమాటోగ్రాఫర్లు.**

సినిమా రంగంలో మహిళా సినిమటోగ్రాఫర్ల సంఖ్య చాలా తక్కువ. ఆ తక్కువలో కాస్త ఎక్కువగా ఫౌజియా ఫాతిమా (47), దీప్తి గుప్తా (46), ప్రియా సేథ్ (44) నిలదొక్కుకోగలిగారు. ''గతంతో పోలిస్తే ఇప్పుడు మహిళలు చాలామంది సినిమాఫొటోగ్రఫీ రంగంలోకి వస్తున్నారు. ముఖ్యంగా హిందీ పరిశ్రమలో. అందువల్లే 2015లో ఇండియన్ ఉమెన్ ఫొటోగ్రాఫర్స్ కలెక్టివ్‌ను ప్రారంభించాం. ఆ సంస్థ ద్వారా ఇప్పుడు మరింతమంది మహిళల్ని ఈ రంగంలోకి వచ్చేలా ప్రోత్సహించడం కోసం ఒక ప్రణాళికను రూపొందిస్తున్నాం'' అంటున్నారు ఫాతిమా, గుప్తా, సేథ్. ప్రధానంగా మహిళా ఫొటోగ్రాఫర్ల సంఖ్య పెంచాలన్నదే వీరి లక్ష్యం. ప్రస్తుతం వీరి సంస్థలో 78 మంది సభ్యులు ఉన్నారు. ఫాతిమా 'మిత్ర్ మై ఫ్రెండ్', 'ముదల్ ముదల్ ముదల్ వారాయ్' చిత్రాలకు పనిచేశారు. చాలా సంవత్సరాలుగా సినిమాటోగ్రఫీ గురించి పాఠాలు చెబుతున్నారు. దీప్తీ గుప్తా 'హనీమూన్ ట్రావెల్స్ ప్రైవేట్ లిమిటెడ్' తో పాటు, మ్యూజిక్ వీడియోలు, డాక్యుమెంటరీలు తీశారు. 'షటప్ సోనా' అనే డాక్యుమెంటరీతో తన కెరీర్‌ను ప్రారంభించారు. ఇక సేథ్‌కి 'అండర్ వాటర్' సినిమాటోగ్రాఫర్‌గా పనిచేసిన అనుభవం ఉంది. దీనితో పాటు కమర్షియల్ యాడ్స్ చేస్తున్నారు. లొకేషన్ స్టూడియో నడుపుతున్నారు. రాజా మీనన్ తీసిన 'బారహ్ అణా', 'ఎయిర్ లిఫ్ట్ అండ్ చెఫ్' సినిమాలకు పనిచేశారు. కెరీర్‌లో ఎదిగే క్రమంలో ఈ ముగ్గురూ ఎదుర్కొన్న మూడు భిన్నమైన అనుభవాలను చూస్తే.. వివక్ష ఈ స్థాయిలో ఉంటుందా అనిపిస్తుంది. అదే సమయంలో.. అంతటి వివక్షను తట్టుకుని నిలబడ గలిగినందుకు వీరిని అభినందించి తీరాలనిపిస్తుంది.

– జయంతి

## క్రేన్ ఎత్తగలవా!


అండర్ వాటర్

''మా ఇంట్లోవాళ్లు సినిమాలు చాలా తక్కువగా చూస్తారు. చిన్నప్పటి నుంచీ సంగీతం వినేదాన్ని, నాటకాలు చూసేదాన్ని. బోర్డింగ్ స్కూల్‌లో ఉన్నప్పుడు టీవీ చూడనిచ్చేవారు కాదు. పెయింటింగ్స్, ఫొటోల నుంచి చాలా తెలుసుకున్నాను. కాలేజీలో చదువుకుంటున్న రోజుల్లో యుటీవీలో ఇంటర్న్‌షిప్ చేశాను. అప్పట్లో సౌండ్ ఇంజినీర్‌గా కాని సినిమాటోగ్రఫర్‌గా కాని పనిచేయాలనుకునేదాన్ని. నేను న్యూయార్క్‌లో ఫిల్మ్ మేకింగ్ కోర్సు చేస్తున్నప్పుడు, మా ప్రొఫెసర్ నన్ను, 'ఇంటికి వెళ్లిపోవాలా, పని పూర్తి చేయాలా అని ఆలోచిస్తున్నావ్ కదా' అని వ్యంగ్యంగా అన్నారు. నాకు ఇటువంటి వివక్ష ఉంటుందని అప్పటివరకు తెలియదు. నేను వెల్హామ్ గర్ల్స్ స్కూల్‌లో చదువుకున్నాను. అక్కడ లింగవివక్ష ఉండేది కాదు. అక్కడి వాతావరణం చాలా ఆహ్లాదంగా ఉండేది. నేను సినిమా సెట్‌లో మొదటిరోజు పనిచేయడానికి వచ్చినప్పుడు, ఒక కుర్రవాడు వచ్చి, 'నువ్వు ఒక క్రేన్‌ను ఎత్తగలిగితే నీకు వంద రూపాయలు ఇస్తాను' అన్నాడు వెటకారంగా. నేను రెండు క్రేన్ల బరువు ఎత్తి, రెండు వందలు ఇవ్వమని అడిగాను. నేను నిజంగానే రెండు వందలు అడిగి తీసుకున్నాను'' అని చెప్పారు ప్రియా సేథ్.


ఫౌజీ ఫాతిమా

## ఉండే ముఖమేనా?

''నాకు ఐదు సంవత్సరాల వయసున్నప్పుడు మా నాన్నగారు నాకు రేంజ్ ఫైండర్ కెమెరాను ఉపయోగించడం నేర్పించారు. టెలివిజన్‌లో వచ్చే ప్రాంతీయ భాషా చిత్రాలను తప్పనిసరిగా చూస్తాను. నాకు నా ఎనిమిదో ఏట నుంచే గురుదత్ అంటే చాలా ఇష్టం. ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్‌కి దరఖాస్తు చేసుకున్నవారిలో నేను ఒక్కర్తినే అమ్మాయిని. నా కంటే ముందు మహిళలు లేకపోవడం వల్ల నేను ఇబ్బందులు ఎదుర్కొన్నాను. అక్కడ నన్ను 'నువ్వు ఈ రంగంలో కొనసాగగలవా?' అని గుచ్చి గుచ్చి అడిగేవారు. 'నువ్వు పని చేయాలనుకుంటున్నావా, సెటిల్ అవ్వాలనుకుంటున్నావా' అంటూ వేధించేవారు. వాళ్ల ఉద్దేశం ఉండే ముఖమేనా అని! 'అసలు నీకు కెమెరా బరువు ఎంతో తెలుసా?' అని నన్ను ప్రశ్నించిన సమయంలో, అక్కడ రేణూ సలూజా (ఎడిటర్) ఉన్నారు. ఆవిడ 'షటప్' అనటంతో ఆ ఎగతాళికి తెర పడింది' అన్నారు దీప్తి గుప్తా.


దీప్తి గుప్తా


హనీమూన్ ట్రావెల్స్ ప్రైవేట్ లిమిటెడ్

## నీకో సీట్ వేస్ట్

''చెన్నైలో ఉంటున్న మా కుటుంబ సభ్యులందరికీ సినిమా పిచ్చి. మా నాన్నగారు హిచ్‌కాక్ సినిమాలు, కౌబాయ్ సినిమాలు చూస్తుంటారు. మా అత్తయ్య శివాజీగణేశన్ అభిమాని. అందువల్ల నేను ఆ పిచ్చిలో మునిగిపోయాను. ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఇంటర్వ్యూకి వెళ్లినప్పుడు, 'నీ కోసం సీట్ వేస్ట్ చేయదల్చుకోలేదు' అన్నారు. నాకు లోపల్లోపలే కోపం వచ్చింది. నేను సినిమాటోగ్రఫీ కోర్సు చేయాలని ఆ రోజే ప్రమాణం చేసుకున్నాను'' అన్నారు ఫౌజీ ఫాతిమా.


ముదల్ ముదల్ ముదల్ వారాయ్

చెట్టు నీడ

# చెదరని భక్తి

అత్యున్నతమైన ఆత్మీయ స్థాయిలోని విశ్వాసికి పొందడం, పోగొట్టుకోవడం అనేవి సమానానుభవాలు. చాలా చిన్న విషయాలు. యోబు లాంటి నీతిమంతుడు, భక్తిపరుడు లోకంలోనే లేడని దేవుడు మురిసిపోతుంటే.. 'అంత సంపదనిచ్చావు కాబట్టే అతనికంత భక్తి' అంటూ సాతాను ఈర్ష్యపడ్డాడు.



యోబుది 'సంపదతో నిమిత్తం లేని భక్తి' అని రుజువయ్యేందుకుగాను దేవుడతని జీవితాన్ని అస్తవ్యస్తం చేసేందుకు సాతానుకు అనుమతినిచ్చాడు. ఫలితంగా ఒక్క రోజులోనే అతని ఆస్తి, సంతానమంతా తుడిచిపెట్టుకుని పోయింది. ఒళ్లంతా పుండ్లతో చర్మవ్యాధిగ్రస్తుడై దరిద్రానికి, కడు దుఃఖానికి చిరునామాగా మారినా కృంగిపోకుండా 'యెహోవా ఇచ్చాడు, యెహోవా తీసుకున్నాడు. యెహోవా నామానికే స్తుతి కలుగును గాక' అంటూ సాష్టాంగపడి దేవుని ఆరాధించి దేవుడే నిజమని మొదటి అధ్యాయంలోనే యోబు రుజువు చేశాడు (యోబు 1:21). అయితే ఆ తరువాత 36 అధ్యాయాల్లో అతని ప్రగతిని, పతనాన్ని ఈర్ష్యతో 'పంచనామా' చేస్తూ అతని స్నేహితులు చేసిన విమర్శలు, వ్యంగ్యాస్త్రాలే యోబును మరెక్కువగా బాధపర్చాయి. మన జీవితం దైవ భక్తితో వెన్నలాగా, జున్నులాగా సాగుతూ వెలుగుతున్నప్పుడు, అదను దొరికితే లోకం ఎలా విషం చిమ్ముతుందో తెలియజెప్పడమే యోబు గ్రంథ సారాంశం. అయితే అంత దీన స్థితిలోనూ వారిని యోబు రోషంతో ఎదిరించాడు. చివరకు దేవుడతని విశ్వాసాన్ని ఘనపరిచి పూర్వపు క్షేమస్థితిని, రెట్టింపు ఆస్తిని ఇచ్చాడు. ముందు సంపదున్నప్పుడు, అది పోయినప్పుడు, ఆ తర్వాత అంతకు రెట్టింపు దొరికినప్పుడు కూడా తన భక్తిలో తేడా రాలేదని రుజువు చేసుకున్న యోబు విశ్వాసులందరికి ప్రామాణికమయ్యాడు.

– సందేశ్ అలెగ్జాండర్

## తిరుప్పావై 5వ పాశురం

**మాయనై మన్ను వడమదురై మైందనై**
**తూయ పెరునీర్ యమునైత్తుఱైవనై**
**ఆయర్ కులత్తినిల్ తోంఱుం అణి విళక్కై**
**తాయై క్కుడల్ విళక్కం శెయ్ద దామోదరనై**
**తూయోమాయ్ వందు నాం**
**తూమలర్ తూవి త్తొళుదు**
**వాయినాల్ పాడి మనత్తినాల్ శిందిక్క**
**పోయ పిళ్ళైయుం పుగుదురువాన్ నిన్ఱనవుం**
**తీయనిల్ తూశాగుం శేప్పేలోర్ ఎమ్బావాయ్**


బొమ్మ: కేశవ్ వెంకటరాఘవన్

కృష్ణస్తుతితో మన పాపాలన్నీ పటాపంచలౌతాయి. యదువంశంలో, ఉత్తర మధురలో జన్మించిన ధీశాలి, యమునాతరంగాలపై జలక్రీడలాడే ప్రభువు, నీలమేఘ ద్యుతిమంతుడై, తన తల్లి యశోద పుణ్యగర్భానికి యశస్సును కూర్చిన దీపకళికయైన కృష్ణుని దగ్గరకు వెళ్లి, పవిత్ర హృదయులమై స్మరణ, మనన, కీర్తనలతో అతడే పరమలక్ష్యంగా ఆరాధిస్తే మనం చేసిన పాపకర్మలే గాక– చేస్తున్న, చెయ్యబోయే పాపాలు కూడా అగ్నికి ఆహుతైన సమిధలవలె భస్మమౌతాయి. రండి, ఆతడి గుణగానం చేదాము .' ఈ పాశురంలో కృష్ణమాయ దోబూచులాడుతుంది. పసిబిడ్డడిగా ఉన్నప్పుడే పూతన వంటి రాక్షసిని, తనను తుదముట్టించ వచ్చిన రాక్షసులను మట్టుపెట్టాడు. అటువంటి బాల గోపాలుడి అల్లరి, గోపకాంతల గగ్గోలు భరించలేక తల్లి యశోద ఆయనను తాటితో రోటికి కట్టివేసింది. యశోద ఆయన తల్లి మాత్రమే కాదు, భక్తురాలు కూడా. తనకున్న భక్తపారతంత్ర్య లక్షణం వల్ల ఆమె మమతాపాశానికి బందీ అయినాడు దామోదరుడు. మహానుభావులు వశులయ్యేది ప్రేమపాశానికి మాత్రమే కదా. తల్లి కట్టిన తాటికి కట్టుబడ్డ దామోదరుని మనం ఏకాగ్ర మనస్కులమై, పవిత్రమైన హృదయంతో పుష్పాంజలి సమర్పించి పూజించాలి అని చెబుతుంది ఆండాళ్. శ్రీమన్నారాయణునికి తులసీ పుష్ప సమర్పణం, మంత్రపుష్ప సమర్పణం ప్రియమైనవి. అందుకే ఆండాళ్ అవి సమర్పించమని హితం చెబుతోంది. పుష్పాంజలి తరువాత నామసంకీర్తనం (వాయినాల్ పాడి ) చెయ్యాలి.

– శ్రీదేవి మురళీధర్

## ముగ్గు-ముచ్చట



**గోకవరపు సుహాసిని**
మచిలీపట్నం

19 చుక్కలు
3 వచ్చేవరకు
మధ్య చుక్క





**దీపిక**
హైదరాబాద్

12 చుక్కలు
2 వరుసలు
2 వచ్చేవరకు





# అక్షయ్ 2 రజనీ 13 ప్రభాస్ 44


అక్షయ్‌కుమార్


రజనీకాంత్


ప్రభాస్


త్రివిక్రమ్

ప్రఖ్యాత ఫోర్బ్స్ మ్యాగజీన్ ప్రతి ఏడాది టాప్ 100 సెలబ్రిటీల జాబితాను విడుదల చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది విడుదల చేసిన 'ఇండియన్ టాప్ 100' సెలబ్రిటీల జాబితాలో సినీ రంగం నుంచి 293.25 కోట్ల ఆర్జనతో రెండో స్థానంలో నిలిచారు బాలీవుడ్ కిలాడీ అక్షయ్ కుమార్. 2017లో నాలుగు, 2018లో మూడు స్థానాలను కైవసం చేసుకున్న అక్షయ్ ఈసారి మరో మెట్టు పైకి ఎక్కి రెండో స్థానం సంపాదించడం విశేషం. ఇక 2017, 2018 సంవత్సరాల్లో ఈ జాబితాలో తొలి స్థానంలో ఉన్న బాలీవుడ్ కండలవీరుడు సల్మాన్‌ఖాన్ 229.25 కోట్ల ఆర్జనతో ఈ ఏడాది మూడో స్థానానికే పరిమితం కావాల్సి వచ్చింది. ఇంకా హిందీ పరిశ్రమ నుంచి అమితాబ్ బచ్చన్ (4,) షారుఖ్ ఖాన్ (6), రణ్‌వీర్ సింగ్ (7), ఆలియా భట్ (8), దీపికా పదుకోన్ (10) టాప్ టెన్ లిస్ట్‌లో చోటు సంపాదించుకున్నారు. ఇక వందకోట్ల సంపాదనతో ఈ జాబితాలో 13వ స్థానంలో నిలిచి దక్షిణాది స్టార్స్‌లో అందరికంటే ముందు ఉన్నారు రజనీకాంత్. గత ఏడాది ఫోర్బ్ జాబితాలో రజనీది 14వ స్థానం. ఈ ఏడాది ఏఆర్ రెహమాన్ 16, మోహన్‌లాల్ 27వ స్థానాల్లో నిలిచారు.

మరోవైపు మన తెలుగు పరిశ్రమ నుంచి ఫోర్బ్స్ టాప్ 100 సెలబ్రిటీల జాబితాలో నిలిచిన వారిలో ప్రభాస్ ముందు వరుసలో ఉన్నారు. 2017లో 22వ స్థానం, గత ఏడాది అసలు ఈ లిస్ట్‌లోనే లేని ప్రభాస్ 2019 లిస్ట్‌లో 44వ ర్యాంక్‌లో నిలిచి టాలీవుడ్ హీరోల తరఫున ఈ లిస్ట్‌లో బోణీ కొట్టారు. ఇక 2017లో 37, 2018లో 33 ర్యాంకర్‌గా నిలిచిన మహేశ్‌బాబు ఈ ఏడాది 54వ స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఇంకా 68వ స్థానంలో తాప్సీ, 77వ స్థానంలో త్రివిక్రమ్ నిలిచారు. ఇక క్రీడా రంగంలో భారత క్రికెట్ జట్టు కెప్టెన్ విరాట్ కోహ్లీ నంబర్ వన్ స్థానంలో నిలిచారు. ఇతర స్టార్ క్రికెటర్స్ ఎమ్ఎస్. ధోనీ (05), సచిన్ టెండూల్కర్ (09) టాప్‌టెన్ జాబితాలో ఉన్నారు. మరో క్రికెటర్ రోహిత్ శర్మ 11వ స్థానంలో నిలిచారు. బ్యాడ్మింటన్ ప్లేయర్స్ పీవీ సింధు (63), సైనా నెహ్వాల్ (81) కూడా లిస్ట్‌లో ఉన్నారు. క్రికెటర్ మిథాలీ రాజ్ 88వ స్థానం దక్కించుకున్నారు. సెలబ్రిటీల క్రేజ్, ప్రింట్, సోషల్ మీడియాలో ఉన్న పాపులారిటీ వంటి కొన్ని అంశాల ఆధారంగా ఈ ర్యాంక్‌లు నిర్ణయించినట్లు ఫోర్బ్స్ ప్రతినిధులు తమ వెబ్‌సైట్‌లో పేర్కొన్నారు. అలాగే కొంతమంది సంపాదన అధికంగా ఉన్నప్పటికీ వారి ఫేమ్‌ని దృష్టిలో ఉంచుకుని ర్యాంక్‌లను కేటాయించినట్లు ఫోర్బ్స్ ఇండియా పేర్కొంది.


ఆలియా భట్ · దీపికా పదుకోన్ · తాప్సీ

# సంక్రాంతికి రెడీ


సాగర్, ఎలీషా

శైలేష్ సాగర్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'శివ 143'. ఎలీషా ఆదరహ, హ్రితిక సింగ్, డి.ఎస్.రావ్, ప్రియ పాల్వాయి ఇతర పాత్రల్లో నటించారు. తుమ్మలపల్లి రామ సత్యనారాయణ నిర్మించిన ఈ సినిమా జనవరి 12న సంక్రాంతికి విడుదల కానుంది. ఈ సినిమాలోని టైటిల్ సాంగ్‌ని 'గీత గోవిందం' ఫేమ్ డైరెక్టర్ పరుశురాం విడుదల చేసి, మాట్లాడుతూ– ''ట్రైలర్స్, పాటలు చాలా బాగున్నాయి. ఇప్పటి పరిస్థితుల్లో చిన్న బడ్జెట్ సినిమాకి చాలా ఇబ్బందులు ఉన్నాయి.. కానీ వాటిని అధిగమించి 'శివ 143' చిత్రం ఇంత బాగా రావటానికి కారణం రామ సత్యనారాయణగారు. మ్యూజిక్ డైరెక్టర్ మనోజ్ కొత్తవాడైనా పాటలు బాగున్నాయి'' అన్నారు. ''సంక్రాంతికి విడుదలకానున్న మా సినిమా సక్సెస్ సాధిస్తుంది'' అన్నారు టి. రామసత్యనారాయణ. ''పరుశురాంగారు విడుదల చేసిన పాట సినిమాలో సందర్భానుసారం వస్తుంది. ప్రేక్షకులకు నచ్చేలా మా సినిమా ఉంటుంది'' అన్నారు శైలేష్ సాగర్.

# పాటతో ప్యాకప్


మహేశ్‌బాబు

మహేశ్‌బాబు హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'సరిలేరు నీకెవ్వరు'. ఇందులో రష్మికా మందన్నా కథానాయికగా నటించారు. రాజేంద్రప్రసాద్, విజయశాంతి, ప్రకాష్‌రాజ్ కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా చిత్రీకరణ ముగిసింది. దీంతో షూటింగ్‌కు చిత్రబృందం గుమ్మడికాయ కొట్టింది. హైదరాబాద్‌లో వేసిన ఓ ప్రత్యేకమైన సెట్‌లో చిత్రీకరించిన 'మైండ్ బ్లాక్..' పాటతో సినిమా పూర్తయిందని తెలిసింది. ''ఈ ఏడాది జూలై 5న ఈ సినిమా చిత్రీకరణను ప్రారంభించి, డిసెంబరు 18న ముగించాం. ఈ సినిమా షూటింగ్ మంచి ప్రయాణంలా సాగింది'' అన్నారు దర్శకుడు అనిల్ రావిపూడి. 'దిల్' రాజు, అనిల్ సుంకర, మహేశ్‌బాబు నిర్మించిన ఈ చిత్రం వచ్చే ఏడాది జనవరి11న సంక్రాంతికి విడుదల కానుంది.

# నిన్నే నిన్నే


నాగశౌర్య, మెహరీన్

నాగశౌర్య కథ అందించి, హీరోగా నటించిన చిత్రం 'అశ్వథ్థామ'. ఈ చిత్రంతో రమణ తేజ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. మెహరీన్ హీరోయిన్‌గా నటించారు. శంకర్ ప్రసాద్ ముల్పూరి సమర్పణలో ఐరా క్రియేషన్స్ బ్యానర్‌పై ఉషా ముల్పూరి నిర్మించిన ఈ సినిమా జనవరి 31న విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రమోషన్స్ మొదలుపెట్టారు చిత్రబృందం. అందులో భాగంగా శ్రీచరణ్ పాకాల సంగీతం అందించిన 'నిన్నే నిన్నే...' పాట లిరికల్ వీడియోను విడుదల చేశారు. ''ఇప్పటి వరకు విడుదల చేసిన పోస్టర్స్, మోషన్ పోస్టర్స్‌తో పాటు 'నిన్నే నిన్నే..' తొలి లిరికల్ వీడియో సాంగ్ ప్రోమోకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. ప్రస్తుతం మా సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. నాగశౌర్య మంచి కథను అందించాడు. ఈ సినిమా పేరుని తన ఛాతిపై పచ్చబొట్టుగా పొడిపించుకున్నాడు శౌర్య. మా సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుందనే నమ్మకం ఉంది'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: మనోజ్ రెడ్డి, సంగీతం: శ్రీచరణ్ పాకాల, లైన్ ప్రొడ్యూసర్: బుజ్జి.


తల్లి జైతన్‌తో అలీ

# అలీకి మాతృవియోగం

ప్రముఖ హాస్యనటుడు అలీ ఇంట్లో విషాదం నెలకొంది. ఆయన తల్లి జైతన్ బీబీ (75) అనారోగ్యంతో మృతిచెందారు. రాజమండ్రిలోని అలీ సోదరి నివాసంలో ఉంటున్న ఆమె అనారోగ్యంతో ఓ స్థానిక ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి 11.41కి కన్ను మూశారు. జైతన్ బీబీ భౌతిక కాయాన్ని కుటుంబ సభ్యులు రాజమండ్రి నుంచి హైదరాబాద్‌లోని అలీ స్వగృహానికి తీసుకొచ్చారు. బాలీవుడ్ సినిమా షూటింగ్ నిమిత్తం రాంచీలో ఉన్న అలీ తన తల్లి మరణ వార్త తెలియగానే హుటాహుటిన హైదరాబాద్‌కి చేరుకున్నారు. తల్లి పట్ల అలీకి ఉన్న ప్రేమానురాగాల గురించి తెలిసిందే. తల్లితో తన అనుబంధం గురించి ఆయన ఎన్నో సందర్భాల్లో వెల్లడించారు. జైతన్ బీబీకి ఐదుగురు సంతానంలో పెద్ద కుమారుడు అలీ, రెండో కుమారుడు ఖయ్యూం కాగా ముగ్గురు అమ్మాయిలు. జైతన్ బీబీ మరణ వార్త తెలుసుకున్న చిరంజీవి.. అలీ ఇంటికెళ్లి ఆమెకు నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. పలువురు సినీ, టీవీ, రాజకీయ ప్రముఖులు, మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ సభ్యులు జైతన్ బీబీ మృతికి సంతాపం తెలిపారు. గురువారం సాయంత్రం హైదరాబాద్‌లో ఆమె అంత్యక్రియలు నిర్వహించారు.


పరామర్శిస్తున్న చిరంజీవి

# ఈ సినిమా నాకు డబుల్ స్పెషల్

**- కాలభైరవ**


కాలభైరవ, రవిశంకర్, శ్రీసింహా, రితేష్

''మత్తు వదలరా' కథ మూడేళ్ల క్రితం విన్నాను. చాలా బాగుంది. యంగ్ టీమ్ ఎంతో ప్యాషన్‌తో చేసిన చిత్రమిది. చిన్న బడ్జెట్‌లో పెద్ద హిట్ కంటెంట్ మూవీ చేయడం ఇంట్రెస్టింగ్‌గా, ఎగ్జైటింగ్‌గా ఉంది. సినిమా చూశాక ప్రేక్షకులు కూడా చాలా బాగుందంటారు'' అని నిర్మాత రవిశంకర్ అన్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు కీరవాణి పెద్ద కుమారుడు కాలభైరవ సంగీత దర్శకునిగా, చిన్న కుమారుడు శ్రీసింహా హీరోగా పరిచయమవుతోన్న చిత్రం 'మత్తు వదలరా'. రితేష్ రానా దర్శకుడిగా పరిచయమవుతున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో క్లాప్ ఎంటర్‌టైన్ మెంట్ పతాకంపై చిరంజీవి (చెర్రీ), హేమలత నిర్మించిన ఈ సినిమా ఈ నెల 25న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రం ట్రైలర్‌ని హీరో రానా విడుదల చేశారు. కాలభైరవ మాట్లాడుతూ– ''ఈ సినిమా నాకు డబుల్ స్పెషల్. నేను సంగీత దర్శకునిగా, నా తమ్ముడు శ్రీసింహా హీరోగా ఒకే సినిమాతో పరిచయం కావడం హ్యాపీగా ఉంది. థ్రిల్లర్ కథాంశంతో రూపొందిన చిత్రమిది'' అన్నారు. ''కొత్తవారితో సినిమా రిస్క్ అని అందరూ అనుకుంటారు. కానీ, మా నిర్మాతలు మమ్మల్ని నమ్మి ఈ సినిమా తీసినందుకు థ్యాంక్స్'' అన్నారు శ్రీసింహా. ''వినోదంతో కూడిన థ్రిల్లర్ చిత్రమిది.. కొత్తగా ఉంటుంది'' అన్నారు రితేష్ రానా.













సాక్షి
ఫ్యామిలీ
విజయవాడ
శుక్రవారం ॥ 20-12-2019



గుమ్మం ముందు రంగవల్లిక
సంప్రదాయ చీర కట్టుపైన మెరుస్తోంది.
చీరకు అందాన్ని పెంచే
జాకెట్టు పైన కొలువుదీరుతోంది.
ఆ ముగ్గు ఈ ధనుర్మాసాన
సరికొత్తగా ముస్తాబు అవుతోంది.
ముంగిట ముగ్గుల అలంకరణే కాదు
ముచ్చట గొలిపే ఆ ముగ్గు డిజైన్లతో
ఉన్న చీరలను కట్టండి.
ముగ్గులే కట్టారా అనిపించండి.



# ముగ్గులు కట్టండి



● ప్లెయిన్ కాటన్ చీర మీద ముగ్గుల ప్రింటు, ఆ చీరను కట్టుకున్నవారిని చూస్తే ముగ్గు కొత్త భాష్యం చెబుతున్నట్టుగా ఉంటుంది ● తెలుగింటి ముగ్గు పట్టు చీర బ్లౌజ్‌కు ఎంబ్రాయిడరీగా అమరితే వేడుకలో ప్రత్యేకంగా ఆకట్టుకుంటుంది ● కొత్తగా ముగ్గు డిజైన్ వేయించుకోవాలనుకునే ప్లెయిన్ చీర, బ్లౌజ్, డ్రెస్సులను ఎంచుకోవచ్చు. ఈ డిజైన్ బాగుండాలంటే చుక్కల ముగ్గునే ప్రింట్‌గా వేయించుకోవాలి. లేదా చేతి కుట్టుతో అందంగా రూపుకట్టాలి. అప్పుడే అల్లిక స్పష్టంగా తెలిసి అందంగా కనపడుతుంది. ముగ్గు డిజైన్ కావాలనుకుని సాధారణ డిజైన్‌ని ఎంచుకుంటే ఎలాంటి ప్రత్యేకతా ఉండదు ● చలికాలం తెలుగునాట ముగ్గుల కాలం కూడా కాబట్టి ఇప్పటికే ఇలాంటి డిజైన్స్‌తో ఉన్న చీరలను, డ్రెస్సులను ధరిస్తే సంప్రదాయానికి చిరునామాగా, కళగా కనపడతారు.

నిర్వహణ
నిర్మలారెడ్డి



ఆభరణం





# హూప్ హూప్ హుర్రే

చెవికి జుట్టుకు కలిపి అలంకరించుకునేలా మనకు జాకాలూ–మాటీలు ఉన్న విషయం తెలిసిందే. అఫ్ఘాన్ గిరిజనులు వలయాకృతిలో ఉండే ఆభరణానికి పట్టి ఉంచే మాటీలు వాడుతుంటారు. ఆ డిజైన్లను పోలిన చెవి–జుట్టు ఆభరణాలు ఇప్పుడు కొత్తగా వచ్చాయి. సిల్వర్, బ్రాస్ మెటల్‌తో డిజైన్ చేసిన ఈ డిజైన్లు మన సంప్రదాయ ఆభరణాలను పోలి ఉండటంతో యువతులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఇండోవెస్ట్రన్ స్టైల్ దుస్తులు ధరించినప్పుడు ఈ ఆభరణాల అలంకరణ ప్రత్యేకతను చూపుతోంది. మన సంప్రదాయ వేడుకలకూ బాగా నప్పుతాయి. హూప్స్‌లో చాంద్‌బాలి డిజైన్స్ ఎక్కువగా ఉంటున్నాయి. డిజైన్, మోడల్‌ను బట్టి ఈ హూప్ చెవి ఆభరణాలు రూ.500/–నుంచి ఆన్‌లైన్ మార్కెట్‌లో లభిస్తున్నాయి.







హోమియో కౌన్సెలింగ్స్

ఫ్యామిలీ
డాక్టర్

# సంతానలేమితో బాధపడుతున్నాను

**నా వయసు 28 ఏళ్లు. మా పెళ్లయి ఎనిమిదేళ్ళయ్యింది. మాకు సంతానం కలగడం లేదు. ఎన్నో హాస్పిటల్స్ తిరిగాము. ఎన్నో టెస్ట్‌లు చేయించాము. మావారి కౌంట్‌లో సమస్య లేదు. హోమియోలో మంచి మందులు ఉన్నాయా?**

**– రమ్య, సికింద్రాబాద్**

మన సమాజంలో చాలామంది దంపతులు ‘సంతానలేమి’ సమస్యను ఎదుర్కొంటున్నారు. దీనికి కేవలం శారీరకంగా వచ్చే వ్యాధులు, లోపాలు మాత్రమేగాక... మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, రాత్రివేళ ఉద్యోగాలు, మానసిక ఒత్తిడి వంటివి గణనీయమైన పాత్ర పోషిస్తున్నాయి. ఆరోగ్యవంతులైన దంపతులు ఎలాంటి గర్భనిరోధక పద్ధతులు పాటించకుండా ఏడాది పాటు దాంపత్య జీవనం సాగించినా పిల్లలు కలగకపోవడాన్ని ‘సంతానలేమి’గా చెప్పవచ్చు. సంతానలేమికి కారణాలు అటు మహిళల్లోనూ, ఇటు పురుషుల్లోనూ ఉండవచ్చు. ఒక్కోసారి ఇద్దరిలోనూ ఉండవచ్చు.

**సంతానలేమికి కారణాలు**

● మన జీవనశైలితో పాటు కాలుష్యం, వాతావరణం, పొగతాగడం, మద్యం, బిగుతైన దుస్తులు ధరించడం, అధిక బరువు, మానసిక ఒత్తిడి, కొన్ని రకాల మందులు.
● మహిళల వయసు 30 ఏళ్ల దాటాక సంతానం కలిగే అవకాశాలు తగ్గుతాయి.
● మహిళల్లో నెలసరి సమస్యలు, అండాల విడుదల సరిగా లేకపోవడం లేదా విడుదలైన అండాల నాణ్యత లోపించడం వంటివి కారణాలు.
● మహిళల్లోని ట్యూబల్‌బ్లాక్స్, ఫైబ్రాయిడ్స్, పీసీఓడీ, ఎండోమెట్రియాసిస్ వంటి సమస్యలు.
● పురుషుల్లో శుక్రకణాల సంఖ్య తగినంతగా లేకపోవడం, ఉన్నా – వాటిలో తగినంత చురుకుదనం లేకపోవడం లేదా వాటి ఆకృతి సరిగా లేకపోవడం వంటి లోపాలు.
● మరికొందరు పురుషుల్లో అసలు శుక్రకణాలే లేకపోవచ్చు.

**మహిళల్లో చేయించాల్సిన పరీక్షలు**

● థైరాయిడ్ ప్రొఫైల్ (టీ3, టీ4, టీఎస్‌హెచ్), ● పెల్విక్ స్కాన్ ● ఫాలిక్యులార్ స్టడీ ● హార్మోనల్ పరీక్షలు (ఈస్ట్రోజెన్, ప్రొజెస్టరాన్, ఎఫ్‌ఎస్‌హెచ్, ఎల్‌హెచ్) ● హిస్టర్‌స్సాలింజియోగ్రామ్ ● సీబీపీ, ఈఎస్‌ఆర్ వంటి పరీక్షలు చేయించాలి.

**పురుషులకు చేయించాల్సిన పరీక్షలు**

● వీర్యపరీక్ష ● హార్మోనల్ పరీక్షలు ● థైరాయిడ్ ప్రొఫైల్ ● టెస్టిక్యులార్ బయాప్సీ ● సీబీపీ, ఈఎస్‌ఆర్ ● అల్ట్రాసౌండ్ అబ్డామిన్ స్క్రోటమ్.

**చికిత్స:** సంతానలేమి సమస్యకు హోమియోలో చక్కటి వైద్యం అందుబాటులో ఉంది. ఈ సమస్యకు నిర్దిష్టంగా అసలు కారణం కనుగొనేందుకు అవసరమైన పరీక్షలు చేయించాలి. ఆ తర్వాత మహిళలు, పురుషుల్లో లోపాలను బట్టి పురుషుల్లోనైతే వీర్యకణాల వృద్ధి, వాటి నాణ్యత పెరిగేలా చూడటం వల్ల, అలాగే మహిళల్లో అండం నాణ్యతలను పెంచడం వంటి చికిత్సల ద్వారా ఫలదీకరణ జరిగే అవకాశాన్ని మెరుగుపరచవచ్చు.

హోమియోలో మహిళలకు పల్సటిల్లా, సెపియా, కాల్కేరియా లాంటి మందులను వారి లక్షణాలను బట్టి వాడవచ్చు. అలాగే పురుషులకు లైకోపోడియం, బెరైటాకార్బ్, ఆసిడ్‌ఫాస్, నేట్రమ్ మూర్‌లాంటి మందులను లక్షణాలను బట్టి వాడాల్సి ఉంటుంది. అయితే ఈ మందులను పూర్తిగా వైద్యుల పర్యవేక్షణలో వాడితేనే ప్రయోజనం ఉంటుంది. ఇలా హోమియో చికిత్స ద్వారా సంతానం కలగడానికి అవరోధంగా ఉన్న సమస్యలన్నీ తొలగిస్తే దాదాపు 50 – 60 శాతం వరకు సత్ఫలితాలను పొందవచ్చు.



**డాక్టర్ కె. శ్రీనివాస్ గుప్తా,**
ఎండీ (హోమియో),
స్టార్ హోమియోపతి, హైదరాబాద్



# బాబుకు ఆటిజమ్... చికిత్స ఉందా?



**మా బాబుకు మూడేళ్లు. ఆటిజమ్ ఉన్నట్లు డాక్టర్లు నిర్ధారణ చేశారు. హోమియోలో మంచి చికిత్స సూచించండి.**

**– ఆర్. రామలక్ష్మి, ఖమ్మం**

ఆటిజమ్ ఇటీవల పిల్లల్లో ఎక్కువగా కనిపిస్తున్న వ్యాధి. దీనిలో చాలా స్థాయిలు, ఎన్నో లక్షణాలు ఉంటాయి. కాబట్టి దీనితో బాధపడే వారందరిలోనూ లక్షణాలు ఒకేలా ఉండకపోవచ్చు. ఆటిస్టిక్ డిజార్డర్ అనేది ఆటిజంలో ఎక్కువగా కనిపించే సమస్య. మగపిల్లల్లో ఎక్కువ. రెట్స్ డిజార్డర్ అనే అరుదైన రకం ఆడపిల్లల్లో ఎక్కువగా కనిపిస్తుంది. చైల్డ్‌హుడ్ డిసింటిగ్రేటెడ్ డిజార్డర్ అనేది ఆటజమ్‌లో ఒక తీవ్రమైన సమస్య.యాస్పర్జస్ డిజార్డర్‌లో పిల్లల్లో తెలివితేటలు ఎక్కువగా ఉండి, వారు తదేకంగా చేసే పనులలో మంచి నైపుణ్యాన్ని ప్రదర్శిస్తారు. ఇలా దీనిలో చాలా రకాలు ఉంటాయి. ఇది మెదడు సరిగా అభివృద్ధి చెందకపోవడం వల్ల వస్తుంది. ఈ వ్యాధికి నిర్దిష్టమైన ఒకే కారణం గాక అనేక అంశాలు దోహదపడవచ్చు. మెదడు ఎదుగుదలకు తోడ్పడే జన్యువులు, అందులో స్రవించే సెరటోనిన్, డోపమిన్ వంటి రసాయనాలు ఇలా ఎన్నో అంశాలు దీనికి కారణం కావచ్చు. గర్భిణిగా ఉన్నప్పుడు తల్లి తీవ్రమైన ఉద్వేగాలకు లోనుకావడం, పోటీ ప్రపంచంలో తల్లిదండ్రులు పిల్లలతో నాణ్యమైన సమయాన్ని గడపలేకపోవడం వల్ల కూడా ఇది రావచ్చు. పిల్లల్లో దీన్ని గుర్తించడానికి తోడ్పడే అంశాలు... ● అకారణంగా ఎప్పుడూ ఏడుస్తూ ఉండటం ● నలుగురిలో కలవలేకపోవడం ● ఆటవస్తువుల్లో ఏదో ఒక భాగంపైనే దృష్టి కేంద్రీకరించడం ● వయసుకు తగినంత మానసిక పరిపక్వత లేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఆటిజమ్ ఉన్న పిల్లలకు లక్షణాలు బట్టి చికిత్స ప్రారంభించాల్సి ఉంటుంది. మాటలు సరిగా రానివారిని స్పీచ్ థెరపీ ఉపయోగకరంగా ఉంటుంది. బిహేవియర్ థెరపీ కూడా దీనితో బాధపడే పిల్లల్లో మార్పు తీసుకురావడానికి సహాయపడుతుంది. పిల్లల వ్యక్తిగత లక్షణాలు బట్టి, కుటుంబ, సామాజిక పరిస్థితులను అవగాహనలోకి తీసుకొని, మూలకారణాలను అన్వేషించి చికిత్స చేయాల్సి ఉంటుంది. పిల్లల్లో ఆటిజమ్ వ్యాధి తీవ్రతను బట్టి చికిత్స వ్యవధి ఉంటుంది. సరైన హోమియోపతి మందులను అనుభవజ్ఞులైన వైద్యుల పర్యవేక్షణలో వాడితే పిల్లలు మామూలుగా అయ్యేందుకు లేదా గరిష్ఠస్థాయికి మెరుగుపడేందుకు అవకాశం ఉంటుంది.



**డాక్టర్ ఎ.ఎం. రెడ్డి,** సీఎండీ,
పాజిటివ్ హోమియోపతి, హైదరాబాద్

సినిమా

# వన్య ప్రాణుల కోసం...

**‘ఆ**రెంజ్’ సినిమాలో వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్‌గా కనిపిస్తారు రామ్‌చరణ్. అది సినిమా కోసం. ఇప్పుడు నిజంగానే వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్‌గా మారారాయన. అయితే చరణ్ ఫొటోగ్రాఫర్ కావడం వెనక ఓ మంచి ఉద్దేశం ఉంది. ప్రకృతిని కాపాడటం కోసం ‘డబ్ల్యుడబ్ల్యూఎఫ్’ అనే స్వచ్ఛంద సంస్థ 60 ఏళ్లుగా పని చేస్తోంది. ఇటీవలే ఈ సంస్థకు రాయబారిగా రామ్‌చరణ్ సతీమణి ఉపాసన ఎన్నికయ్యారు. ఇప్పుడు వన్యప్రాణి సంరక్షణ కోసం నిధుల సేకరణలో చరణ్ కూడా తన వంతు సాయం చేయనున్నారు. సింహాలు, చిరుతపులులు, జిరాఫీలు తదితర వన్య ప్రాణుల ఫొటోలతో చరణ్ తన కొత్త ఇంట్లో ‘వైల్డెస్ట్ డ్రీమ్స్’ పేరుతో ఓ విభాగాన్నే ఏర్పాటు చేశారు. ఈ ఫొటోలను ప్రదర్శించి ప్రజల్లో చైతన్యం ఏర్పరచాలన్నది వీరి ఉద్దేశం. ‘‘భూమిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మన అందరిదీ’’ అన్నారు చరణ్.



● రామ్‌చరణ్

# నిధి కోసం...



● రక్షిత్ శెట్టి, శాన్వి

**ర**క్షిత్ శెట్టి, శాన్వి జంటగా నూతన దర్శకుడు సచిన్ తెరకెక్కించిన చిత్రం ‘అతడే శ్రీమన్నారాయణ’. పుష్కర్ ఫిలింస్ పతాకంపై పుష్కర్ మల్లికార్జున్, హెచ్.కె. ప్రకాశ్ నిర్మించారు. ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై నిర్మాత ‘దిల్’ రాజు తెలుగులో జనవరి 1న విడుదల చేస్తున్నారు. హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో రక్షిత్‌శెట్టి మాట్లాడుతూ– ‘‘నిధి అన్వేషణ నేపథ్యంలో ఈ చిత్రకథ నడుస్తుంది. మూడేళ్లు కష్టపడి ఎంతో ప్యాషన్‌తో ఈ సినిమా చేశాం. ఇంజనీరింగ్ చదివే రోజుల్లో వంశీకృష్ణ అనే మిత్రుడి ద్వారా తెలుగుతో పరిచయం ఏర్పడింది. అప్పట్లో చిరంజీవి, నాగార్జున, వెంకటేష్‌గార్ల సినిమాలు చూసేవాణ్ణి. తెలుగు ప్రజలకు సినిమా అనేది సంస్కృతిలో ఓ భాగం. ఇక్కడి ప్రేక్షకులు సినిమాని ఎలా ఆదరిస్తారో? ప్రేమిస్తారో తెలిసింది. అందుకే మా సినిమాని తెలుగులోనూ విడుదల చేస్తున్నాం. రామజోగయ్యశాస్త్రిగారు నాలుగు పాటలకు మంచి సాహిత్యం అందించారు’’ అన్నారు. ‘‘ఐదేళ్ల తర్వాత ఈ సినిమాతో తెలుగులో రీ ఎంట్రీ ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది. రహస్యాలతో కూడిన ఫ్యాంటసీ కథ ఇది. కొంత ఆలస్యమైనా మంచి సినిమాతో తెలుగు ప్రేక్షకుల ముందుకొస్తున్నా’’ అన్నారు శాన్వి. ‘‘ఈ సినిమా మంచి విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది’’ అన్నారు పాటల రచయిత రామజోగయ్య శాస్త్రి. ఈ సమావేశంలో పంపిణీదారుడు సతీష్, బాలాజీ మనోహర్, ప్రమోద్ శెట్టి, ఇమ్రాన్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# పైరేటెడ్ లవ్ స్టోరీ

**న**వీన్ చంద్ర, గాయత్రీ సురేష్ జంటగా ‘అడ్డా’ ఫేమ్ జి. కార్తీక్ రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం ‘హీరో హీరోయిన్’. స్వాతి పిక్చర్స్ పతాకంపై భార్గవ్ మన్నె నిర్మించిన ఈ సినిమా ఈ నెల 27న విడుదల కానుంది. ఈ చిత్రంలో ‘ఫార్వార్డ్..’ అంటూ సాగే పాటను చిత్రబృందం విడుదల చేసింది. ‘‘పైరేటెడ్ లవ్ స్టోరీగా రూపొందిన చిత్రమిది. ఇటీవల విడుదలైన మా సినిమా టీజర్‌కు మంచి స్పందన వచ్చింది. ‘ఫార్వార్డ్..’ అంటూ అమ్మాయిలను టీజ్ చేస్తూ సాగే పాట క్యాచీగా ఉంది. అనూప్ రూబెన్స్ సంగీతం అందించిన ఈ పాటకి పూర్ణాచారి సాహిత్యం అందించారు. ఈ పాట విడుదలైన కొన్ని గంటల్లోనే యూట్యూబ్‌లో మంచి స్పందన లభించింది’’ అని చిత్రబృందం పేర్కొంది. డింపుల్ చొపాడియా, పోసాని కృష్ణమురళి, ‘30 ఇయర్స్’ పృథ్వి, అభిమన్యుసింగ్, జయప్రకాశ్, గౌతంరాజు, శివన్నారాయణ, బమ్ చిక్ బబ్లూ తదితరులు నటించిన ఈ చిత్రానికి కెమెరా: వెంకట్ గంగాధరీ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: వంశీకృష్ణ.



● నవీన్ చంద్ర, గాయత్రీ సురేష్

epaper.sakshi.com

సాక్షి భవిత
సోమవారం నుంచి శుక్రవారం వరకు
స్పర్ధయా వర్ధతే విద్య
మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com
శుక్రవారం
20-12-2019

## విద్య, ఉద్యోగ సమాచారం

### ఇఫ్లూలో ప్రవేశాలు

హైదరాబాద్‌లోని ది ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఇఫ్లూ) 2020–22కి గాను వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- **కోర్సులు:** యూజీ కోర్సులు, పీజీ కోర్సులు, టీచర్ ట్రెనింగ్ కోర్సులు, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ట్రాన్స్‌లేషన్ (పీజీడీటీ), పీహెచ్‌డీ.
- **అర్హత:** కోర్సులను బట్టి సంబంధిత సబ్జెక్టులతో ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ డిగ్రీ ఉత్తీర్ణత.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులు ప్రారంభం:** డిసెంబర్ 16, 2019.
- **దరఖాస్తుకు చివరితేదీ:** జనవరి 19, 2020.
- **వెబ్‌సైట్:** http://efluniversity.ac.in

### ఐడీఈఎంఐ-16

ముంబైలోని ఇన్‌స్టిట్యూట్ ఫర్ డిజైన్ ఆఫ్ ఎలక్ట్రికల్ మెజరింగ్ ఇన్‌స్ట్రుమెంట్స్ (ఐడీఈఎంఐ) తాత్కాలిక ప్రాతిపదికన 16 సీనియర్ ఇంజనీర్, ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాలు:** డిజైనింగ్ అండ్ డెవలప్‌మెంట్, టూల్ రూమ్, టెస్టింగ్, డిజైన్ తదితర విభాగాలున్నాయి.
- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **వయసు:** 35 ఏళ్లకు మించకూడదు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** జనవరి 1, 2020.
- **వెబ్‌సైట్:** www.idemi.org

### డీఆర్‌డీఓ-12

చెన్నైలోని భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీఓ).. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 12 జూనియర్ రీసెర్చ్ ఫెలో (జేఆర్‌ఎఫ్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** మెకానికల్ ఇంజనీరింగ్–3, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్–4, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్–3, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్–1, ఏరోనాటికల్ ఇంజనీరింగ్–1.
- **అర్హత:** పోస్టులను బట్టి సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్ ఉత్తీర్ణత, గేట్ స్కోర్ ఉండాలి.
- **వయసు:** 28 ఏళ్లకు మించకూడదు.
- **ఎంపిక:** కంప్యూటర్ బేస్డ్ టెస్ట్/రాత పరీక్ష ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** జనవరి 5, 2020.
- **వెబ్‌సైట్:** www.drdo.gov.in

### జేజీఈఈబీఐఎల్‌ఎస్-2020

గురుగ్రామ్(హర్యానా)లోని నేషనల్ బ్రెయిన్ రీసెర్చ్ సెంటర్ (ఎన్‌బీఆర్‌సీ) 2020కి గాను జేజీఈఈబీఐఎల్ఎస్ ప్రవేశ పరీక్ష ద్వారా పీహెచ్‌డీ లేదా ఎంఎస్సీ (న్యూరోసైన్స్) విభాగంలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- జేజీఈఈబీఐఎల్ఎస్ (జాయింట్ గ్రాడ్యుయేట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ ఫర్ బయాలజీ అండ్ ఇంటర్ డిసిప్లినరీ లైఫ్ సైన్సెస్).
- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో గ్రాడ్యుయేషన్, మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణత.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** మార్చి 31, 2020.
- **దరఖాస్తు ఫీజు:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వారికి రూ.300; ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వారికి రూ.350.
- **ఎంపిక:** ప్రవేశ పరీక్ష, షార్ట్ లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేసుకోవాలి.
- **వెబ్‌సైట్:** www.nbrc.ac.in

### బీఈసీఐఎల్-50

న్యూఢిల్లీలోని బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ (బీఈసీఐఎల్) ఒప్పంద ప్రాతిపదికన 50 డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** ఇంటర్మీడియట్, డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు ఇంగ్లిష్/హిందీలో కంప్యూటర్ టైపింగ్ స్పీడ్ నిమిషానికి 35 పదాలుండాలి.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.500.
- **దరఖాస్తుకు చివరితేదీ:** జనవరి 7, 2020.
- **వెబ్‌సైట్:** www.becil.com

నేటి టాబ్లాయిడ్ విద్య పేజీల్లో...


Physical Science / English

# ఐఐఎంల్లో పీహెచ్‌డీ

మేనేజ్‌మెంట్ కోర్సుల విద్యార్థులు సాధారణంగా పీజీ చదువుకే పరిమితమవుతుంటారు. ఎంబీఏతోనే కార్పొరేట్ కంపెనీల్లో కొలువులు సొంతం చేసుకొని.. ముందుకుసాగుతుంటారు. కానీ.. మేనేజ్‌మెంట్ విభాగంలో పీజీ తర్వాత పీహెచ్‌డీ కూడా పూర్తిచేసుకుంటే.. విభిన్న రంగాల్లో ఉన్నత స్థానాల్లో దూసుకుపోవచ్చు. ప్రధానంగా ప్రతిష్టాత్మక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎంలు) క్యాంపస్‌ల్లో డాక్టోరల్ కోర్సు ద్వారా.. ఎంఎన్‌సీల్లో, బోధన రంగంలో అత్యున్నత హోదాల్లో కొలువు దీరొచ్చు! రూ.లక్షల వేతనం అందుకోవచ్చు!! ప్రస్తుతం ఐఐఎంల్లో 2020 విద్యా సంవత్సరానికి మేనేజ్‌మెంట్ పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌ల దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో.. ఐఐఎంల్లో పీహెచ్‌డీకి అర్హతలు, ప్రవేశ విధానం, ఆర్థిక ప్రోత్సాహకాలు, భవిష్యత్తు అవకాశాల గురించి తెలుసుకుందాం...

హయ్యర్ ఎడ్యుకేషన్




» వచ్చే విద్యా సంవత్సరానికి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం
» ఎంపికైతే.. ఆకర్షణీయమైన ఆర్థిక ప్రోత్సాహకాలు
» కోర్సు పూర్తయ్యాక ఉన్నతస్థాయి ఉద్యోగాలు ఖాయం

### డాక్టోరల్ ప్రోగ్రామ్స్

ఐఐఎంలు అందిస్తున్న పీహెచ్‌డీ ప్రోగ్రామ్స్‌కు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు లభిస్తోంది. కనిష్టంగా నాలుగేళ్లు, గరిష్టంగా అయిదేళ్ల వ్యవధిలో ఉండే ఈ డాక్టోరల్ కోర్సు పూర్తి చేసుకుంటే.. సంబంధిత స్పెషలైజేషన్ ఆధారంగా సంస్థల్లో ఉన్నత శ్రేణి ఉద్యోగాలు సొంతం చేసుకోవచ్చు. అంతేకాకుండా కార్పొరేట్ రంగంలో సొంతగా కన్సల్టెంట్స్‌గా ఫ్రీలాన్స్ విధానంలో సేవలందించొచ్చు. అదే విధంగా అధ్యాపక వృత్తిలో ప్రవేశించి ప్రముఖ యూనివర్సిటీల్లో ప్రొఫెసర్ స్థాయిలో రూ.లక్షల వేతనం అందుకోవచ్చు.

### అర్హతలివే

ఐఐఎంలు అందించే పీహెచ్‌డీకి దరఖాస్తు చేసుకునేందుకు ప్రధాన అర్హత.. మేనేజ్‌మెంట్ పీజీ (ఎంబీఏ, పీజీ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ తదితర). తాజాగా ఐఐఎం చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత నిబంధనల్లో సడలింపు ఇస్తున్నాయి. పీజీ డిగ్రీ లేదా, పీజీ డిప్లొమా, లేదా బ్యాచిలర్ డిగ్రీ తర్వాత సీఏ/ఐసీడబ్ల్యుఏ/సీఎస్ కోర్సులు పూర్తి చేసుకున్న వారు కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం లభిస్తోంది.

- బీటెక్ అభ్యర్థులు ప్రస్తుతం నేరుగా ఐఐఎంల్లో పీహెచ్‌డీకి దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. నాలుగేళ్ల వ్యవధిలో ఉండే బ్యాచిలర్ డిగ్రీ కోర్సుల ఉత్తీర్ణులతోపాటు ఆయా కోర్సుల చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు సైతం దరఖాస్తు చేసుకోవచ్చు.
- అభ్యర్థుల అర్హతలకు అనుగుణంగా పీహెచ్‌డీ పూర్తి చేయాల్సిన కనిష్ట, గరిష్ట వ్యవధులను ఐఐఎంలు నిర్ణయిస్తున్నాయి. ఉదాహరణకు ఐఐఎం-అహ్మదాబాద్.. పీజీ, పీజీ డిప్లొమా కోర్సులతో దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు మూడేళ్లలోనే పీహెచ్‌డీని పూర్తి చేసుకునే వీలు కల్పించింది. అలాగే బీటెక్ లేదా నాలుగేళ్ల బ్యాచిలర్ డిగ్రీ అర్హతతో దరఖాస్తు చేసుకుంటే.. పీహెచ్‌డీ పూర్తి చేసేందుకు కనిష్ట వ్యవధి నాలుగేళ్లుగా నిర్ణయించింది. ఐఐఎం కోల్‌కత, బెంగళూరు, కోజికోడ్.. ఇలా దేశంలోని దాదాపు అన్ని ఐఐఎంలు ఇలాంటి విధానం అమలు చేస్తున్నాయి.

### టెస్ట్ స్కోర్లు

- ఐఐఎంల్లో పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌కు దరఖాస్తు చేసుకోవడానికి అభ్యర్థులు.. క్యాట్, జీమ్యాట్/జీఆర్‌ఈల్లో నిర్దేశిత స్కోర్ సాధించాలి. లేదా యూజీసీ-నెట్, యూజీసీ-జేఆర్‌ఎఫ్‌కు ఎంపికవ్వాలి.
- యూజీసీ జేఆర్‌ఎఫ్ అర్హత ఆధారంగా దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు... పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో తాము దరఖాస్తు చేసుకునే స్పెషలైజేషన్ ఆధారంగా సంబంధిత సబ్జెక్ట్‌లో యూజీసీ జేఆర్‌ఎఫ్‌లో ఉత్తీర్ణత సాధించాలి. ఉదాహరణకు..ఎకనామిక్స్ స్పెషలైజేషన్‌తో పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే.. బిజినెస్ ఎకనామిక్స్ లేదా డెవలప్‌మెంట్ ఎకనామిక్స్ లేదా ఎకనామిక్స్ సబ్జెక్ట్‌లలో యూజీసీ నెట్‌లో ఉత్తీర్ణత సాధించాలి.
- విదేశీ విద్యార్థులకు జీమ్యాట్ లేదా జీఆర్‌ఈ స్కోర్లు తప్పనిసరి.

### మలిదశ ఎంపిక

ఐఐఎం పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌కు వచ్చిన దరఖాస్తులను ముందుగా ఆయా ఇన్‌స్టిట్యూట్‌ల అడ్మిషన్స్ కమిటీ పరిశీలిస్తుంది. అభ్యర్థులు పేర్కొన్న రీసెర్చ్ స్పెషలైజేషన్, దానికి సంబంధించి జతపర్చిన థీసిస్‌లపై సంతృప్తి చెందితే.. సదరు అభ్యర్థులకు ఐఐఎంల నుంచి మలిదశ ఎంపిక ప్రక్రియకు పిలుపు వస్తుంది. ఈ దశలో రాత పరీక్ష లేదా పర్సనల్ ఇంటర్వ్యూ ఉంటుంది. ఇంటర్వ్యూ సమయంలో ప్రొఫెసర్ల కమిటీ.. అభ్యర్థుల్లో వాస్తవ ఆసక్తిని పరిశీలించి తుది జాబితా రూపొందిస్తుంది. ఒక్కో క్యాంపస్‌లో గరిష్టంగా అందుబాటులో ఉన్న సీట్ల సంఖ్య 30. కాబట్టి పీహెచ్‌డీలోకి అభ్యర్థుల ఎంపికకు అకడమిక్ పర్సంటేజ్‌లు, టెస్ట్ స్కోర్లే కాకుండా.. రిఫరెన్స్ లెటర్స్, ప్రొఫైల్స్ వంటివి కీలకంగా మారుతున్నాయి.

### ఆర్థిక ప్రోత్సాహం

ఐఐఎంల్లో పీహెచ్‌డీ కోర్సుకు ఎలాంటి ఫీజులు వసూలు చేయరు. అంతేకాకుండా ప్రోగ్రామ్‌కు ఎంపికైన అభ్యర్థులకు ఆకర్షణీయమైన ఆర్థిక ప్రోత్సాహం అందుతోంది. ఆయా క్యాంపస్‌ల విధానాలను అనుసరించి రూ.30వేల నుంచి రూ.35 వేల వరకు ప్రతి నెల ఫెలోషిప్ లభిస్తుంది. దీనికి అదనంగా కాంటింజెన్సీ గ్రాంట్, కాన్ఫరెన్స్ టూర్ వ్యయాలు(ట్రావెల్ గ్రాంట్స్), రీసెర్చ్‌కు అవసరమైన ఇతర మౌలిక వసతులకు సంబంధించిన ఖర్చులకు సరిపడే మొత్తాలు, ఉచిత హాస్టల్ సదుపాయం, లేదా హెచ్‌ఆర్‌ఏ అందిస్తున్నాయి.

### ఉన్నత స్థాయి ఉద్యోగాలు

ఐఐఎంలలో పీహెచ్‌డీ పూర్తి చేసుకున్న ప్రతిభావంతులకు బహుళ జాతి సంస్థల్లో, సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉన్నతస్థాయి ఉద్యోగాలు లభిస్తున్నాయి. చీఫ్ స్ట్రాటజిక్ ఆఫీసర్, చీఫ్ పీపుల్ ఆఫీసర్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ వంటివి సొంతం చేసుకోవచ్చు. అదే విధంగా ఒక సంస్థలో ఉద్యోగం చేస్తూ పీహెచ్‌డీలో ప్రవేశం పొంది.. దాన్ని పూర్తి చేసుకున్న వారికి మాతృ సంస్థలోనే అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ వంటి హోదాలు స్వాగతం పలుకుతున్నాయి. సదరు పీహెచ్‌డీ ఉత్తీర్ణులు సొంతంగా కన్సల్టింగ్ సంస్థలు, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ సంస్థలను ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంది.ఇటీవల కాలంలో అధ్యాపకుల కొరత కారణంగా..ఐఐఎంల్లో పీహెచ్‌డీ పూర్తిచేసిన అభ్యర్థులకు సదరు ఇన్‌స్టిట్యూట్‌లే అసోసియేట్ ప్రొఫెసర్లుగా నియమించుకుంటున్నాయి. వీరికి సగటున నెలకు లక్షన్నర వరకూ వేతనం లభిస్తోంది.

### దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం

వచ్చే విద్యా సంవత్సరం(2020–21)కు సంబంధించి ప్రస్తుతం దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోంది. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

**ఐఐఎంలు- పీహెచ్‌డీ ప్రోగ్రామ్.. దరఖాస్తుకు చివరి తేదీలు:**

- **ఐఐఎం అహ్మదాబాద్:** జనవరి 23, 2020
- **ఐఐఎం బెంగళూరు:** జనవరి 13, 2020
- **ఐఐఎం కోల్‌కత:** జనవరి 20, 2020
- **ఐఐఎం కోజికోడ్:** జనవరి 15, 2020
- **ఐఐఎం లక్నో:** జనవరి 31, 2020
- **ఐఐఎం ఇండోర్:** జనవరి 20, 2020
- **ఐఐఎం రాయ్‌పూర్:** జనవరి 20, 2020
- **ఐఐఎం రోహ్‌తక్:** జనవరి 31, 2020
- **ఐఐఎం రాంచీ:** ఫిబ్రవరి 29, 2020
- **ఐఐఎం ఉదయ్‌పూర్:** ఫిబ్రవరి 9, 2020
- **ఐఐఎం షిల్లాంగ్:** జనవరి 27, 2020 (ఆఫ్‌లైన్ విధానంలో జనవరి 30, 2020)
- **ఐఐఎం ట్రిచీ:** జనవరి 20, 2020

మిగతా ఐఐఎంలు మరికొద్ది రోజుల్లో దరఖాస్తు ప్రక్రియ ప్రారంభించనున్నాయి.




### ఐఐఎం క్యాంపస్‌లు.. అవి అందిస్తున్న పీహెచ్‌డీ ప్రోగ్రామ్ స్పెషలైజేషన్స్

| ఐఐఎం | స్పెషలైజేషన్స్ | వెబ్‌సైట్ |
|---|---|---|
| అహ్మదాబాద్ | అగ్రికల్చర్, బిజినెస్ పాలసీ, ఎకనామిక్స్, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, మార్కెటింగ్, ఓబీ, పర్సనల్ అండ్ ఇండస్ట్రియల్ రిలేషన్స్, ప్రొడక్షన్ అండ్ క్వాంటిటేటివ్ మెథడ్స్, పబ్లిక్ సిస్టమ్స్ | www.iima.ac.in |
| బెంగళూరు | డెసిషన్ సైన్సెస్, ఎకనామిక్స్ అండ్ సోషల్ సైన్సెస్, ఎంట్రప్రెన్యూర్‌షిప్, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, మార్కెటింగ్, ఆర్గనైజేషనల్ బిహేవియర్ అండ్ హెచ్‌ఆర్‌ఎం, ప్రొడక్షన్ అండ్ ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, పబ్లిక్ పాలసీ, స్ట్రాటజీ | www.iimb.ac.in |
| లక్నో | అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్, బిజినెస్ ఎన్విరాన్‌మెంట్, డెసిషన్ సైన్సెస్, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్, హెచ్‌ఆర్‌ఎం, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ సిస్టమ్స్, మార్కెటింగ్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్ | www.iiml.ac.in |
| కోజికోడ్ | ఎకనామిక్స్; ఫైనాన్స్, అకౌంటింగ్ అండ్ కంట్రోల్; ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ సిస్టమ్స్, మార్కెటింగ్, ఓబీ అండ్ హెచ్‌ఆర్‌ఎం, క్వాంటిటేటివ్ మెథడ్స్ అండ్ ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్ | www.iimk.ac.in |
| కోల్‌కత | ఎకనామిక్స్, ఫైనాన్స్ అండ్ కంట్రోల్, హెచ్‌ఆర్‌ఎం, ఎంఐఎస్, మార్కెటింగ్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, ఓబీ, పబ్లిక్ పాలసీ అండ్ మేనేజ్‌మెంట్, రీజనల్ డెవలప్‌మెంట్, సోషియాలజీ, స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్ | www.iimcal.ac.in |
| ఇండోర్ | కమ్యూనికేషన్, ఎకనామిక్స్, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్ అండ్ క్వాంటిటేటివ్ టెక్నిక్స్, ఓబీ అండ్ హెచ్‌ఆర్‌ఎం, స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్ | www.iimidr.ac.in |
| రాయ్‌పూర్ | బిజినెస్ పాలసీ అండ్ స్ట్రాటజీ, ఎకనామిక్స్ అండ్ బిజినెస్ ఎన్విరాన్‌మెంట్, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్, మార్కెటింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ సిస్టమ్స్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్ | www.iimraipur.ac.in |
| రోహ్‌తక్ | ఎకనామిక్ అండ్ పబ్లిక్ పాలసీ, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్, హెచ్‌ఆర్‌ఎం అండ్ ఓబీ, ఎంఐఎస్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్ అండ్ క్వాంటిటేటివ్ టెక్నిక్స్, స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్ | www.iimrohtak.ac.in |
| రాంచీ | అకౌంటింగ్ అండ్ ఫైనాన్స్, ఎకనామిక్స్, జనరల్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ఓబీ అండ్ హెచ్‌ఆర్‌ఎం, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్ | www.iimranchi.ac.in |
| ఉదయ్‌పూర్ | ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్, ఓబీ అండ్ హెచ్‌ఆర్‌ఎం | www.iimu.ac.in |
| షిల్లాంగ్ | ఎకనామిక్స్ అండ్ పబ్లిక్ పాలసీ, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్ అండ్ క్వాంటిటేటివ్ టెక్నిక్స్, ఓబీ అండ్ హెచ్‌ఆర్‌ఎం, స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్, సస్టెయినబిలిటీ అండ్ సీఎస్‌ఆర్ అండ్ ఎథిక్స్ | www.iimshillong.ac.in |
| ట్రిచీ | ఎకనామిక్స్ అండ్ పబ్లిక్ పాలసీ, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్, మార్కెటింగ్, మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ అండ్ ఐటీ, ఓబీ అండ్ హెచ్‌ఆర్‌ఎం, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్ అండ్ క్వాంటిటేటివ్ టెక్నిక్స్, స్ట్రాటజీ | www.iimtrichy.ac.in |
| కాశీపూర్ | ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్ అండ్ డెసిషన్ సైన్సెస్; ఓబీ అండ్ హెచ్‌ఆర్‌ఎం; మార్కెటింగ్; ఫైనాన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ సిస్టమ్స్; బిజినెస్ పాలసీ అండ్ స్ట్రాటజీ; ఎకనామిక్స్ అండ్ బిజినెస్ ఎన్విరాన్‌మెంట్; బిజినెస్ కమ్యూనికేషన్ | www.iimkashipur.ac.in |

# వైమానిక దళంలో.. విలువైన కొలువు

ఎయిర్‌ఫోర్స్ జాబ్స్

వైమానిక దళంలో పనిచేయాలనుకునే యువతకోసం భారత వైమానిక దళం (ఇండియన్ ఎయిర్‌ఫోర్స్) సువర్ణావకాశం కల్పిస్తోంది. గ్రూప్ ఎక్స్, గ్రూప్ వై ట్రేడుల్లో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇంటర్ లేదా డిప్లొమా పూర్తిచేసిన అవివాహిత పురుష అభ్యర్థులు అర్హులు. ఈ నేపథ్యంలో.. ఎయిర్‌ఫోర్స్ గ్రూప్-ఎక్స్, గ్రూప్-వై.. కొలువులకు అర్హతలు, ఎంపిక విధానం, పరీక్ష తీరుతెన్నుల గురించి తెలుసుకుందాం..



» గ్రూప్ ఎక్స్, గ్రూప్ వై పోస్టులకు నోటిఫికేషన్ విడుదల
» దరఖాస్తులు ప్రారంభం: జనవరి 2, 2020
» దరఖాస్తులకు చివరి తేది: జనవరి 20, 2020

### గ్రూప్ -ఎక్స్,గ్రూప్- వై

టెక్నికల్ ఫీల్డ్‌లో పనిచేయడానికి గ్రూప్ ఎక్స్ ట్రేడ్ పోస్టులు.. పాలన సంబంధ విషయాల్లో పని చేయడానికి గ్రూప్ వై పోస్టులను.. భారత వైమానిక దళం భర్తీ చేయనుంది.

### అర్హతలు

- **గ్రూప్–ఎక్స్:** ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఇంటర్ లేదా తత్సమాన విద్యలో (మ్యాథ్స్, ఫిజిక్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులుగా) 50 శాతం మార్కు లతో ఉత్తీర్ణత సాధించి ఉండాలి. లేదా మూడేళ్ల ఇంజనీరింగ్ డిప్లొమాలో 50శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. డిప్లొమాలో ఇంగ్లిష్ సబ్జెక్టులో 50 శాతం మార్కులు తప్పనిసరి.
- **గ్రూప్–వై:** ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఇంటర్ (లేదా) తత్సమాన కోర్సు 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. ఇంగ్లిష్ సబ్జెక్టులోనూ 50 శాతం మార్కులు వచ్చి ఉండాలి. లేదా రెండేళ్ల ఒకేషనల్ ఇంటర్‌ను 50 శాతం మార్కులతో పూర్తి చేయాలి. ఒకేషనల్ కోర్సులో ఇంగ్లిష్ సబ్జెకులో 50 శాతం మార్కులు పొందాలి.

### గ్రూప్ వై మెడికల్ అసిస్టెంట్ ట్రేడ్

- గ్రూప్–వై మెడికల్ అసిస్టెంట్ పోస్టుకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు.. 10+2/ ఇంటర్మీడియెట్/తత్సమాన కోర్సు ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, ఇంగ్లిష్ సబ్జెక్టులుగా 50శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. ఇంగ్లిష్ సబ్జెక్టులో 50శాతం మార్కులు తప్పనిసరి.
- డిప్లొమా విద్యార్థులు గ్రూప్–ఎక్స్ పోస్టులకు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు.

### వయసు

- జనవరి 17, 2000 నుంచి డిసెంబర్ 30, 2003 మధ్య జన్మించి ఉండాలి. 21 ఏళ్లు మించకూడదు.
- ఎత్తు కనీసం 152.5 సెంటీమీటర్లు ఉండాలి. ఊపిరి పీల్చక ముందు, పీల్చిన తర్వాత ఛాతీ వ్యత్యాసం కనీసం 5 సెంటీమీటర్లు తప్పనిసరిగా ఉండాలి. కంటి, వినికిడి, దంత సమస్యలు ఉండకూడదు.

### ఎంపిక విధానం

- దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను రెండు దశలు ఫేజ్–1, ఫేజ్–2ల్లో పరీక్షలు నిర్వహించి ఎంపిక చేస్తారు. ఫేజ్–1లో ఆన్‌లైన్ టెస్ట్ ఉంటుంది. ఫేజ్–1 అర్హత సాధించిన అభ్యర్థులను ఫేజ్–2కు ఎంపిక చేస్తారు.
- **ఫేజ్–1 గ్రూప్ ఎక్స్:** ఈ పోస్టులకు ఫిజిక్స్, ఇంగ్లిష్, మ్యాథ్స్ సబ్జెక్టులపై పరీక్ష ఉంటుంది. పరీక్ష సమయం 60 నిమిషాలు.
- **ఫేజ్–1 గ్రూప్ వై:** ఈ పోస్టులకు ఇంగ్లిష్, జనరల్ అవేర్‌నెస్, రీజనింగ్‌పై పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష సమయం 45 నిమిషాలు.
- ఈ రెండు పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఫిజిక్స్, ఇంగ్లిష్, మ్యాథ్స్ జనరల్ అవేర్‌నెస్, రీజనింగ్ సబ్జెక్టులోని ముఖ్యమైన అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఈ పరీక్షల్లో నెగిటివ్ మార్కింగ్ విధానం ఉంది. ప్రతి సరైన సమాధానానికి ఒక మార్కు లభిస్తే.. ప్రతి తప్పు సమాధానానికి వచ్చిన మార్కుల నుంచి 1/4మార్కుల కోత ఉంటుంది.

### ఫేజ్-2.. ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్

- ఫేజ్–1 పరీక్ష జరిగిన 25 రోజుల అనంతరం ఫలితాలను అధికారిక వెబ్‌సైట్ ద్వారా వెల్లడిస్తారు.
- ఇందులో అర్హత సాధించిన అభ్యర్థులు ఎయిర్‌మెన్ సెలక్షన్ సెంటర్‌కు తమ సర్టిఫికెట్లను తీసుకొని వెళ్లాలి.
- సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తయ్యాక ఫేజ్–2కు సంబంధించి ఫిజికల్ ఫిట్‌నెస్‌లో భాగంగా 1.6 కిలో మీటర్ల దూరాన్ని ఆరున్నర నిమిషాల్లో పూర్తిచేయాలి. అలాగే నిర్ణీత కాల వ్యవధిలో 10 పుష్అప్స్, 10 సిట్ అప్స్, 20 స్క్వాట్స్ పూర్తిచేయాలి.
- ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్(ఫీఎఫ్‌టీ) లో అర్హత సాధించిన అభ్యర్థులకు అడాప్టబిలిటీ టెస్ట్–1 , టెస్ట్–2 ఉంటాయి. అభ్యర్థి ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగానికి సరిపోతాడో లేదో తెలుసుకోవడానికి ఈ పరీక్షలను నిర్వహిస్తారు. టెస్ట్–1 మొత్తం ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటుంది. దీంట్లో అర్హత సాధించిన అభ్యర్థులకు టెస్ట్–2 జరుగుతుంది. ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగంలో భాగంగా అభ్యర్థులు వివిధ ప్రాంతాల్లో పనిచేయాల్సి ఉంటుంది. అలాగే మిలిటరీ వాతావరణ మార్పులకు అభ్యర్థులు అలవాటు పడగలరా లేదా తెలుసుకోవడానికి ఈ పరీక్షను నిర్వహిస్తారు. ఈ రెండు టెస్ట్‌ల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు మెడికల్ టెస్ట్‌లు నిర్వహించి ట్రెయినింగ్ కోసం ఎంపిక చేస్తారు.

### ముఖ్యసమాచారం

- **దరఖాస్తు:** ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి
- **దరఖాస్తు ప్రారంభ తేదీ:** జనవరి 02, 2020
- **దరఖాస్తులకు చివరి తేది:** జనవరి 20, 2020
- **పరీక్ష ఫీజు:** రూ.250
- **పరీక్ష తేదీలు:** 2020 మార్చి 19 నుంచి 23వ తేదీ వరకు
- **వెబ్‌సైట్ :** https://airmenselection.cdac.in www.careerindianairforce.cdac.in

సాక్షి స్పోర్ట్స్
శుక్రవారం
20-12-2019

### వేలం విశేషాలు

- 48 ఏళ్ల ప్రవీణ్ తాంబేను కనీస ధర రూ. 20 లక్షలకు కోల్‌కతా జట్టు తీసుకుంది.
- దిగ్గజ పేసర్ స్టెయిన్ రెండు సార్లు వేలానికి వచ్చినా ఎవరూ పట్టించుకోలేదు. మూడోసారి వేలంలో అతడిని కనీస ధర రూ. 2 కోట్లకు బెంగళూరు ఎంచుకుంది.
- కింగ్స్ ఎలెవన్ పంజాబ్ జట్టుకు కెప్టెన్‌గా లోకేశ్ రాహుల్, బ్యాటింగ్ కోచ్‌గా వసీమ్ జాఫర్ వ్యవహరిస్తారని ఫ్రాంచైజీ ప్రకటించింది.
- ఫించ్‌కు ఐపీఎల్‌లో బెంగళూరు ఎనిమిదో జట్టు కావడం విశేషం. గతంలో అతను ఢిల్లీ, గుజరాత్, పంజాబ్, ముంబై, పుణే, రాజస్తాన్, హైదరాబాద్ జట్లకు ఆడాడు.

'ఐపీఎల్ కోసం అన్ని విధాలా సన్నద్ధంగా ఉండేందుకు న్యూజిలాండ్‌తో మిగిలిన టెస్టు సిరీస్‌కు దూరంగా ఉంటావని ఆశిస్తున్నా.' –కమిన్స్‌ను ఉద్దేశించి మెకల్లమ్ ట్వీట్


కమిన్స్

# కోట్లాభిషేకం

## ఆస్ట్రేలియా పేస్ బౌలర్ కమిన్స్‌కు రూ. 15 కోట్ల 50 లక్షలు

సొంతం చేసుకున్న కోల్‌కతా నైట్‌రైడర్స్ • ఐపీఎల్ చరిత్రలో అత్యధిక మొత్తం పొందిన విదేశీ క్రికెటర్
మ్యాక్స్‌వెల్‌కు రూ. 10.75 కోట్లు • మోరిస్‌కు రూ. 10 కోట్లు • ముగిసిన లీగ్ వేలం

**కోల్‌కతా:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2020 కోసం సాగిన వేలంలో ఆసీస్ పేస్ బౌలర్ ప్యాట్ కమిన్స్‌కు రికార్డు మొత్తం లభించింది. కోల్‌కతా నైట్ రైడర్స్ రూ. 15 కోట్ల 50 లక్షలకు కమిన్స్‌ను సొంతం చేసుకుంది. ఐపీఎల్ చరిత్రలో ఒక విదేశీ ఆటగాడికి వేలంలో దక్కిన అత్యధిక మొత్తం ఇదే కావడం విశేషం. 2017లో రైజింగ్ పుణే సూపర్ జెయింట్స్ రూ. 14 కోట్ల 50 లక్షలకు ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్‌ను దక్కించుకోవడమే ఇప్పటి వరకు రికార్డుగా ఉంది. ఓవరాల్‌గా మాత్రం 2015లో ఢిల్లీ డేర్‌డెవిల్స్ జట్టు యువరాజ్ సింగ్‌కు ఇచ్చిన రూ. 16 కోట్లు ఇప్పటికీ రికార్డుగానే ఉంది. రూ. 2 కోట్ల కనీస ధరతో కమిన్స్ కోసం వేలం మొదలైంది. ఈ దశ నుంచి ఢిల్లీ క్యాపిటల్స్, బెంగళూరు రాయల్ చాలెంజర్స్ (ఆర్‌సీబీ) జట్లు అతని కోసం పోటీ పడి మొత్తాన్ని పెంచుతూ వెళ్లాయి. ఆర్‌సీబీకి సొంతమైనట్లుగా అనిపించిన దశలో అనూహ్యంగా కోల్‌కతా బరిలోకి వచ్చింది. చివరకు అదే జట్టు ఆస్ట్రేలియా పేసర్‌ను గెలుచుకుంది. 'వేలంలో అందుబాటులో ఉన్నవారిలో కమిన్స్ అత్యుత్తమ ఆటగాడు. గత కొన్నేళ్లలో అతను ఎంతో ఎదిగాడు. అతని ఆట అద్భుతంగా మారింది. అలాంటి క్రికెటర్‌ను ఎంచుకోవడం చాలా సంతోషంగా ఉంది' అని కోల్‌కతా హెడ్ కోచ్ బ్రెండన్ మెకల్లమ్ వ్యాఖ్యానించాడు. ఇంగ్లండ్‌కు తొలి వన్డే ప్రపంచ కప్ అందించిన ఉత్సాహం మీదున్న ఇయాన్ మోర్గాన్‌ను కూడా రూ. 5.25 కోట్లకు నైట్ రైడర్స్ దక్కించుకుంది. అయితే జట్టు కెప్టెన్‌గా మాత్రం దినేశ్ కార్తీక్ కొనసాగుతాడని ఫ్రాంచైజీ ప్రకటించింది. గతంలో కింగ్స్ ఎలెవన్ పంజాబ్ తరఫున మెరుపులు మెరిపించిన మ్యాక్స్‌వెల్‌ను ఈ సారి అదే ఫ్రాంచైజీ రూ. 10.75 కోట్లకు దక్కించుకోవడం విశేషం.

*ఐపీఎల్ వేలంలో ఆస్ట్రేలియా క్రికెటర్ల పంట పండింది. ఫాస్ట్ బౌలర్ ప్యాట్ కమిన్స్ రికార్డు ధరతో కోల్‌కతా జట్టు చెంత చేరగా... మ్యాక్స్‌వెల్, కూల్టర్ నీల్, ఫించ్, స్టొయినిస్, క్యారీ, మిషెల్ మార్ష్‌లకు కూడా భారీ మొత్తాలు లభించాయి. వన్డే ప్రపంచకప్ విజేత ఇంగ్లండ్ కెప్టెన్ మోర్గాన్‌ను కూడా నైట్‌రైడర్స్ దక్కించుకోగా, మరో ఇంగ్లండ్ ఆటగాడు స్యామ్ కరన్‌ను చెన్నై సొంతం చేసుకుంది. దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ క్రిస్ మోరిస్‌తో పాటు 'సెల్యూట్' కాట్రెల్, హెట్‌మైర్ పెద్ద మొత్తం దక్కించుకున్న ఇతర ఆటగాళ్లు. 73 స్థానాల కోసం 338 ఆటగాళ్లు పోటీ పడిన ఈ వేలంలో భారత అండర్-19 కుర్రాళ్లు కోటీశ్వరులుగా మారడం చెప్పుకోదగ్గ విశేషం. ఖాళీలు 73 ఉన్నా వేలంలో మాత్రం 62 మందినే తీసుకున్నారు. ఇందులో 29 మంది విదేశీ ఆటగాళ్లు కాగా... 33 స్వదేశీ ఆటగాళ్లు ఉన్నారు.*


• రూ. 10.75 కోట్లు
మ్యాక్స్‌వెల్


• రూ. 10 కోట్లు
మోరిస్


• రూ. 8.50 కోట్లు
కాట్రెల్


• రూ. 8 కోట్లు
కూల్టర్ నీల్


• రూ. 7.75 కోట్లు
హెట్‌మైర్

## 'కమిన్స్ ఖుష్'

'ఐపీఎల్ వేలంలో ప్యాట్ కమిన్స్ భారీ ధర పలకడం ఖాయం'... వేలానికి ముందే ఢిల్లీ క్యాపిటల్స్ కోచ్ రికీ పాంటింగ్ చేసిన వ్యాఖ్య ఇది. అందుకు తగినట్లుగానే ఢిల్లీతో పాటు బెంగళూరు కూడా కమిన్స్ కోసం పోటీ పడ్డాయి. చివరకు ఈ రెండు జట్లు తప్పుకోగా, కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) అతడిని సొంతం చేసుకుంది. గత రెండు సీజన్లుగా ఐపీఎల్ ఆడని కమిన్స్ 2017లో 15 వికెట్లు పడగొట్టి ఢిల్లీ జట్టు తరఫున అగ్రస్థానంలో నిలిచాడు. నాటితో పోలిస్తే ఇప్పుడు కమిన్స్ బౌలింగ్ మరింత పదునెక్కింది. గతంలో గాయాలతో ఇబ్బంది పడిన అతను ఇప్పుడు పూర్తి ఫిట్‌గా మారి ఆస్ట్రేలియా విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాడు. ప్రస్తుతం ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో నంబర్ వన్‌గా ఉన్న కమిన్స్, వన్డేల్లో ఐదో స్థానంలో కొనసాగుతున్నాడు. నిలకడగా 140 కిలో మీటర్లకు తగ్గని వేగంతో బౌలింగ్ చేసే కమిన్స్ జట్టులో ఉండటం ఏ జట్టుకైనా బలమే. ఆరంభంలో ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌ను బెంబేలెత్తించి వికెట్ తీయగలిగితే ప్రత్యర్థిపై పైచేయి సాధించవచ్చు. కమిన్స్‌లో ఆ సత్తా ఉందని నమ్మిన నైట్‌రైడర్స్ భారీ మొత్తాన్ని వెచ్చించింది. బ్యాట్స్‌మన్, ఆల్‌రౌండర్లకు పెద్ద విలువ దక్కే ఐపీఎల్‌లో ఒక విదేశీ పేసర్‌కు రూ. 15 కోట్ల 50 లక్షలు ఇవ్వడం పెద్ద విశేషమే! కేకేఆర్ టీమ్‌లో ఇప్పటికే ఫెర్గూసన్, గర్నీ, ప్రసిధ్ కృష్ణ, శివమ్ మావి, కమలేశ్ నాగర్‌కోటి రూపంలో రెగ్యులర్ పేసర్లు ఉన్నారు. కమిన్స్ గతంలోనూ కోల్‌కతా తరఫున ఆడాడు. 2014–15 సీజన్లలో 4 మ్యాచ్‌లు ఆడి 2 వికెట్లు పడగొట్టాడు.

## వేలంలో అమ్ముడుపోయిన ఆటగాళ్ల జాబితా

### చెన్నై సూపర్ కింగ్స్

| పేరు | ధర (రూ. కోట్లలో) |
|---|---|
| పీయూశ్ చావ్లా | రూ. 6.75 |
| స్యామ్ కరన్ | రూ. 5.5 |
| హాజల్‌వుడ్ | రూ. 2.0 |
| సాయికిశోర్ | రూ. 20 లక్షలు |

### ఢిల్లీ క్యాపిటల్స్

| | |
|---|---|
| హెట్‌మైర్ | రూ. 7.75 |
| స్టొయినిస్ | రూ. 4.8 |
| అలెక్స్ క్యారీ | రూ. 2.4 |
| జేసన్ రాయ్ | రూ. 1.5 |
| క్రిస్ వోక్స్ | రూ. 1.5 |
| మోహిత్ శర్మ | రూ. 50 లక్షలు |
| తుషార్ దేశ్‌పాండే | రూ. 20 లక్షలు |
| లలిత్ యాదవ్ | రూ. 20 లక్షలు |

### కింగ్స్ ఎలెవన్ పంజాబ్

| | |
|---|---|
| మ్యాక్స్‌వెల్ | రూ. 10.75 |
| కాట్రెల్ | రూ. 8.5 |
| క్రిస్ జోర్డాన్ | రూ. 3.0 |
| రవి బిష్ణోయ్ | రూ. 2.0 |
| ప్రభుసిమ్రన్ సింగ్ | రూ. 55 లక్షలు |
| దీపక్ హుడా | రూ. 50 లక్షలు |
| జేమ్స్ నీషమ్ | రూ. 50 లక్షలు |
| తజిందర్ ధిల్లాన్ | రూ. 20 లక్షలు |
| ఇషాన్ పోరెల్ | రూ. 20 లక్షలు |

### కోల్‌కతా నైట్ రైడర్స్

| | |
|---|---|
| ప్యాట్ కమిన్స్ | రూ. 15.5 |
| మోర్గాన్ | రూ. 5.25 |
| వరుణ్ చక్రవర్తి | రూ. 4.0 |
| టామ్ బాంటన్ | రూ. 1.0 |
| రాహుల్ త్రిపాఠి | రూ. 60 లక్షలు |
| క్రిస్ గ్రీన్ | రూ. 20 లక్షలు |
| నిఖిల్ శంకర్ | రూ. 20 లక్షలు |
| ప్రవీణ్ తాంబే | రూ. 20 లక్షలు |
| సిద్ధార్థ్ | రూ. 20 లక్షలు |

### ముంబై ఇండియన్స్

| | |
|---|---|
| కూల్టర్‌నీల్ | రూ. 8.0 |
| క్రిస్ లిన్ | రూ. 2.0 |
| సౌరభ్ తివారీ | రూ. 50 లక్షలు |
| దిగ్విజయ్ దేశ్‌ముఖ్ | రూ. 20 లక్షలు |
| ప్రిన్స్ బల్వంత్‌రాయ్ | రూ. 20 లక్షలు |
| మొహసిన్ ఖాన్ | రూ. 20 లక్షలు |

### రాజస్తాన్ రాయల్స్

| | |
|---|---|
| రాబిన్ ఉతప్ప | రూ. 3.0 |
| జైదేవ్ ఉనాద్కట్ | రూ. 3.0 |
| యశస్వి జైస్వాల్ | రూ. 2.4 |
| కార్తీక్ త్యాగి | రూ. 1.3 |
| టామ్ కరన్ | రూ. 1.0 |
| ఆండ్రూ టై | రూ. 1.0 |
| అనుజ్ రావత్ | రూ. 80 లక్షలు |
| డేవిడ్ మిల్లర్ | రూ. 75 లక్షలు |
| ఒషానే థామస్ | రూ. 50 లక్షలు |
| అనిరుధ అశోక్ జోషి | రూ. 20 లక్షలు |
| ఆకాశ్ సింగ్ | రూ. 20 లక్షలు |

### రాయల్ చాలెంజర్స్ బెంగళూరు

| | |
|---|---|
| క్రిస్ మోరిస్ | రూ. 10.0 |
| ఆరోన్ ఫించ్ | రూ. 4.4 |
| కేన్ రిచర్డ్‌సన్ | రూ. 4.0 |
| స్టెయిన్ | రూ. 2.0 |
| ఇసురు ఉదాన | రూ. 50 లక్షలు |
| షాబాజ్ అహ్మద్ | రూ. 20 లక్షలు |
| జోషువా ఫిలిప్ | రూ. 20 లక్షలు |
| పవన్ దేశ్‌పాండే | రూ. 20 లక్షలు |

### సన్‌రైజర్స్ హైదరాబాద్

| | |
|---|---|
| మిచెల్ మార్ష్ | రూ. 2.0 |
| ప్రియమ్ గార్గ్ | రూ. 1.9 |
| విరాట్ సింగ్ | రూ. 1.9 |
| ఫాబియాన్ అలెన్ | రూ. 50 లక్షలు |
| బావనాక సందీప్ | రూ. 20 లక్షలు |
| సంజయ్ యాదవ్ | రూ. 20 లక్షలు |
| అబ్దుల్ సమద్ | రూ. 20 లక్షలు |

● విదేశీ ఆటగాళ్లు ● స్వదేశీ ఆటగాళ్లు

### వేలంలో టాప్-10 ఆటగాళ్లు

| పేరు | ధర (కోట్లలో) | జట్టు |
|---|---|---|
| ప్యాట్ కమిన్స్ | రూ. 15.5 | కోల్‌కతా |
| మ్యాక్స్‌వెల్ | రూ. 10.75 | పంజాబ్ |
| క్రిస్ మోరిస్ | రూ. 10.0 | బెంగళూరు |
| కాట్రెల్ | రూ. 8.5 | పంజాబ్ |
| కూల్టర్‌నీల్ | రూ. 8.0 | ముంబై |
| హెట్‌మైర్ | రూ. 7.75 | ఢిల్లీ |
| పీయూశ్ చావ్లా | రూ. 6.75 | చెన్నై |
| స్యామ్ కరన్ | రూ. 5.5 | చెన్నై |
| మోర్గాన్ | రూ. 5.25 | కోల్‌కతా |
| స్టొయినిస్ | రూ. 4.8 | ఢిల్లీ |

### రూ.11.5 కోట్ల నుంచి రూ. 3 కోట్లకు...



ఐపీఎల్‌లో రెగ్యులర్‌గా ఆడుతూ వేర్వేరు ఫ్రాంచైజీలు విడుదల చేసిన ఆటగాళ్లలో ఇద్దరు భారత క్రికెటర్లకు మెరుగైన ధర పలికింది. రాబిన్ ఉతప్ప, జైదేవ్ ఉనాద్కట్‌లకు చెరో రూ. 3 కోట్లు ఇచ్చి రాజస్తాన్ రాయల్స్ సొంతం చేసుకుంది. గత ఏడాది ఐపీఎల్ కోసం ఇదే రాజస్తాన్ జట్టు ఉనాద్కట్‌కు రూ.11.5 కోట్లు ఇచ్చిన విషయం గమనార్హం. 2019 ఐపీఎల్ కోసం 'మిస్టరీ స్పిన్నర్' అంటూ పంజాబ్ జట్టు వరుణ్ చక్రవర్తికి ఏకంగా రూ. 8.4 కోట్లు చెల్లించి తీసుకుంది. అయితే ఒకే ఒక మ్యాచ్ ఆడిన తర్వాత గాయంతో అతను సీజన్‌కు దూరమయ్యాడు. ఇప్పుడు వరుణ్‌కు రూ. 4 కోట్లు (కోల్‌కతా) దక్కాయి.

### అనూహ్యం!



వేలంలో చెన్నై జట్టు లెగ్ స్పిన్నర్ పీయూష్ చావ్లాను రూ. 6.5 కోట్లకు కొనుక్కుంది. చావ్లా ఇటీవలి ఫామ్, అతను దేశవాళీలో సొంత జట్టు యూపీని వదిలి గుజరాత్‌కు ఆడుతున్న తీరును బట్టి చూస్తే ఈ మొత్తం ఆశ్చర్యకరం. అదీ ఎంతో లెక్కతో, జాగ్రత్తగా వేలంలో పాల్గొనే చెన్నై ఇలా ఎంచుకోవడం విశేషంగా అనిపించింది. అయితే నలుగురు విదేశీ ఆటగాళ్ల నిబంధనలో తాహిర్ అన్ని మ్యాచ్‌లు ఆడే అవకాశం లేకపోవడంతో పాటు చెన్నై పిచ్ ఇటీవల మరీ నెమ్మదించడం కూడా కారణంగా కనిపిస్తోంది. అదే విధంగా గత ఐపీఎల్‌లో పేలవ ప్రదర్శన, జాతీయ జట్టులో చోటు లేని విషయాలు చూసుకుంటే క్రిస్ మోరిస్‌కు కూడా ఆర్‌సీబీ రూ. 10 కోట్లు ఇవ్వడం చాలా ఎక్కువ!

### వీరికి సారీ!


విహారి

టి20 క్రికెట్‌లో గతంలో అద్భుతాలు చేసి ఇప్పుడు కళ తప్పినవారు కొందరైతే, మొదటి నుంచి పొట్టి క్రికెట్‌లో పెద్దగా గుర్తింపు లేనివారు మరికొందరు... అంతర్జాతీయ క్రికెట్‌లో మంచి రికార్డు ఉన్నా, ఐపీఎల్ వరకు వచ్చేసరికి అనామకులుగా కనిపించి ఎవరూ ఆసక్తి చూపించని ఆటగాళ్లు ఇంకొందరు... ఇలా ఐపీఎల్ వేలంలో అమ్ముడుపోకుండా మిగిలిపోయిన చెప్పుకోదగ్గ ఆటగాళ్ల జాబితాను చూస్తే...

భారత టెస్టు జట్టు సభ్యులు చతేశ్వర్ పుజారా, హనుమ విహారిలకు మరోసారి నిరాశే ఎదురైంది. వీరిని ఏ ఫ్రాంచైజీ ఎంచుకోలేదు. పుజారా టి20 బ్యాటింగ్‌పై మొదటి నుంచి ఎవరికీ నమ్మకం లేకపోగా, గత ఏడాది ఢిల్లీ తరఫున రెండు మ్యాచ్‌లకే పరిమితమైన ఆంధ్ర క్రికెటర్ హనుమ విహారికి కూడా ఈసారి అవకాశం దక్కలేదు. ఒకప్పుడు విధ్వంసక ఆటగాడైన యూసుఫ్ పఠాన్, ఇటీవలి వన్డే వరల్డ్ కప్‌లో అద్భుతంగా ఆడిన గ్రాండ్‌హోమ్, భారత్‌పై తాజా పర్యటనలో చెలరేగుతున్న షై హోప్, కివీస్ రెగ్యులర్ ఆటగాళ్లు గప్టిల్, కొలిన్ మున్రోలను ఎవరూ పట్టించుకోలేదు. బంగ్లాదేశ్ ఆటగాడు ముష్ఫికర్ కూడా అయ్యో పాపం అనిపించాడు. గతంలో ఎప్పుడూ ఐపీఎల్ ఆడని అతను ఈసారి వేలానికి ముందు తాను తప్పుకుంటున్నట్లు ప్రకటించాడు. ఆ తర్వాత మనసు మార్చుకొని మళ్లీ వేలంలోకి వచ్చాడు. కానీ ఎవరూ అతనిపై ఆసక్తి చూపించలేదు. 14 ఏళ్ల అఫ్గాన్ కుర్రాడు నూర్ అహ్మద్ వైపు ఫ్రాంచైజీలు కన్నెత్తి చూడలేదు.

### అండర్-19 బ్యాచ్ నుంచి ముగ్గురికి చోటు


యశస్వి

త్వరలో జరిగే అండర్-19 ప్రపంచ కప్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించబోతున్న ఆటగాళ్లలో ముగ్గురికి ఐపీఎల్‌లో మంచి విలువ పలికింది. ప్రియమ్ గార్గ్ (సన్‌రైజర్స్–రూ.1.9 కోట్లు), యశస్వి జైస్వాల్ (రాజస్తాన్–రూ.2.4 కోట్లు), కార్తీక్ త్యాగి (రాజస్తాన్–రూ. 1.3 కోట్లు) అందుకోనున్నారు. రోడ్డుపై పానీపూరీలు అమ్మే స్థాయి నుంచి ముంబై సీనియర్ జట్టు వరకు ఎదిగిన సంచలన ఆటగాడు యశస్వికి భారీ మొత్తం లభించడం విశేషం.

# సందీప్‌కు అవకాశం



వేలంలో హైదరాబాద్, ఆంధ్ర జట్ల నుంచి ఒక్క ఆటగాడికే అవకాశం దక్కింది. హైదరాబాద్ రంజీ జట్టు వైస్ కెప్టెన్, ఆల్‌రౌండర్ బావనక సందీప్‌ను సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు అతని కనీస విలువ రూ. 20 లక్షలకు తీసుకుంది. గతంలో ఢిల్లీకి ప్రాతినిధ్యం వహించిన ఆంధ్ర క్రికెటర్లు హనుమ విహారి, కోన శ్రీకర్ భరత్, యెర్రా పృథ్వీరాజ్‌లపై ఈసారి ఫ్రాంచైజీలు ఆసక్తి చూపించలేదు. ఎడంచేతి వాటం బ్యాట్స్‌మన్ అయిన సందీప్ 38 టి20ల్లో 126.77 స్ట్రయిక్‌రేట్‌తో 734 పరుగులు చేశాడు. వేలంలో కాకుండా ఇప్పటికే హైదరాబాద్ నుంచి మొహమ్మద్ సిరాజ్ బెంగళూరు తరఫున... అంబటి రాయుడు చెన్నై సూపర్ కింగ్స్ తరఫున ఆడుతున్నారు. సిరాజ్‌ను బెంగళూరు రూ. 2 కోట్ల 60 లక్షలకు... రాయుడిని చెన్నై రూ. 2 కోట్ల 20 లక్షలకు అట్టి పెట్టుకున్నాయి.

## పాక్ 191 ఆలౌట్

**కరాచీ:** శ్రీలంక బౌలింగ్ ధాటికి పాకిస్తాన్ క్రికెట్ జట్టు విలవిల్లాడింది. లాహిరు కుమార (4/49), లసిత్ ఎంబుల్‌దేనియా (4/71) తమ బౌలింగ్ పదును చూపడంతో... శ్రీలంకతో గురువారం ప్రారంభమైన రెండో టెస్టు తొలి రోజే పాకిస్తాన్ 59.3 ఓవర్లలో 191 పరుగులకు ఆలౌటైంది. బాబర్ ఆజమ్ (60; 8 ఫోర్లు, సిక్స్), అసద్ షఫీక్ (63; 6 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేశారు. ఆట ముగిసే సమయానికి శ్రీలంక తన తొలి ఇన్నింగ్స్‌లో 3 వికెట్లు కోల్పోయి 64 పరుగులు చేసింది.

## చాహర్ స్థానంలో సైనీ


సైనీ

**భువనేశ్వర్:** భారత పేసర్ దీపక్ చాహర్ వెన్నునొప్పి కారణంగా విండీస్‌తో కటక్‌లో ఆదివారం జరుగనున్న ఆఖరి వన్డేకు దూరమయ్యాడు. ఇతని స్థానంలో ఢిల్లీకి చెందిన పేస్ బౌలర్ నవదీప్ సైనీని సెలక్టర్లు ఎంపిక చేశారు. మరోవైపు వన్డే సిరీస్‌ను తేల్చే ఆఖరి పోరు కోసం భారత్, వెస్టిండీస్ జట్లు గురువారం భువనేశ్వర్ చేరుకున్నాయి.

# కోహ్లికి 'టాప్' ర్యాంక్

- ఫోర్బ్స్ ఇండియా–2019 సెలబ్రిటీ జాబితా విడుదల
- టాప్–100లో 21 మంది క్రీడాకారులు



**ముంబై:** భారత క్రికెట్ జట్టు కెప్టెన్ విరాట్ కోహ్లి కేవలం క్రికెట్లోనే కాదు ఇదివరకే సామాజిక మాధ్యమాల్లోనూ ఫాలోవర్ల పరంగా దూసుకెళ్లాడు. ఇప్పుడు 'ఫోర్బ్స్ ఇండియా' సెలబ్రిటీల జాబితాలోనూ 'టాప్' లేపాడు. ఐసీసీ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో ఉన్న ఈ 'రన్ మెషిన్' తాజాగా భారత టాప్–100 సెలబ్రిటీల్లోనూ నంబర్‌వన్‌గా నిలిచాడు. మొత్తం రూ. 252.72 కోట్ల ఆర్జనతో అతనికి మొదటి స్థానం దక్కింది. అయితే బాలీవుడ్ సూపర్‌స్టార్ అక్షయ్ కుమార్ రూ. 293.25 కోట్లతో రెండో స్థానంలో ఉన్నాడు. ఇక్కడ ఫోర్బ్స్ జాబితా ర్యాంకుల్ని కేవలం ఆదాయంతోనే గణించరు. ఆ లెక్కన చూస్తే అక్షయ్ 'టాప్'లేపేవాడు. కానీ ఫోర్బ్స్ లెక్కకు ఇతర కోణాలు ప్రాతిపదిక అవుతాయి. ఆదాయంతో పాటు, పేరు ప్రఖ్యాతులు, ప్రసార మాధ్యమాల్లోని క్రేజ్, సామాజిక సైట్లలో అనుసరిస్తున్న వారి సంఖ్య (ఫాలోవర్స్)లాంటి అంశాలను బట్టి ర్యాంకింగ్‌ను కేటాయిస్తారు. గతేడాది అక్టోబర్ 1 నుంచి ఈ ఏడాది సెప్టెంబర్ 30 వరకు ఈ అంశాలను లెక్కలోకి తీసుకున్న ఫోర్బ్స్ మేగజైన్ తాజా సంపన్న సెలబ్రిటీల జాబితాలో కోహ్లికి అగ్రతాంబూలమిచ్చింది. టాప్–100లో క్రీడాకారుల సంఖ్య పెరిగింది. 21 మంది క్రీడాకారులకు చోటు దక్కింది. క్రికెటర్లు కాకుండా బ్యాడ్మింటన్ స్టార్స్ సింధు, సైనా, సునీల్ ఛెత్రి (ఫుట్‌బాల్), మేరీకోమ్ (బాక్సింగ్), బజరంగ్ (రెజ్లింగ్), అనిర్బన్ (గోల్ఫ్), బోపన్న (టెన్నిస్) కూడా ఈ జాబితాలో ఉన్నారు.

| ర్యాంక్ | ప్లేయర్ | సంపాదన |
|---|---|---|
| 1 | కోహ్లి | రూ. 252.72 కోట్లు |
| 5 | ధోని | రూ. 135.93 కోట్లు |
| 9 | సచిన్ | రూ. 76.96 కోట్లు |
| 11 | రోహిత్ శర్మ | రూ. 54.29 కోట్లు |
| 30 | రిషభ్ పంత్ | రూ. 29.19 కోట్లు |
| 31 | హార్దిక్ పాండ్యా | రూ. 24.87 కోట్లు |
| 33 | జస్‌ప్రీత్ బుమ్రా | రూ. 23.25 కోట్లు |
| 34 | లోకేశ్ రాహుల్ | రూ. 23.19 కోట్లు |
| 35 | శిఖర్ ధావన్ | రూ. 19.11 కోట్లు |
| 51 | రవీంద్ర జడేజా | రూ. 18.41 కోట్లు |
| 61 | కుల్దీప్ యాదవ్ | రూ. 15.27 కోట్లు |
| 63 | పీవీ సింధు | రూ. 21.05 కోట్లు |
| 81 | సైనా నెహ్వాల్ | రూ. 3 కోట్లు |
| 85 | సునీల్ ఛెత్రి | రూ. 6.1 కోట్లు |
| 87 | మేరీకోమ్ | రూ. 3.9 కోట్లు |
| 88 | మిథాలీ రాజ్ | రూ. 2.63 కోట్లు |
| 90 | స్మృతి మంధాన | రూ. 2.85 కోట్లు |
| 91 | హర్మన్‌ప్రీత్ కౌర్ | రూ. 2.12 కోట్లు |
| 94 | బజరంగ్ పూనియా | రూ. 2.4 కోట్లు |
| 95 | అనిర్బన్ లాహిరి | రూ. 5.3 కోట్లు |
| 98 | రోహన్ బోపన్న | రూ. 1.87 కోట్లు |

# విజయం దిశగా ఆంధ్ర

- రికీ భుయ్ అజేయ సెంచరీ
- హడలెత్తించిన స్టీఫెన్, శశికాంత్
- రెండో ఇన్నింగ్స్‌లో ఢిల్లీ 89/6


రికీ భుయ్

**సాక్షి, ఒంగోలు టౌన్:** రికీ భుయ్ (313 బంతుల్లో 144 నాటౌట్; 15 ఫోర్లు, 4 సిక్స్‌లు) అజేయ సెంచరీకి తోడు... బౌలింగ్‌లో చీపురుపల్లి స్టీఫెన్ (4/47), శశికాంత్ (2/24) హడలెత్తించడంతో... ఢిల్లీతో జరుగుతున్న రంజీ ట్రోఫీ క్రికెట్ గ్రూప్ 'ఎ' మ్యాచ్‌లో ఆంధ్ర విజయం దిశగా సాగుతోంది. 153 పరుగులతో వెనుకబడి రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఢిల్లీ మూడో రోజు ఆట ముగిసే సమయానికి 28 ఓవర్లలో 89 పరుగులకే 6 వికెట్లు కోల్పోయింది. ఢిల్లీ జట్టు ఇన్నింగ్స్ ఓటమి తప్పించుకోవాలంటే మరో 64 పరుగులు చేయాలి. ప్రస్తుతం లలిత్ యాదవ్ (23 బ్యాటింగ్; 4 ఫోర్లు), వికాస్ మిశ్రా (7 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. నేడు మ్యాచ్‌కు చివరి రోజు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 249/6తో బ్యాటింగ్ కొనసాగించిన ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో 127 ఓవర్లలో 368 పరుగులకు ఆలౌటైంది. దీంతో ఆంధ్రకు 153 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. ఒకదశలో 8 వికెట్లకు 250 పరుగులతో ఉన్న ఆంధ్ర జట్టుకు ఆధిక్యం 50 పరుగులు దాటుతుందో లేదో అనే అనుమానం కలిగింది. అయితే రికీ భుయ్ పట్టుదలతో ఆడి చివరి వరుస బ్యాట్స్‌మెన్ స్టీఫెన్ (60 బంతుల్లో 19; 3 ఫోర్లు)తో కలిసి తొమ్మిదో వికెట్‌కు 76 పరుగులు... విజయ్ కుమార్ (20 బంతుల్లో 16; 2 ఫోర్లు, సిక్స్)తో కలిసి పదో వికెట్‌కు 42 పరుగులు జోడించి ఆంధ్రకు భారీ ఆధిక్యం లభించడంలో కీలకపాత్ర పోషించాడు.

సాక్షి బిజినెస్
శుక్రవారం
20-12-2019
WWW.SAKSHIBUSINESS.COM


**స్టాక్ మార్కెట్లు**

దేశీ సూచీలు

| | సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|---|
| మార్పు | 115 ▲ | 38 ▲ |
| ముగింపు | 41,674 | 12,260 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు 11.30గంటలకు)

| సూచీ | విలువ | | మార్పు |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 8,868 | ▲ | 40 |
| డోజోన్స్ | 28,350 | ▲ | 111 |
| ఎఫ్‌టీఎస్ఈ 100 | 7,574 | ▲ | 33 |
| డాక్స్ | 13,211 | ▼ | 10 |
| షాంఘై | 3,017 | | 0 |
| నికాయ్ | 23,865 | ▼ | 70 |

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

**ఫారెక్స్ రేట్లు** రూ. లలో

| | కరెన్సీ | | ● కొనుగోలు | ● అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 70.27 | 71.91 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 91.46 | 94.67 |
| € | యూరో | ఎస్‌బీఐ | 77.68 | 80.58 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 63.69 | 66.09 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 47.85 | 50.05 |
| S$ | సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 51.54 | 53.35 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 18.15 | 19.76 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.88 | 19.88 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.51 | 10.92 |

# వ్యాపార నిబంధనాలు తొలగించండి

- నిర్వహణ సులభతరం చేయండి
- స్వేచ్ఛగా పనిచేసుకునే వాతావరణం ఉండాలి
- విలీనాలు, కొనుగోళ్లకు నిబంధనల అవరోధం తొలగించాలి
- కేంద్ర ఆర్థిక మంత్రికి పారిశ్రామికవేత్తల వినతి

**న్యూఢిల్లీ:** దేశంలో వ్యాపారాలను మరింత సులభంగా నిర్వహించుకునే వాతావరణం కల్పించాలని ప్రముఖ పారిశ్రామిక వేత్తలు కేంద్రాన్ని కోరారు. 2020–21 బడ్జెట్ ముందస్తు సంప్రదింపుల్లో భాగంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం భారతీ ఎంటర్‌ప్రైజెస్ చైర్మన్ సునీల్ భారతీ మిట్టల్, సీఐఐ ప్రెసిడెంట్ విక్రమ్ కిర్లోస్కర్, అసోచామ్ ప్రెసిడెంట్ బాలకృష్ణ గోయెంకా తదితర పారిశ్రామిక ప్రముఖులతో పాటు కార్మిక సంఘాలతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారు ముఖ్యమైన సూచనలు, డిమాండ్లను ప్రభుత్వం ముందుంచారు.

**మరింత స్వేచ్ఛ...**

''దేశంలో వ్యాపార నిర్వహణను సులభంగా మార్చే విషయమై చర్చించేందుకే నేను ఈ రోజు ఇక్కడకు వచ్చాను. నా డిమాండ్ ఇదే. వినియోగదారుల ప్రయోజనాన్ని, పెట్టుబడులను సమతౌల్యం చేయాల్సి ఉంది'' అని సునీల్ భారతీ మిట్టల్ సమావేశం అనంతరం మీడియా ప్రతినిధులకు చెప్పారు. కంపెనీల కొనుగోళ్లు, విలీనాలు, వ్యాపార విభజన, ఎన్‌సీఎల్‌టీ ప్రక్రియను ఆలస్యం చేస్తున్న ఆదాయపన్ను సెక్షన్లపై సూచనలు చేసినట్టు వెల్లడించారు. ''పరిశ్రమలు మరింత స్వేచ్ఛగా పనిచేసే వాతావరణం ఉండాలన్నదే ఆలోచన. వాటిని ఆర్థిక మంత్రి చక్కగా స్వీకరించారు. భారత పారిశ్రామికవేత్తల శక్తిని ద్విగుణీకృతం చేసే విధంగా ఈ బడ్జెట్ ఉండాలని కోరుకుంటున్నాం'' అని మిట్టల్ తెలిపారు. వ్యాపార సులభతర నిర్వహణ కీలక పాత్ర పోషిస్తుందని అసోచామ్ ప్రెసిడెంట్ బాలకృష్ణగోయంకా పేర్కొనగా, చాలా పరిశ్రమలకు ఇదే ఆందోళనకర అంశమని సీఐఐ ప్రెసిడెంట్ విక్రమ్ కిర్లోస్కర్ చెప్పారు. వ్యాపార సులభ నిర్వహణతోపాటు వృద్ధి ప్రేరణకు ఏం చేయగలమన్న అంశంపై చర్చించినట్టు ఆర్‌పీ సంజీవ్ గోయెంకా గ్రూపు అధినేత సంజీవ్ గోయెంకా తెలిపారు. ''అన్ని రకాల సలహాలను వారు స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈ తరహా స్పందనను ప్రభుత్వం నుంచి చూడడం ఇదే మొదటిసారి'' అని గోయెంకా పేర్కొన్నారు. మందగమనం చాలా రంగాల్లో ఉత్పత్తి సామర్థ్యం వినియోగంపై ప్రభావం చూపించిందన్నారు. ఇది సాధారణ స్థితికి రావడానికి మూడు, నాలుగు త్రైమాసికాల సమయం పడుతుందని అభిప్రాయపడ్డారు.



**పన్ను భారం తగ్గించాలి..**

''రూ.20 లక్షల కంటే ఒక ఏడాదిలో తక్కువ ఆర్జించే వారికి ఆదాయపన్ను తగ్గించాలని సూచన చేశాం. దీనివల్ల వినియోగదారుల చేతుల్లో ఖర్చు చేసేందుకు మరింత ఆదాయం ఉంటుంది. అది ఆర్థిక వ్యవస్థకు మేలు చేస్తుంది. ఈఎంఐలను తగ్గించాలనీ కోరాం. ఆర్‌బీఐ రేట్ల తగ్గింపు ప్రయోజనాన్ని మరింతగా వినియోగదారులకు బదిలీ చేస్తే ఈఎంఐల భారం తగ్గుతుంది'' అని ఫిక్కీ ప్రెసిడెంట్ సందీప్ సోమాని తెలిపారు.

## ఆదాయపన్ను సీలింగ్ పెంచాలి: కార్మిక సంఘాలు

కనీస వేతనాన్ని రూ.21,000 చేయాలని, ఎంప్లాయీస్ పెన్షన్ స్కీమ్ కింద కనీస పెన్షన్‌ను రూ.6,000కు పెంచాలని, వార్షికంగా రూ.10 లక్షల ఆదాయం ఉన్న వారిని ఆదాయపన్ను నుంచి మినహాయించాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిని కార్మిక సంఘాలు కోరాయి. బడ్జెట్ ముందస్తు సంప్రదింపుల్లో భాగంగా తమ డిమాండ్లను మంత్రి ముందుంచాయి. దేశంలో నిరుద్యోగం పెరిగిపోవడంపై ఆందోళనను వ్యక్తం చేశాయి. ఉద్యోగ కల్పన దిశగా రానున్న బడ్జెట్‌లో ఉండాల్సిన చర్యలను సూచించాయి.

- మౌలిక, సామాజిక రంగాలు, వ్యవసాయంపై ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులను వ్యయం చేయడం ద్వారా ఉద్యోగాలను కల్పించొచ్చు.
- అన్ని ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వరంగ సంస్థల్లో ఖాళీలను భర్తీ చేయాలి. ప్రభుత్వ ఉద్యోగాల తగ్గింపు, అదనపు పోస్టులపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయాలి.
- నిత్యావసర వస్తువులను స్పెక్యులేటివ్ ఫార్వార్డ్ ట్రేడింగ్ నుంచి నిషేధించాలి.
- సామర్థ్యాలు ఉండి కూడా దెబ్బతిన్న ప్రభుత్వ రంగ సంస్థలను పునరుద్ధరించేందుకు బడ్జెట్ నుంచి నిధుల సహకారం ఇవ్వాలి.
- 10 మంది ఉద్యోగులను కలిగిన కంపెనీలనూ ఈపీఎఫ్‌వో పరిధిలోకి తీసుకురావాలి. ప్రస్తుతం ఇది కనీసం 20 మంది ఉద్యోగులున్న కంపెనీలకు వర్తిస్తోంది.
- గ్రాట్యుటీని ఏడాదిలో 15 రోజులకు కాకుండా కనీసం 30 రోజులకు చెల్లించేలా చేయాలి.
- హౌసింగ్, మెడికల్, ఎడ్యుకేషన్‌కు సంబంధించి ఇస్తున్న అలవెన్స్‌లపై పన్ను మినహాయింపు ఇవ్వాలి.
- స్టీల్, బొగ్గు, మైనింగ్, హెవీ ఇంజనీరింగ్, ఫార్మా, డ్రెడ్జింగ్, సివిల్ ఏవియేషన్, ఫైనాన్షియల్ రంగంలోని ప్రభుత్వరంగ సంస్థలను వ్యూహాత్మక విక్రయాలకు దూరంగా ఉంచాలి.

## 28న క్రెడాయ్ రియల్టీ పురస్కారాలు

**క్రిసిల్ సంస్థ ద్వారా ప్రాజెక్టుల పనితీరు పరిశీలన**



**హైదరాబాద్, సిటీ బ్యూరో:** నిర్మాణ రంగంలో నాణ్యతతో పాటు వినియోగదారుడి భద్రతకు పెద్దపీట వేసిన డెవలపర్‌ను ప్రోత్సహించేందుకే పురస్కారాలను ఆరంభించినట్లు కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్) తెలంగాణ శాఖ ఛైర్మన్ గుమ్మి రామిరెడ్డి, అధ్యక్షుడు సీహెచ్ రామచంద్రా రెడ్డి చెప్పారు. గురువారమిక్కడ విలేకరులతో వారు మాట్లాడారు. ఈ నెల 28న క్రియేట్–2019 పేరిట హైదరాబాద్ 'జేఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్'లో క్రెడాయ్ తెలంగాణ రియాల్టీ పురస్కారాలను అందజేయనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి కేటీఆర్ హాజరవుతారని, మొత్తం 13 విభాగాల్లో 103 నామినేషన్లు వచ్చాయని వారు తెలియజేశారు. రేటింగ్ సంస్థ క్రిసిల్ ద్వారా ఆయా ప్రాజెక్టుల లొకేషన్, గ్రీనరీ, నాణ్యత, వినియోగదారుడి భద్రతను పరిగణనలోకి తీసుకుని వాటి ఆధారంగా అవార్డులకు ఎంపిక జరుగుతుందని తెలియజేశారు.

**ఏపీలో 3 రాజధానులు సరైన నిర్ణయమే..**

ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజధానుల విషయంలో సరైన నిర్ణయం తీసుకున్నారని క్రెడాయ్ సభ్యులు అభిప్రాయపడ్డారు. విలేకరులడిగిన ప్రశ్నకు స్పందిస్తూ... అమరావతితో పాటు కర్నూలు, విశాఖలో రాజధానులు వస్తే మరింత పురోగతి సాధ్యపడుతుందన్నారు. సమావేశంలో క్రెడాయ్ కార్యదర్శి ప్రేమ్‌సాగర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు కె.ఇంద్రసేనా రెడ్డి, జి.అజయ్‌కుమార్, కోశాధికారి బి.పాండు రంగారెడ్డి పాల్గొన్నారు.

## టెలికం.. లైన్ కట్ అవుతోంది

- ట్రాయ్ తక్షణం జోక్యం చేసుకోవాలి
- ఎయిర్‌టెల్ చీఫ్ సునీల్ మిట్టల్ వ్యాఖ్యలు
- ఏఆర్‌పీయూ రూ. 300కు చేరవచ్చని అంచనా

**న్యూఢిల్లీ:** అత్యంత చౌక చార్జీలు, భారీ స్థాయిలో వినియోగం.. అన్నీ కలిసి టెలికం పరిశ్రమను కోలుకోలేనంతగా కుదేలెత్తిస్తున్నాయని టెల్కో దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ చీఫ్ సునీల్ భారతీ మిట్టల్ ఆందోళన వ్యక్తం చేశారు. టెలికం రంగ నియంత్రణ సంస్థ ట్రాయ్ తక్షణమే జోక్యం చేసుకోకపోతే పరిస్థితి మరింత దిగజారే అవకాశం ఉందన్నారు. ఇటు పెట్టుబడులు అటు వినియోగదారుల ప్రయోజనాలు దెబ్బతినకుండా, రెండింటి మధ్య సమతౌల్యం ఉండేలా ట్రాయ్ తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. బడ్జెట్ ముందరి సమావేశాల్లో భాగంగా ఇతర కార్పొరేట్ దిగ్గజాలతో కలిసి గురువారం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అయిన సందర్భంగా సునీల్ మిట్టల్ ఈ వ్యాఖ్యలు చేశారు. మరోవైపు, టెలికం కంపెనీల ఏఆర్‌పీయూ (యూజరుపై సగటు ఆదాయం) క్రమంగా రూ.200 నుంచి రూ.300 దాకా చేరొచ్చని చెప్పారాయన. 'డేటా, వాయిస్, ఇతర సర్వీసులకు కలిపి నెలకు ఒకో యూజరు కనిష్టంగా రూ.100, గరిష్టంగా రూ.450–500 దాకా చెల్లించవచ్చని అంచనా. వీటి సగటు సుమారు రూ.300 దాకా ఉండవచ్చు. డాలర్ రూపంలో నెలకు 4 డాలర్లు. ప్రపంచంలోనే అత్యంత చౌక టారిఫ్‌లు ఇవే. డేటా వినియోగం మాత్రం మిగతా దేశాలతో పోలిస్తే రెండు, మూడు రెట్లు ఎక్కువే' అని మిట్టల్ పేర్కొన్నారు. ఇంటర్‌కనెక్ట్ యూసేజీ చార్జీలను (ఐయూసీ) ట్రాయ్ ఏడాది పాటు వాయిదా వేయడం, టెలికం సేవలకు కనీస చార్జీలను నిర్ణయించే అంశంపై దృష్టి సారించడం తదితర అంశాల నేపథ్యంలో సునీల్ మిట్టల్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.



**కర్ణాటకలో 3జీ సేవలకు ఎయిర్‌టెల్ గుడ్‌బై**

ఎయిర్‌టెల్ క్రమంగా 3జీ సేవలను ఉపసంహరిస్తోంది. ఇందులో భాగంగా ముందుగా కర్ణాటకలో 3జీ నెట్‌వర్క్‌ను నిలిపివేసినట్లు కంపెనీ గురువారం తెలిపింది. ఇకపై అక్కడ మొబైల్ బ్రాడ్‌బ్యాండ్ సర్వీసులను.. హై స్పీడ్ 4జీ నెట్‌వర్క్‌పై అందిస్తామని తెలిపింది. ఫీచర్ ఫోన్ల వినియోగదారుల కోసం 2జీ సేవలు యథాప్రకారం కొనసాగించనున్నట్లు తెలిపింది.

## పర్యాటక రంగం.. 50 బిలియన్ డాలర్లు

**2022 నాటికి లక్ష్యం: అమితాబ్‌కాంత్**



**న్యూఢిల్లీ:** పర్యాటక రంగం 2022 నాటికి 50 బిలియన్ డాలర్ల (రూ.3.55 లక్షల కోట్లు) ఆదాయ లక్ష్యాన్ని సాధించాలని నీతి ఆయోగ్ అమితాబ్ కాంత్ సూచించారు. ఈ రంగానికి వృద్ధి అవకాశాలు, ఉపాధి కల్పన అవకాశాలు అపారంగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. సీఐఐ 15వ వార్షిక పర్యాటక సదస్సు ఢిల్లీలో గురువారం జరిగింది. దీనికి కాంత్ హాజరై మాట్లాడారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా భారీ ఉపాధి అవకాశాలు కల్పించే సామర్థ్యం పర్యాటకానికి ఉందన్నారు. ''2018లో భారత పర్యాటక రంగం 28.6 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని ఆర్జించింది. దీన్ని 2022 నాటికి 50 బిలియన్ డాలర్లకు తీసుకెళ్లే లక్ష్యాన్ని పెట్టుకోవాలి''అని ఆయన పేర్కొన్నారు.

## ఐదేళ్లలో రెట్టింపు కానున్న రిటైల్ రుణాలు

**రూ.96 లక్షల కోట్లకు..: ఐసీఐసీఐ బ్యాంకు**



**ముంబై:** ఫైనాన్స్ సంస్థల రుణ పుస్తకం విలువ 2019 మార్చి నాటికి రూ.48 లక్షల కోట్లుగా ఉండగా, ఇది వచ్చే ఐదేళ్ల కాలంలో 2024 నాటికి రూ.96 లక్షల కోట్లకు వృద్ధి చెందుతుందని ఐసీఐసీఐ బ్యాంకు నివేదిక వెల్లడించింది. ప్రైవేటు వినియోగం (ఇల్లు, కారు, కన్స్యూమర్ డ్యూరబుల్స్, క్రెడిట్ కార్డులు) కారణంగా రుణ మార్కెట్ భారీగా వృద్ధి చెందనుందని అంచనా వేసింది. వినియోగదారుల్లో రుణాలు తీసుకునే ధోరణి పెరుగుతుండడం, అదే సమయంలో వినియోగదారుల డేటా లభ్యత పెరగడం, డేటా అనలైటిక్స్ వినియోగం అన్నవి చౌక గృహ రుణాలు, ఎంఎస్ఎంఈ రుణాల వృద్ధికి దారితీయనున్నట్టు ఈ సంస్థ వివరించింది.

## రూ. 500 కోట్లు దాటిన 'పెప్స్' వ్యాపారం

**సాక్షి బెంగళూరు:** వ్యాపారంలో ఎంతమందికి చేరువయ్యామన్నదే ప్రధానమని పెప్స్ ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ కె.మాధవన్ చెప్పారు. సంస్థ 14వ వార్షికోత్సవం సందర్భంగా గురువారమిక్కడ జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ... శరీరానికి నిద్ర ప్రధానం కాబట్టి ఎలాంటి పరుపు కొనాలనే దానిపై ప్రస్తుతం ఎందరినో సంప్రదించాల్సి వస్తోందని చెప్పారు. గత 14 ఏళ్లలో దేశ వ్యాప్తంగా లక్షల మంది పెప్స్ పరుపులు కొన్నారని తెలియజేశారు. రూ.4 కోట్లతో వ్యాపారం ప్రారంభించగా.. 14 ఏళ్లలో రూ.500 కోట్లకు చేరామని చెప్పారాయన. ''కొత్త పరుపు కొనడంలో చాలా జాగ్రత్తలు పాటించాలి. పరుపు ఎత్తు కీలకం. నేలమట్టం నుంచి 24 అంగుళాల ఎత్తులో ఉండటం శ్రేయస్కరం'' అని వివరించారు. పరుపులు పాతబడిన వెంటనే మార్చుకోవాలని.. పదేళ్లకు మించి వినియోగించరాదని సూచించారు. భారతదేశంలో కోల్‌కతా, కోయంబత్తూరు, ఢిల్లీ, పుణేలో ఉత్పత్తి కేంద్రాలున్నాయని తెలియజేశారు.



14వ వార్షికోత్సవంలో జేఎండీ శంకర్‌రామ్, ఎండీ మాధవన్ (ఎడమ నుంచి)

**గ్రామ స్థాయి వరకు చేరవేయడమే లక్ష్యం**

పెప్స్ పరుపులను పట్టణాల నుంచి గ్రామ స్థాయి వరకు చేరవేయడమే లక్ష్యమని పెప్స్ ఇండస్ట్రీస్ జేఎండీ జి.శంకర్‌రామ్ చెప్పారు. తెలంగాణలో హైదరాబాద్‌తో పాటు మరి కొన్ని ప్రాంతాల్లో పెప్స్ శాఖలు ప్రాచుర్యం పొందాయని, ఏపీలో కోస్తా ప్రాంతంలో వ్యాపారం బాగుందని చెప్పారు. రాయలసీమలో ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతోందన్నారు. ప్రస్తుతం విదేశీ మెటీరియల్‌పై ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నా.. పెప్స్ పరుపులకు మాత్రం ఆదరణ తగ్గలేదని చెప్పారాయన.

## బెంగళూరులో ఎక్కువ వేతనాలు

- ఐటీ రంగంలో ఎక్కువగా పారితోషికం
- వేతన ధోరణులపై రాండ్‌స్టాడ్ నివేదిక

**న్యూఢిల్లీ:** దేశంలో అత్యంత వేతన చెల్లింపులకు రాజధానిగా బెంగళూరు తన స్థానాన్ని కాపాడుకుంది. అలాగే, అత్యధిక పారితోషికాలు ఐటీ రంగంలో ఉన్నట్టు రాండ్‌స్టాడ్ 'ఇన్‌సైట్స్ శాలరీ ట్రెండ్స్ 2019' నివేదిక వెల్లడించింది. బెంగళూరులో జూనియర్ స్థాయి ఉద్యోగిపై కంపెనీ వార్షికంగా చేస్తున్న సగటు వ్యయం (సీటూసీ) రూ.5.27 లక్షలుగా ఉంటే, మధ్య స్థాయి ఉద్యోగిపై ఇది రూ.16.45 లక్షలు, సీనియర్ లెవల్ ఉద్యోగిపై రూ.35.45 లక్షలుగా ఉంది. ఈ సంస్థ రూపొందించిన 2018, 2017 నివేదికల్లోనూ అత్యధిక వేతనాలున్న నగరంగా బెంగళూరు మొదటి స్థానంలో నిలవడం గమనార్హం. జూనియర్ లెవల్ ఉద్యోగులకు అధికంగా చెల్లింపులున్న రెండో నగరంగా హైదరాబాద్ చోటు సంపాదించింది. ఇక్కడ సగటు సీటూసీ రూ.5లక్షలు. రూ.4.59 లక్షలతో మూడో స్థానంలో ముంబై నగరం ఉంది. మధ్య స్థాయి ఉద్యోగులకు అధికంగా చెల్లిస్తున్న నగరాల్లో ముంబై రూ.15.07 లక్షలతో రెండో స్థానంలో, దేశ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్) రూ.14.5 లక్షలతో మూడో స్థానంలో ఉన్నాయి.



## మార్కెట్లోకి టాటా ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ



- నెక్సాన్ ఈవీ.. మూడు వేరియంట్లలో లభ్యం
- ఒక్క సారి చార్జింగ్.. 300 కి.మీ. ప్రయాణం
- రూ.15–17 లక్షల రేంజ్‌లో ధర

**ముంబై:** వాహన దిగ్గజం టాటా మోటార్స్ తన పాపులర్ ఎస్‌యూవీ మోడల్, నెక్సాన్‌లో ఎలక్ట్రిక్ వేరియెంట్.. నెక్సాన్ ఈవీని గురువారం ఆవిష్కరించింది. ఒక్కసారి చార్జింగ్ చేస్తే 300 కిలోమీటర్లు కంటే ఎక్కువగానే ప్రయాణించే ఈ వాహన విక్రయాలను మరికొన్ని వారాల్లోనే ప్రారంభిస్తామని టాటా మోటార్స్ తెలిపింది. గంటకు వంద కిలోమీటర్ల వేగాన్ని 9.9 సెకన్లలోనే ఈ వాహనం అందుకోగలదని టాటా మోటార్స్ సీఈఓ, ఎమ్‌డీ గుంటర్ బుశ్చెక్ చెప్పారు. నేటి (శుక్రవారం) నుంచే బుకింగ్స్ మొదలుపెడతామని, ఆన్‌లైన్‌లో కూడా ఈ కారును బుక్ చేసుకోవచ్చని తెలిపారు. మూడు వేరియంట్లలో లభ్యమయ్యే ఈ వాహనం ధర రూ.15–17 లక్షలు రేంజ్‌లో ఉంటుందని పేర్కొన్నారు. ఎనిమిదేళ్లు లేదా 1.6 లక్షల కి.మీ. వారంటీని ఇస్తున్నామని, పరిశ్రమలో ఇదే అత్యధిక వారంటీ అని వివరించారు. ఈ వాహన బ్యాటరీని ఫాస్ట్ చార్జింగ్ మోడ్‌లో చార్జింగ్ చేస్తే గంటలోనే 80 శాతం మేర చార్జింగ్ అవుతుందని కంపెనీ ఎలక్ట్రిక్ మొబిలిటీ యూనిట్ ప్రెసిడెంట్ శైలేష్ చంద్ర చెప్పారు. 15 యాంపియర్ ప్లగ్ పాయింట్ ద్వారా కూడా ఈ వాహన బ్యాటరీని చార్జింగ్ చేయవచ్చని వివరించారు. జిప్‌ట్రాన్ పవర్‌ట్రైన్ టెక్నాలజీతో రూపొందిన ఈ వాహనంలో 30.3 కిలోవాట్‌అవర్ హై ఎనర్జీ డెన్సిటీ లిథియమ్ అయాన్ బ్యాటరీ ప్యాక్ ఉంటుందని పేర్కొన్నారు.

**రెండో ఎలక్ట్రిక్ వాహనం....**

టాటా మోటార్స్ నుంచి వస్తోన్న రెండో ఎలక్ట్రిక్ వాహనం ఇది. ఇంతకు ముందు ఈ కంపెనీ టిగోర్‌లో ఒక ఎలక్ట్రిక్ వాహనాన్ని అందుబాటులోకి తెచ్చింది. ట్యాక్సీ ఆపరేటర్లను దృష్టిలో పెట్టుకొని తెచ్చిన టిగోర్ ఈవీకి మంచి స్పందన లభిస్తోందని శైలేష్ చంద్ర పేర్కొన్నారు. ఒక్కో టిగోర్ ఈవీ వల్ల ట్యాక్సీ ఆపరేటర్లకు రూ.7,000 ఆదా అవుతున్నాయని వివరించారు. దీని రేంజ్ 150 కి.మీ. అని, ఇప్పుడు 300 కి.మీ. రేంజ్ ఉండే నెక్సాన్ ఈవీను అందుబాటులోకి తెస్తున్నామని తెలిపారు. టిగోర్ ఈవీని ట్యాక్సీ ఆపరేటర్ల కోసం తెస్తే, నెక్సాన్ ఈవీని వ్యక్తిగత వినియోగదారుల కోసం తెస్తున్నామని వివరించారు.

## మారుతీ ఆల్టోలో కొత్త వేరియంట్



**న్యూఢిల్లీ:** మారుతీ సుజుకీ ఇండియా కంపెనీ ఎంట్రీ లెవల్ చిన్న కారు, ఆల్టోలో కొత్త వేరియంట్‌ను (ఆల్టో వీఎక్స్ఐప్లస్)గురువారం మార్కెట్లోకి తెచ్చింది. ఈ కారు ధర రూ.3.80 లక్షలని(ఎక్స్ షోరూమ్) మారుతీ సుజుకీ ఇండియా ఈడీ(మార్కెటింగ్ అండ్ సేల్స్) శశాంక్ శ్రీవాత్సవ చెప్పారు. బీఎస్–సిక్స్ పర్యావరణ నిబంధనలకనుగుణంగా ఈ కారును తయారు చేశామని, లీటర్‌కు 22 కి.మీ. మైలేజీని ఇస్తుందని పేర్కొన్నారు. ఈ కొత్త వేరియంట్‌లో ఏరో ఎడ్జ్ డిజైన్, డ్యుయల్–టోన్ ఇంటీరియర్స్ వంటి ప్రత్యేకతలున్నాయని తెలిపారు.

## హ్యుందాయ్ 'ఆరా'.. ఆగయా

- వచ్చే నెల నుంచి విక్రయాలు
- రూ.6– 9 లక్షల రేంజ్‌లో ధరలు!



**చెన్నై:** హ్యుందాయ్ మోటార్ కంపెనీ తన కొత్త కాంపాక్ట్ సెడాన్ 'ఆరా'ను ఆవిష్కరించింది. ఈ సెడాన్‌ను వచ్చే నెలలో మార్కెట్లోకి ప్రవేశపెడతామని హ్యుందాయ్ ఇండియా తెలియజేసింది. ఈ సెగ్మెంట్లో ఎక్సెంట్ తర్వాత ఈ కంపెనీ అందిస్తున్న మరో కారు ఇది. స్పోర్ట్స్ యుటిలిటి వెహికల్ (ఎస్‌యూవీ), కాంపాక్ట్ హ్యాచ్‌బాక్ సెగ్మెంట్లలో మంచి అమ్మకాలు సాధిస్తున్నామని కంపెనీ ఎమ్‌డీ, సీఈఓ ఎస్.ఎస్. కిమ్ పేర్కొన్నారు. కాంపాక్ట్ సెడాన్ సెగ్మెంట్లో వెనకబడి ఉన్నామని, కొత్త ఆరా కారుతో ఆ సెగ్మెంట్లో కూడా మంచి అమ్మకాలు సాధించగలమని ఆయన ధీమా వ్యక్తంచేశారు. బీఎస్ 6 పర్యావరణ నిబంధనలకు అనుగుణంగా ఈ కారును రూపొందించామని, పెట్రోల్, డీజిల్ వేరియంట్లలో ఇది లభ్యమవుతుందని చెప్పారాయన. ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్, వైర్లెస్ చార్జింగ్, డ్రైవర్ రియర్ వ్యూ మానిటర్, స్వెప్ట్‌బ్యాక్ ప్రొజెక్టర్ హెడ్‌ల్యాంప్స్, బూమరాంగ్ షేప్‌లో ఉండే ఎల్ఈడీ డే రన్నింగ్ లైట్స్ తదితర ఫీచర్లున్నాయని తెలియజేశారు. కాగా ఈ కారు ధర వివరాలను కంపెనీ వెల్లడించలేదు. అయితే రూ.6 లక్షల నుంచి రూ.9 లక్షల (ఎక్స్‌షోరూమ్ ధరలు) శ్రేణిలో ఉండొచ్చని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇక ఈ కారు మారుతీ డిజైర్, హోండా అమేజ్, ఫోక్స్‌వ్యాగన్ అమియో, ఫోర్డ్ ఆస్పైర్, టాటా టిగోర్, టొయోటా యారీలకు గట్టి పోటీనిస్తుందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.



## యమహా నుంచి 125 సీసీ స్కూటర్లు

- ఫ్యాసినో125ఎఫ్ఐ @ రూ.67,430
- 110 సీసీ స్కూటర్లకు మంగళం

**చెన్నై:** యమహా మోటార్ ఇండియా కంపెనీ 125 సీసీ స్కూటర్ సెగ్మెంట్లోకి ప్రవేశించింది. ఈ సెగ్మెంట్లో రెండు కొత్త మోడళ్లు– ఫ్యాసినో 125ఎఫ్ఐ, రేజర్125ఎఫ్ఐలను అందుబాటులోకి తెచ్చింది. ఫ్యాసినో స్కూటర్ ధరను రూ.67,430(ఎక్స్ షోరూమ్)గా నిర్ణయించామని కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (స్ట్రాటజీ అండ్ ప్లానింగ్ (గ్రూప్) రవీందర్ సింగ్ తెలిపారు. త్వరలో స్ట్రీట్ ర్యాలీ 125ఎఫ్ఐ మోడల్ స్కూటర్‌ను కూడా మార్కెట్లోకి తెస్తామని చెప్పారు. 110సీసీ స్కూటర్ మోడళ్లను దశలవారీగా మార్కెట్ నుంచి ఉపసంహరిస్తామని, భవిష్యత్తులో 125 సీసీ మోడళ్లను మాత్రమే విక్రయిస్తామని వివరించారు. ఈ ఏడాది 6.24 లక్షల టూవీలర్లను విక్రయిస్తామన్న అంచనాలున్నాయని సింగ్ చెప్పారు. వచ్చే ఏడాది 6.50 లక్షల టూవీలర్లను విక్రయించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు. ప్రస్తుతం 5 శాతంగా ఉన్న తమ మార్కెట్ వాటాను 2025కల్లా పది శాతానికి పెంచుకోవడం లక్ష్యమని వివరించారు. ఈ కార్యక్రమంలోనే ఎమ్15, ఆర్ 15 బైక్ మోడళ్లలో బీఎస్–సిక్స్ వేరియంట్లను కూడా కంపెనీ ఆవిష్కరించింది. ప్రస్తుత మందగమనం తాత్కాలికమేని, వాహన విక్రయాలు పుంజుకుంటాయని సింగ్ అభిప్రాయపడ్డారు.

## బ్రీఫ్స్...

**ఐసీఎస్ఐ:** కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రవేశపెట్టిన పౌరసత్వ చట్ట సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఆందోళనలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ నెల 20, 21 (శుక్ర, శనివారం) తేదీల్లో జరగాల్సిన ఎగ్జిక్యూటివ్, ప్రొఫెషనల్ ప్రోగ్రామ్‌ల పరీక్షలను ఐసీఎస్ఐ వాయిదా వేసింది. ఆ తరువాత తేదీల్లో జరగాల్సిన పరీక్షలను నిర్వహిస్తున్నామని, ఈ రెండు రోజుల పరీక్షల తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని వెల్లడించింది.

**ఐఎల్అండ్ఎఫ్ఎస్:** ఈ గ్రూప్‌నకు చెందిన విద్యా వ్యాపారం, స్కూల్‌నెట్ ఇండియాను కెరీర్ పాయింట్ పబ్లికేషన్స్‌కు విక్రయించడానికి ఆమోదం లభించింది. ఈ విక్రయానికి ఎన్‌సీఎల్‌టీ ఆమోదం పొందాల్సి ఉంది. ఈ డీల్ కారణంగా ఐఎల్అండ్ఎఫ్ఎస్ గ్రూప్ రుణభారం రూ.600 కోట్లమేర తగ్గుతుందని అంచనా.

## బులియన్ రూ.లలో

| | | | |
|---|---|---|---|
| **హైదరాబాద్** | | | |
| బంగారం (24 క్యారెట్లు) | 37,820 | | |
| బంగారం (22 క్యారెట్లు) | 36,040 | | |
| వెండి (కిలో) | 47,275 | | |
| **ప్రొద్దుటూరు** | | | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,750 | ▼ | 50 |
| బంగారం (22 క్యారెట్లు) | 35,920 | ▼ | 50 |
| వెండి (కిలో) | 45,400 | ▼ | 100 |
| **విశాఖపట్నం** | | | |
| బంగారం (24 క్యారెట్లు) | 39,000 | ▲ | 60 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,270 | ▲ | 50 |
| వెండి (కిలో) | 45,500 | ▲ | 500 |
| **ఏపీ బులియన్ అసోసియేషన్** | | | |
| బంగారం (24 క్యారెట్లు) | 39,240 | ▼ | 50 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,290 | ▼ | 50 |
| వెండి (కిలో) | 45,300 | | |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

## ముడిచమురు... (బ్యారెల్)

| | | |
|---|---|---|
| నైమెక్స్ లైట్ స్వీట్ | 61.09 (రాత్రి 11.30కు) | $ 60.85 (బుధవారం ముగింపు) |
| బ్రెంట్ | 66.42 (రాత్రి 11.30కు) | $ 66.17 (బుధవారం ముగింపు) |

## కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 20-12-2019

| | |
|---|---|
| విశాఖ | 470-00 |
| చిత్తూరు | 448-00 |
| వరంగల్ | 428-00 |
| విజయవాడ | 452-00 |
| గోదావరి | 452-00 |
| **19-12-2019 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 425-00 |

# మూడో రోజూ రికార్డ్ లాభాలు

- కొనసాగుతున్న ఆల్‌టైమ్‌హైలు
- ఇంట్రాడేలోనూ, ముగింపులోనూ కొత్త శిఖరాలకు సూచీలు
- 115 పాయింట్ల లాభంతో 41,674కు సెన్సెక్స్
- 38 పాయింట్లు పెరిగి 12,260కు నిఫ్టీ



దలాల్ స్ట్రీట్ ఆల్‌టైమ్ హై రికార్డ్‌లతో దద్దరిల్లుతోంది. ఇంధన, ఐటీ, వాహన షేర్ల జోరుతో గురువారం స్టాక్ మార్కెట్ లాభాల్లో ముగిసింది. విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు కొనసాగుతుండటం సానుకూల ప్రభావం చూపించింది. వరుసగా మూడో రోజూ సెన్సెక్స్, నిఫ్టీలు ఇంట్రాడేలోనూ, ముగింపులోనూ కొత్త రికార్డ్‌లను సృష్టించాయి. ఇంట్రాడేలో జీవిత కాల గరిష్ట స్థాయి, 41,719 పాయింట్లను తాకిన సెన్సెక్స్ చివరకు 115 పాయింట్ల లాభంతో 41,674 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ ఇంట్రాడేలో 12,268 పాయింట్ల వద్ద జీవిత కాల గరిష్ట స్థాయిని తాకింది. చివరకు 38 పాయింట్ల లాభంతో 12,260 పాయింట్ల వద్ద ముగిసింది. డాలర్‌తో రూపాయి మారకం బలహీనపడినా, ఎన్ఎస్ఈ వీక్లీ డెరివేటివ్స్ ముగింపు కారణంగా ఒడిదుడుకులు చోటు చేసుకున్నా, మార్కెట్ ముందుకే దూసుకుపోయింది.

### సూచీల రికార్డ్‌లు

| సూచీ | ఇంట్రాడే | ముగింపు (పాయింట్లు) |
|---|---|---|
| సెన్సెక్స్ | 41,719 | 41,674 |
| నిఫ్టీ | 12,268 | 12,260 |

### త్వరలో యూటీఐ ఏఎమ్‌సీ ఐపీఓ

ప్రముఖ మ్యూచువల్ ఫండ్ కంపెనీ, యూటీఐ ఏఎమ్‌సీ త్వరలో ఐపీఓ(ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్)కు రానున్నది. ఈ ఐపీఓ సైజు రూ.3,000 కోట్లుగా ఉండగలదని అంచనా.

### సెన్సెక్స్ @ 45,500

వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి సెన్సెక్స్ 45,500 పాయింట్లకు, నిఫ్టీ 13,400 పాయింట్లకు చేరతాయని కోటక్ సెక్యూరిటీస్ అంచనా వేస్తోంది. ఫార్మా, ఆగ్రో కెమికల్స్, ఆయిల్, గ్యాస్, కార్పొరేట్ బ్యాంక్‌లు, పెద్ద ఎన్‌బీఎఫ్‌సీ, హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీలు, మిడ్‌క్యాప్ సిమెంట్ కంపెనీలు, నిర్మాణ రంగ షేర్లు లాభపడతాయని పేర్కొంది.

# చర్చల్లో ప్రధానాంశం ఉల్లిపాయే!

**ఆర్‌బీఐ ద్రవ్య సమీక్షా సమావేశ మినిట్స్ వివరాలు వెల్లడి**



**న్యూఢిల్లీ:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఈ నెల మొదటి వారంలో మూడు (3–5 తేదీల మధ్య) రోజులు నిర్వహించిన ద్రవ్య, పరపతి సమీక్షా సమావేశ మినిట్స్ వివరాలు గురువారం వెల్లడయ్యాయి. భారీగా పెరిగిన ఉల్లి ధరలపైనే ఈ సమావేశంలో ప్రధానంగా చర్చ జరిగినట్లు మినిట్స్ వెల్లడించాయి. సెప్టెంబర్ నుంచీ ఉల్లి ధరలు తీవ్రంగా ఉన్నాయి. ప్రస్తుతం దేశంలోని పలు ప్రాంతాల్లో కేజీ ధర రూ.125 నుంచి రూ.150 వరకూ పలుకుతోంది. 2018 నవంబర్ ధరలతో పోల్చిచూస్తే, 2019 నవంబర్‌లో ఉల్లిపాయల ధర కేజీకి 175 శాతం పెరిగిందని స్వయంగా టోకు ధరల గణాంకాలు తెలిపాయి. టోకు ధర పెరుగుదల తీవ్రతే ఇంత ఉంటే, ఇక రిటైల్‌లో ఈ నిత్యావసర వస్తువు ధర పరిస్థితి ఊహించుకోవచ్చు. ఫిబ్రవరి నుంచీ వరుసగా ఐదు ద్వైమాసిక సమీక్షా సమావేశాల సందర్భంగా ఆర్‌బీఐ బ్యాంకులకు తానిచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీరేటు రెపో రేటును 135 బేసిస్ పాయింట్లు తగ్గించింది. దీనితో ఈ రేటు 5.15 శాతానికి దిగివచ్చింది. ఆర్థిక వృద్ధే లక్ష్యంగా తీసుకున్న ఈ నిర్ణయాలకు ధరలు కట్టడిలో ఉండడం ఊతం ఇచ్చింది. అయితే ఈ నెల మొదట్లో జరిగిన ద్వైమాసిక సమీక్షా సమావేశంలో మాత్రం రెపో రేటును యథాతథంగా ఉంచాలని ఆర్‌బీఐ నిర్ణయం తీసుకుంది. ధరల తీవ్రతే దీనికి ప్రధాన కారణం. ''సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో నిత్యావసరాల ధరల భారీగా పెరిగాయి. దేశంలోని పలు ప్రాంతాల్లో అకాల వర్షాల వల్ల ఖరీఫ్ పంట దెబ్బతినడం దీనికి కారణం'' అని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత్‌దాస్ పరపతి విధాన సమీక్షా సమావేశంలో పేర్కొన్నారు. గవర్నర్ నేతృత్వంలోని ద్రవ్య విధాన పరపతి సమీక్షా కమిటీలోని ఆరుగురు సభ్యులూ రెపో రేటు యథాతథ పరిస్థితికి ఓటు చేసిన సంగతి తెలిసిందే.

## బజాజ్ అలయంజ్ నుంచి సమగ్ర టర్మ్ ప్లాన్



**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** పిల్లల విద్యాభ్యాసం మొదలుకుని ప్రాణాంతకమైన 55 వ్యాధుల దాకా వివిధ అవసరాలకు అనుగుణంగా కవరేజీనిచ్చే వేరియంట్లతో ప్రైవేట్ రంగ జీవిత బీమా సంస్థ బజాజ్ అలయంజ్ లైఫ్ కొత్తగా సమగ్రమైన టర్మ్ ప్లాన్ ప్రవేశపెట్టింది. లైఫ్ స్మార్ట్ ప్రొటెక్ట్ గోల్ పేరిట ఆవిష్కరించిన ఈ ప్లాన్‌లో.. జీవిత భాగస్వామికి కూడా కవరేజీ పొందవచ్చు. కట్టిన ప్రీమియంలను కూడా తిరిగి పొందవచ్చు. ఇందుకు సంబంధించి మొత్తం నాలుగు వేరియంట్లలో ఈ ప్లాన్ లభిస్తుందని బజాజ్ అలయంజ్ లైఫ్ చీఫ్ డిస్ట్రిబ్యూషన్ ఆఫీసర్ (ఇనిస్టిట్యూషనల్) ధీరజ్ సెహ్‌గల్ గురువారమిక్కడ తెలిపారు. రూ. 1 కోటి పాలసీ తీసుకునే పాతికేళ్ల వ్యక్తికి ప్రీమియం అత్యంత తక్కువగా రోజుకు రూ. 13 నుంచి ఉంటుందని ఆయన తెలిపారు. లైఫ్ కవర్, లైఫ్ కవర్ విత్ చైల్డ్ ఎడ్యుకేషన్ ఎక్స్‌ట్రా కవర్ (సీఈఈసీ) వంటి వేరియంట్లలో ఈ పాలసీ లభిస్తుందని సెహ్‌గల్ చెప్పారు.

## బజాజ్ ఫైనాన్స్ స్వాధీనంలోకి 'కార్వీ డేటా' షేర్లు

**న్యూఢిల్లీ:** కార్వీ గ్రూప్ సంస్థకి ఇచ్చిన రుణాలు రాబట్టుకునే క్రమంలో కార్వీ డేటా మేనేజ్‌మెంట్ సర్వీసెస్ (కేడీఎంఎస్ఎల్) తనఖా ఉంచిన 24 లక్షల షేర్లను స్వాధీనం చేసుకున్నట్లు బజాజ్ ఫైనాన్స్ వెల్లడించింది. ఇది కేడీఎంఎస్ఎల్ పెయిడప్ క్యాపిటల్‌లో 10 శాతం వాటాకు సమానం. గ్రూప్ సంస్థ కార్వీ స్టాక్ బ్రోకింగ్ (కేఎస్‌బీఎల్) తీసుకున్న రుణాల కోసం కేడీఎంఎస్ఎల్ ఈ షేర్లను తనఖా ఉంచింది. వీటి ముఖ విలువ రూ. 10.



2008లో ఏర్పాటైన కేడీఎంఎస్ఎల్ సంస్థ .. ఐటీ సేవలు అందిస్తోంది. 2018–19లో కంపెనీ టర్నోవరు రూ. 1,274 కోట్లు.

## కోల్ మైనింగ్‌లోకి ఎన్ఎండీసీ

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** ఇనుప ఖనిజ ఉత్పత్తిలో ఉన్న ఎన్ఎండీసీ.. తాజాగా కోల్ మైనింగ్‌లోకి ప్రవేశిస్తోంది. కేంద్ర ప్రభుత్వం ఈ సంస్థకు జార్ఖండ్‌లో రెండు బొగ్గు గనులను కేటాయించింది. రోనె గనిలో 19.1 కోట్ల టన్నులు, టోకిసుడ్ నార్త్‌లో 5.2 కోట్ల టన్నుల బొగ్గు నిక్షేపాలు ఉన్నట్టు కంపెనీ తెలిపింది.

## కెంట్ నుంచి జీరో వాటర్ వేస్ట్ ఆర్ఓ

**బెంగళూరు:** ప్రముఖ వాటర్ ప్యూరిఫయర్ల తయారీ సంస్థ 'కెంట్ ఆర్ఓ సిస్టమ్స్'.. తాజాగా 'జీరో వాటర్ వేస్టేజ్' పేరిట ఒక్క చుక్క నీరు కూడా వృధా కాని రివర్స్ ఓస్మోసిస్ (ఆర్ఓ)ను మార్కెట్లోకి విడుదల చేసింది. సాధారణ ఆర్ఓలో నాలుగు గ్లాసుల నీటికి కేవలం ఒక్క గ్లాసు మాత్రమే శుద్ధమైన మంచి నీరు వస్తుందని, ఈ నూతన ప్యూరిఫయర్‌లో తొలుత రెండు గ్లాసులు స్వచ్ఛమైన నీరు వచ్చి ఆ తరువాత మిగిలిన నీరు మళ్లీ ప్యూరిఫై అవుతుందని సంస్థ సీఎండీ మహేష్ గుప్తా అన్నారు. నూతన టెక్నాలజీలో రికవరీ రేటు 50 శాతం పెరినట్లు వివరించారు. దేశవ్యాప్తంగా 21 నగరాల్లోని మంచి నీటి స్వచ్ఛతపై బీఐఎస్ నిర్వహించిన శాంపిల్స్ పరీక్షలో 15 నగరాల్లో నీరు నేరుగా తాగేందుకు అవకాశం లేని విధంగా ఉందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ నూతన ఆర్ఓ రసాయనాలు, బ్యాక్టీరియా, వైరస్, లవణాలు వంటి కరిగిన మలినాలను కూడా తొలగిస్తుంది.. నీటిని 100% స్వచ్ఛంగా చేస్తుందని చెప్పారు.



## మైక్రో ఫైనాన్స్ వృద్ధికి భారీ అవకాశాలు: కేపీఎంజీ



**కోల్‌కతా:** దేశంలో సూక్ష్మ రుణ వ్యాపార వృద్ధికి భారీ అవకాశాలు ఉన్నాయని కేపీఎంజీ సంస్థ తెలిపింది. గత ఐదేళ్లలో వార్షికంగా 48 శాతం చొప్పున సూక్ష్మ రుణ వ్యాపార రంగం వృద్ధి చెందినట్టు ఓ నివేదికలో పేర్కొంది. విస్తరణకు ఉన్న అవకాశాల్లో ఇప్పటి వరకు ఈ మార్కెట్ పావు శాతమే చేరుకుందని, దీంతో భవిష్యత్తు వృద్ధికి మంచి అవకాశాలున్నాయని వివరించింది. దేశంలోని తూర్పు, ఈశాన్య ప్రాంతాలు 35 శాతం వాటాతో ఈ రంగంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నట్టు పేర్కొంది. ఈ రంగంలోని ఎన్నో కంపెనీలు టెక్నాలజీలను అందిపుచ్చుకోవడం, ఫిన్‌టెక్ సంస్థలతో సహకారం వంటివి గత ఐదేళ్లలో వృద్ధికి తోడ్పడినట్టు తెలిపింది.

## షాపూర్‌జీ-అలియాంజ్ చేతికి వేవ్‌రాక్



**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** భాగ్యనగర రియల్టీ రంగంలో అతిపెద్ద డీల్ నమోదైంది. నానక్‌రామ్‌గూడలోని ఐటీ సెజ్ వేవ్‌రాక్‌ను టిష్‌మన్ స్పేయర్, జీఐసీల నుంచి షాపూర్‌జీ పల్లోంజీ రియల్ ఎస్టేట్ ఫండ్ (ఎస్‌పీఆర్ఈఎఫ్ 2) కొనుగోలు చేసింది. ఈ డీల్ విలువ సుమారు రూ.1,800 కోట్లు. 12 ఎకరాల్లో 23 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో వేవ్‌రాక్ విస్తరించింది. ఆపిల్, డీబీఎస్, డ్యూపాంట్, యాక్సెంచర్ వంటి దిగ్గజ సంస్థలు ఇక్కడ కొలువుదీరాయి. అలియాంజ్, షాపూర్‌జీ పల్లోంజీల జేవీయే ఎస్‌పీఆర్ఈఎఫ్–2. విక్రేతల తరఫున జేఎల్ఎల్ మధ్యవర్తిగా వ్యవహరించింది.

# పాస్‌వర్డ్‌లు చోరీ అయ్యాయి.. జాగ్రత్త

**భారత్‌లో యూజర్లను అప్రమత్తం చేసిన గూగుల్**



**న్యూఢిల్లీ:** నిర్దిష్ట వెబ్‌సైట్లను ఉపయోగించే వారి పాస్‌వర్డ్‌లు చోరీకి గురై ఉంటాయని, వాటిని తక్షణమే మార్చుకోవాలని భారత్‌లోని యూజర్లను టెక్ దిగ్గజం గూగుల్ అప్రమత్తం చేసింది. మీడియా సంస్థలు మొదలుకుని సామాన్య యూజర్ల దాకా చాలా మంది ల్యాప్‌టాప్‌లు, డెస్క్‌టాప్‌లు, మొబైల్ స్క్రీన్‌లపై గురువారం ఈ మేరకు నోటిఫికేషన్లు ప్రత్యక్షమయ్యాయి. డేటా లీకేజీ కారణంగా పాస్‌వర్డ్‌లు చోరీకి గురై ఉంటాయని వీటిల్లో గూగుల్ పేర్కొంది. ఆహారోత్పత్తులు విక్రయించే ఫ్రెష్‌హోమ్ అనే ఈ–కామర్స్ పోర్టల్‌లోకి లాగిన్ అయ్యేందుకు ప్రయత్నించగా వార్నింగ్ పాప్ అప్ వచ్చినట్లు ఓ యూజరు వెల్లడించారు. అలాగే తమ గ్రూప్‌నకు చెందిన ఓ పోర్టల్‌లో లాగిన్ అయ్యే క్రమంలో ఇలాంటి నోటిఫికేషన్ ప్రత్యక్షమైనట్లు ఓ మీడియా సంస్థ వర్గాలు తెలిపాయి. క్రోమ్ 79లో బగ్‌ను గూగుల్ అతికష్టం మీద సరిచేయగా ఇంతలోనే మళ్లీ పాస్‌వర్డ్‌ల చోరీ అలర్ట్‌లు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. పాస్‌వర్డ్‌లకు మరింత భద్రత కల్పించే విధంగా క్రోమ్ 79 బ్రౌజరును గూగుల్ తీర్చిదిద్దింది.

## నాటా వేడుకలకు సీఎంకు ఆహ్వానం



**సాక్షి,అమరావతి:** వచ్చే ఏడాది జూన్‌లో జరగనున్న ఉత్తర అమెరికా తెలుగు అసోసియేషన్ వేడుకలకు హాజరుకావాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నాటా సభ్యులు ఆహ్వానించారు. గురువారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో నాటా అధ్యక్షుడు డాక్టర్ రాఘవరెడ్డి, కార్యదర్శి ఆళ్ల రామిరెడ్డి, కోశాధికారి జి.నారాయణరెడ్డి, పీఆర్‌వో డీవీ కోటిరెడ్డి సీఎంను కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు.

## ముస్లిం సోదరులూ.. భయపడవద్దు

- ఎన్ఆర్‌సీని వైఎస్సార్‌సీపీ వ్యతిరేకిస్తుంది
- ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా భరోసా
- ముస్లింలకు అన్యాయం జరిగే పక్షంలో సీఎం వైఎస్ జగన్ చూస్తూ ఊరుకోరు



**సాక్షి, అమరావతి:** కేంద్రం తీసుకొస్తున్న ఎన్ఆర్‌సీ వల్ల రాష్ట్రంలోని ఏ ఒక్క ముస్లింకూ అన్యాయం జరగదని, అలా జరిగే పక్షంలో సీఎం వైఎస్ జగన్ చూస్తూ ఊరుకోరని ఉప ముఖ్యమంత్రి షేక్ బేపారి అంజాద్ బాషా భరోసా ఇచ్చారు. వైఎస్సార్ కాంగ్రెస్ నేతగా, ఉప ముఖ్యమంత్రిగా, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రిగా చెబుతున్న ఈ మాటలు తన వ్యక్తిగతం కాదని.. రాష్ట్ర ప్రభుత్వం తరఫున చెబుతున్నానని చెప్పారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్‌తో కలిసి అంజాద్ బాషా మాట్లాడారు. నమ్ముకున్న వారిని వైఎస్సార్ కుటుంబం గుండెల్లో పెట్టుకు చూసుకుంటుందన్నారు. వైఎస్ జగన్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం మైనారిటీల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు తీసుకువస్తోందన్నారు. సిటిజన్‌షిప్ అమెండ్‌మెంట్ యాక్ట్ (సీఏఏ), ఎన్ఆర్‌సీ వేరు వేరని, చాలా మంది ముస్లిం సోదరులకు అవగాహన లేనందున ఈ రెండింటినీ ముడిపెట్టి మాట్లాడుతున్నారని చెప్పారు. సీఏఏతో భారత్‌లోని ముస్లింలకు అన్యాయం జరగదని కేంద్రం మాట ఇచ్చిందని, ముస్లింలకు అన్యాయం జరగదని తెలిశాకే వైఎస్సార్‌సీపీ మద్దతు ఇచ్చిందని చెప్పారు. తొలుత ఎన్ఆర్‌సీ అమలు జరిగితేనే సీఏఏ గురించి మాట్లాడుకోవచ్చన్నారు. ప్రజల్లో ఈ అంశాలపై నెలకొన్న అపోహలను నివృత్తి చేయాలనే ఉద్దేశంతోనే గురువారం పార్టీ పెద్దలు, మైనారిటీలతో సమావేశం ఏర్పాటు చేసి చర్చించారని వివరించారు. రాబోయే రోజుల్లో అన్ని ఫార్మాట్‌లలో కూడా ఎన్ఆర్‌సీని వ్యతిరేకిస్తామని, ఏపీలో దానిని అమలు పరిచేందుకు ఎట్టి పరిస్థితులోను ఒప్పుకోబోమని తెలిపారు. ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ మాట్లాడుతూ..ఎన్ఆర్‌సీ బిల్లు ముస్లింలకు ఇబ్బందికరంగా ఉంటుందంటే తాము తప్పక వ్యతిరేకిస్తామని, నిరసన పోరాటాలు చేస్తామన్నారు. దేశంలోని ఏ ముస్లింకు సీఏఏతో ఎలాంటి ఇబ్బంది లేదు కాబట్టే సహకరించామన్నారు.

## దిశ చట్టం అమలుకు పటిష్ట చర్యలు

**ఉన్నతస్థాయి సమీక్షలో సీఎస్ నీలం సాహ్ని**

**సాక్షి, అమరావతి:** మహిళలు, చిన్నారులపై జరిగే అకృత్యాలను అరికట్టేందుకు నూతనంగా తీసుకొచ్చిన 'ఏపీ దిశ' చట్టాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు అవసరమైన అన్ని చర్యలను ప్రభుత్వం తీసుకోనుందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్ని తెలిపారు. దిశ చట్టం నేపథ్యంలో తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై సీఎస్ గురువారం సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. దిశ లాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఈ చట్టంపై ప్రజల్లో అవగాహనను పెంపొందించేలా ప్రభుత్వ పరంగా అవసరమైన చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు.

### రక్షణ రంగ ఉత్పత్తుల తయారీలో

# ఏపీకి ఉజ్వల భవిత

**హైదరాబాద్‌లో యూఎస్ కాన్సుల్ జనరల్ రీఫ్‌మన్**



మాట్లాడుతున్న మంత్రి మేకపాటి గౌతంరెడ్డి. చిత్రంలో రీఫ్‌మన్

**సాక్షి, హైదరాబాద్ :** రక్షణ రంగ ఉత్పత్తుల తయారీలో ఏపీకి మంచి భవిష్యత్తు ఉందని హైదరాబాద్‌లో అమెరికా కాన్సుల్ జనరల్ జోయల్ రీఫ్‌మన్ అన్నారు. రెండు రోజులుగా హైదరాబాద్‌లో జరుగుతున్న అమెరికా భారత్ రక్షణ సంబంధాల అంతర్జాతీయ సదస్సులో భాగంగా ఢిల్లీ రాయబార కార్యాలయ అధికారి కెప్టెన్ డేనియల్ ఇ ఫిలియన్, ఏపీ ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి మేకపాటి గౌతంరెడ్డితో కలిసి గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇటీవల విశాఖపట్నంలో అమెరికా, భారత్ త్రివిధ సైనిక దళాలు ప్రదర్శించిన సైనిక విన్యాసాలు రక్షణ రంగంలో ఏపీ సామర్థ్యానికి అద్దం పట్టాయన్నారు. ఏపీ, తెలంగాణలతో అత్యున్నత రక్షణ సాంకేతిక సహకార బంధం ఏర్పరుచుకునేందుకు పలు అమెరికన్ కంపెనీలు ఆసక్తితో ఉన్నాయన్నారు. భౌగోళికంగా చూస్తే.. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ రంగంలో రెండు తెలుగు రాష్ట్రాలకు అనేక అనుకూలతలున్నాయని తెలిపారు. అమెరికా విద్యాసంస్థల్లో చదివే భారతీయ విద్యార్థులను ప్రోత్సహించేందుకు వీసాల జారీని కొనసాగించడంతో పాటు, భవిష్యత్తులో వాటి సంఖ్యను కూడా పెంచుతామని చెప్పారు. తాజాగా అమెరికా, భారత్ నడుమ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఒప్పందానికి రెండు దేశాలు తుది రూపునిచ్చినట్టు తెలిపారు. దీని మూలంగా రెండు దేశాల రక్షణ మంత్రిత్వ శాఖల మధ్య కీలకమైన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ బదిలీతో పాటు.. భాగస్వామ్య ఒప్పందాలకు మార్గం సుగమం చేస్తుందని రీఫ్‌మన్ వెల్లడించారు.

**ఇంగ్లిష్‌మీడియం నిర్ణయం భేష్**

ప్రాథమిక పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంలో విద్యాబోధనను తప్పనిసరిచేస్తూ ఏపీ ప్రభుత్వం చట్టం చేయడాన్ని రీఫ్‌మన్ స్వాగతించారు. అంతర్జాతీయంగా సాంకేతికత, ఇతర అంశాల్లో ఇంగ్లిష్‌కు అత్యంత ప్రాధాన్యం ఉందని, విద్యార్థులకు బాల్యం నుంచి ఇంగ్లిష్‌ను నేర్పించడం ద్వారా వివిధ అంశాల్లో ప్రావీణ్యం సాధించేందుకు ఉపయోగపడుతుందన్నారు.

## ఈఎస్ఐ ద్వారా దేశంలో 3.50 కోట్ల మందికి లబ్ధి

- ఏపీ ముఖ్యమంత్రి జగన్ చిత్తశుద్ధితో పనిచేస్తున్నారు
- కేంద్ర కార్మిక, ఉపాధి కల్పనశాఖ మంత్రి సంతోష్ కుమార్ గంగ్వార్

**విజయనగరం ఫోర్ట్:** కార్మిక రాజ్య బీమా సంస్థ (ఈఎస్ఐ) ద్వారా దేశంలో 3.50 కోట్ల మంది కార్మికులు లబ్ధి పొందుతున్నారని కేంద్ర కార్మిక, ఉపాధి కల్పనశాఖ మంత్రి సంతోష్ కుమార్ గంగ్వార్ అన్నారు. విజయనగరం జిల్లా గాజులరేగ ప్రాంతంలో ఏయూ క్యాంపస్ ఎదురుగా నిర్మించనున్న 100 పడకల ఈఎస్ఐ ఆస్పత్రికి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని ప్రశంసించారు. రాష్ట్ర కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణాన్ని రూ.75 కోట్లతో రెండు సంవత్సరాల్లో పూర్తి చేయనున్నట్టు చెప్పారు. విశాఖ ఈఎస్ఐ ఆస్పత్రిని 500 పడకల స్థాయికి పెంచనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి, మంత్రి బొత్స సత్యనారాయణ, ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యేలు కోలగట్ల వీరభద్రస్వామి, బడ్డుకొండ అప్పలనాయుడు పాల్గొన్నారు.

### దేశ ఆర్థిక వ్యవస్థలో

# ఏపీ వాటాను పెంచుతాం

- రక్షణ రంగ ఉత్పత్తుల తయారీని ప్రోత్సహించేందుకు డిఫెన్స్ కారిడార్లు
- భారత్ అమెరికా రక్షణ సంబంధాల సదస్సులో మంత్రి మేకపాటి గౌతంరెడ్డి

**సాక్షి, హైదరాబాద్:** భారత ఆర్థిక వ్యవస్థలో ఆంధ్రప్రదేశ్ వాటాను రానున్న రెండేళ్లలో మూడింతలు పెంచడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతంరెడ్డి చెప్పారు. భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్న ఎనిమిది రాష్ట్రాల జాబితాలో ఏపీ కూడా ఉందన్నారు. హైదరాబాద్‌లో రెండు రోజులుగా జరుగుతున్న భారత్, అమెరికా రక్షణ సంబంధాల అంతర్జాతీయ సదస్సులో గురువారం ఆయన ప్రసంగించారు. ఏపీ ఆర్థిక వ్యవస్థను పురోభివృద్ధి బాటలో నడిపేందుకు రూపొందిస్తున్న రోడ్‌మ్యాప్‌లో భాగంగా ఆర్థికాభివృద్ధికి దోహదం చేసే రంగాలు, అంశాలను గుర్తించినట్టు తెలిపారు. రక్షణ రంగానికి సంబంధించి రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్న డిఫెన్స్ కారిడార్లు రాష్ట్రాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తాయని గుర్తించామన్నారు. భారతీయ సైనిక బలగాలు, నౌకాదళంతో ఏపీ ఇప్పటికే పలు ఒప్పందాలు కుదుర్చుకుందని, రామాయపట్నం పోర్టులో నేవీ బేస్, దొనకొండలో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ ఏర్పాటు తదితరాలను గౌతంరెడ్డి ఉదహరించారు. సబ్‌మెరైన్, ఎయిర్‌క్రాఫ్ట్ బేస్, ఆఫ్‌షోర్ రిజర్వ్ తదితరాలతో ఇప్పటికే విశాఖ పారిశ్రామిక, సైనిక కేంద్రంగా ఉందన్నారు.

**రక్షణ రంగ ఉత్పత్తుల తయారీకి ప్రోత్సాహం**

అంతర్జాతీయంగా చోటు చేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో హిందూ మహాసముద్రంలో దేశ తూర్పు తీరం కీలక పాత్ర పోషించనుందని.. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో రక్షణ రంగ ఉత్పత్తుల తయారీ (డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్)ని ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అమెరికా, భారత్ మధ్య జరుగుతున్న రక్షణ ఒప్పందాల నేపథ్యంలో ఏపీకి చెందిన కాంట్రాక్టర్లు, సబ్ కాంట్రాక్టర్లు 'సప్లయ్ చెయిన్ మేనేజ్‌మెంట్'లో కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు. రక్షణ రంగ ఉత్పత్తులకు సంబంధించి ఇప్పటికే ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ మాన్యుఫ్యాక్చరింగ్(ఓఈఎం) సంస్థలతో సంప్రదింపులు జరుపుతూ ఒప్పందాల కోసం ప్రయత్నిస్తున్నట్టు వెల్లడించారు. ఏపీ రూపొందించే పారిశ్రామిక విధానంలో డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ రంగానికి ప్రాధాన్యమిస్తూ డిఫెన్స్ క్లస్టర్ల ఏర్పాటు ద్వారా ఓఈఎంలకు ఉత్పత్తి సదుపాయాలను కల్పిస్తామన్నారు. ఈ రంగంలో స్టార్టప్ కంపెనీలను ప్రోత్సహిస్తామని గౌతంరెడ్డి వెల్లడించారు. మానవ రహిత విమానాల(యూఏవీ) కోసం ప్రత్యేక పాలసీ సిద్ధం చేస్తున్నామన్నారు. ఎక్కువ ఉద్యోగాలు, పెట్టుబడులతో రాష్ట్రానికి సహకరించాల్సిందిగా వ్యాపార, వాణిజ్యవేత్తలకు ఆయన పిలుపునిచ్చారు. విశాఖను ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్ చేస్తామన్న సీఎం వైఎస్ జగన్ నిర్ణయంతో విశాఖ కేంద్రంగా ఆర్థిక విప్లవం వస్తుందని గౌతంరెడ్డి వెల్లడించారు.

## సత్వర సేవలే రైతు భరోసా కేంద్రాల లక్ష్యం

**మంత్రులు కొడాలి నాని, మోపిదేవి, కన్నబాబు**




**సాక్షి, అమరావతి:** రైతులకు సకాలంలో సేవలు అందించడానికే రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు మంత్రులు కన్నబాబు, మోపిదేవి వెంకట రమణారావు, కొడాలి నాని చెప్పారు. రైతు భరోసా కేంద్రాలపై గురువారం సచివాలయంలో వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్థక, పౌరసరఫరాల శాఖలు సంయుక్తంగా నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయా శాఖల మంత్రులు ప్రసంగించారు. రైతు భరోసా కేంద్రాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏ ఉద్దేశంతో ఏర్పాటు చేస్తున్నారో ఆ లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. అనుబంధ శాఖల సమన్వయంతో రైతులకు సకాలంలో సేవలు అందించడానికి రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు వ్యవసాయ మంత్రి కన్నబాబు చెప్పారు. ఈ కేంద్రాల విధివిధానాలను, ప్రభుత్వ లక్ష్యాలను వివరించారు. కల్తీలు, నకిలీలను నిరోధించేలా నియోజకవర్గ ల్యాబ్‌లలో నిర్ధారించిన విత్తనాలు, ఎరువులను మాత్రమే ఈ కేంద్రాలలో విక్రయించాలన్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి 11,158 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. క్షేత్రస్థాయిలో రైతులకు ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేలా అధికారులు సన్నద్ధం కావాలన్నారు. మంత్రి మోపిదేవి మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాలలో వ్యవసాయం, అనుబంధ రంగాలకు చెందిన అన్ని పథకాల ఫలాలు రైతులకు అందాలని, ఆ బాధ్యత అధికారులదేనని చెప్పారు. మంత్రి కొడాలి నాని మాట్లాడుతూ ధాన్యాన్ని అమ్ముకోవడంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా 1,300 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్, ఉద్యాన శాఖ కమిషనర్ చిరంజీవి చౌదరీ, పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులు, జాయింట్ డైరెక్టరు, ఇతర సిబ్బంది ఈ సమావేశానికి హాజరయ్యారు.

## ఇజ్రాయేల్‌లో ఇద్దరు తెలుగువారి అదృశ్యం



అదృశ్యమైన శ్రీనివాసరావు

**సంతబొమ్మాళి (శ్రీకాకుళం జిల్లా):** ఇజ్రాయేల్ దేశానికి విహార యాత్రకు వెళ్లిన ఇద్దరు తెలుగు వారు ఐదు రోజుల క్రితం అదృశ్యమయ్యారు. ఈనెల 20తో వారి వీసా గడువు ముగియనుండడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం గొలుగువానిపేటకు చెందిన గొల్ల శ్రీనివాసరావు (35), తూర్పుగోదావరి జిల్లా కాకినాడకు చెందిన తరుణ్ కుమార్‌తోపాటు 43మంది టూరిస్ట్ వీసాతో ఇజ్రాయేల్ వెళ్లారు. ముంబైకి చెందిన కేసరి టూర్స్ ద్వారా ఈనెల 8వ తేదీ రాత్రి ముంబైలో విమానం ఎక్కారు. ఈ నెల 13 వరకు జోర్డాన్ పరిసర ప్రాంతాల్లో తిరిగి 14న ఇజ్రాయేల్ చేరుకున్నారు. ఆ రోజు రాత్రి అందరితోపాటు భోజనం చేసిన తరువాత శ్రీనివాసరావు, తరుణ్ వారి గదులకు వెళ్లారు. మరుసటి రోజు ఉదయం యాత్రకు రాకపోవడంతో ట్రావెల్ సిబ్బంది వారుంటున్న గదులను పరిశీలించారు. అక్కడ లేకపోవడం, ఎటువంటి సమాచారం ఇవ్వకపోవడంతో ఎక్కడికో వెళ్లి ఉంటారనుకొని ఎదురుచూశారు. ఫలితం లేకపోవడంతో 16న అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై శ్రీకాకుళం జిల్లా గొలుగువానిపేటలో ఉంటున్న బాధితుడు శ్రీనివాసరావు భార్య రాజులమ్మకు టూరిస్ట్ ఏజెంట్ సమాచారమివ్వడంతో ఆమె గురువారం సంతబొమ్మాళి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# సచివాలయాల్లో కొత్త బియ్యం కార్డుల జాబితా

## నేటి నుంచి 3 రోజుల పాటు ప్రదర్శన

**పాత కార్డులతో పాటు అర్హులైన కొత్తవారికి కార్డుల జారీ**

**కార్డుల ప్రింటింగ్ కోసం 4 రోజుల్లోగా టెండర్లు**

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో అర్హులందరికీ బియ్యం కార్డులు జారీ చేసేందుకు జాబితా సిద్ధమైంది. ఇందుకు సంబంధించి అర్హుల జాబితాను శుక్రవారం నుంచి మూడ్రోజుల పాటు గ్రామ, వార్డు సచివాలయాల్లోని నోటీసు బోర్డుల్లో అందుబాటులో ఉంచనున్నారు. వైఎస్సార్ నవశకంలో భాగంగా ప్రతి పథకానికి వేర్వేరు కార్డులు జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న 1.47 కోట్ల తెల్ల రేషన్‌కార్డులతో పాటు అర్హత ఉండి కార్డులేని వారికి ప్రభుత్వం కొత్తగా బియ్యం కార్డులు జారీ చేస్తోంది. వీటిని జనవరిలో అందచేస్తారు. బియ్యం కార్డుల ప్రింటింగ్ కోసం నాలుగు రోజుల్లో టెండర్లు పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ. 20 కోట్లు మంజూరు చేసింది.




### కొత్త బియ్యం

### కార్డుకు అర్హతలివే..

ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో నెలకు రూ. 10 వేలు, పట్టణాల్లో రూ. 12 వేలలోపు ఆదాయం ఉన్న వారికి కార్డులు జారీ చేస్తున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రాంతాల్లో నెలకు రూ. 5 వేల లోపు, పట్టణ ప్రాంతాల్లో రూ.6,250 లోపు ఆదాయం ఉన్న వారికి రేషన్ కార్డు అందేది. గతంలో 2.5 ఎకరాల్లోపు మాగాణి లేదా ఐదెకరాల్లోపు మెట్ట ఉన్నవారు రేషన్ కార్డుకు అర్హులు కాగా.. ఇప్పుడు మూడెకరాల మాగాణి లేదా పదెకరాల్లోపు మెట్ట ఉన్నవారికి, లేదా రెండూ కలిపి పదెకరాల్లోపు ఉన్న వారిని అర్హులుగా గుర్తిస్తున్నారు. గతంలో 200 యూనిట్ల కంటే తక్కువ విద్యుత్ వినియోగిస్తే అర్హులు కాగా.. ప్రస్తుతం దీనిని 300 యూనిట్లకు పెంచారు. ప్రభుత్వ ఉద్యోగులుగా ఉన్న పారిశుధ్య కార్మికులకు ప్రస్తుత ప్రభుత్వం బియ్యం కార్డులు ఇస్తోంది. టీడీపీ హయాంలో ట్యాక్సీలు మినహా 4 చక్రాల వాహనాలు ఏవి ఉన్నా రేషన్ కార్డులకు అనర్హులు. ఇప్పుడు ట్యాక్సీతో పాటు ఆటోలు, ట్రాక్టర్లు ఉన్న వారికీ ఈ పథకం వర్తిస్తుంది. బియ్యం కార్డు పొందేందుకు అర్హులు కార్యాలయాల చుట్టూ తిరగకుండా గ్రామ, వార్డు వలంటీర్లే ఇంటింటికీ వెళ్లి దరఖాస్తులు స్వీకరించారు.

### మళ్లీ దరఖాస్తులు స్వీకరిస్తాం

అర్హుల పేర్లు జాబితాలో లేకపోతే ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వారు మరోసారి దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఇస్తాం. దరఖాస్తులు గ్రామ, వార్డు వలంటీర్‌కు లేదా సచివాలయాల్లో ఇస్తే మరోసారి క్షేత్ర స్థాయిలో తనిఖీ చేసి అర్హతుంటే కార్డు జారీ చేస్తాం.

**–కోన శశిధర్, ఎక్స్ అఫీషియో కార్యదర్శి, పౌరసరఫరాల శాఖ**






## ఇసుక అక్రమ తవ్వకాలపై నివేదిక ఇవ్వండి: ఎన్జీటీ

**సాక్షి, న్యూఢిల్లీ:** ఆంధ్రప్రదేశ్‌లో ఇసుక అక్రమ తవ్వకాలపై అధ్యయనం చేసి నెల రోజుల్లో నివేదిక సమర్పించాలని జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ) రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఏపీలో ఇసుక అక్రమ తవ్వకాలపై అనుమోలు గాంధీ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన ఎన్జీటీ ఈ ఆదేశాలు జారీచేసింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 14 కు వాయిదా వేసింది.

## ఎస్సీల సంక్షేమం, అభివృద్ధి మా బాధ్యత

**ఈడీల సమావేశంలో మాల, మాదిగ, రెల్లి కార్పొరేషన్ల చైర్మన్లు**

**సాక్షి, అమరావతి:** ఎస్సీల్లోని మాల, మాదిగ, రెల్లి తదితర కులాల అభివృద్ధి, సంక్షేమం తమ బాధ్యత అని మాల కార్పొరేషన్ చైర్మన్ అమ్మాజీ, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు, రెల్లి ఇతర కులాల కార్పొరేషన్ చైర్మన్ వడ్డేటి మధుసూదన్‌రావు అన్నారు. తాడేపల్లిలోని మాల, మాదిగ, రెల్లి ఇతర కులాల కార్పొరేషన్ల కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన జిల్లా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఈడీ)ల సమావేశానికి వారు అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సీల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కట్టుబడి ఉన్నారని, అందుకే మూడు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఆయా వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ కింద ఉన్న ఆస్తులను కాపాడేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్సీ కార్పొరేషన్‌ను మూడు కార్పొరేషన్లుగా విభజించాక కొత్తగా నియమితులైన కార్పొరేషన్ల చైర్మన్లను ఈడీలు సన్మానించారు.












## బొగ్గు కుంభకోణంలో సీబీఐ దాడులు

**కంపెనీ డైరెక్టర్లలో ఏపీ, తెలంగాణ మాజీ ఎంపీలు**

**సాక్షి, హైదరాబాద్:** నాగ్‌పూర్‌లో వెలుగుచూసిన బొగ్గు కుంభకోణానికి సంబంధించి సికింద్రాబాద్‌లో సీబీఐ దాడులు నిర్వహించింది. ఎస్డీ రోడ్‌లోని సూర్యలక్ష్మి కాటన్ మిల్స్ (ఎస్‌సీఎమ్‌ఎల్) ప్రధాన కార్యాలయంలో, నాగ్‌పూర్‌లోని రాంతెక్ శాఖ కార్యాలయంలో సీబీఐ అధికారులు ఏకకాలంలో దాడులు నిర్వహించారు. సూర్యలక్ష్మి కాటన్ మిల్స్ ప్రధానంగా యార్న్, డెనిమ్ వస్త్రాలను ఉత్పత్తి చేస్తుంది. ఎస్‌సీఎమ్‌ఎల్ నాగ్‌పూర్‌లోని రాంతెక్ కాటన్ మిల్లు కోసం 2008లో వెస్ట్రన్ కోల్‌ఫీల్డ్ లిమిటెడ్ (డబ్ల్యూసీఎల్)తో ఒప్పందం చేసుకుంది. 2014 వరకు 4,968 టన్నుల బొగ్గును సరఫరా చేసేందుకు ఒప్పందం చేసుకుంది. అపుడు ఎలాంటి అవతకవకలు చోటు చేసుకోలేదు. మొదటి ఒప్పందం ముగియగానే 2014 సెప్టెంబర్‌లో మరోసారి వెస్ట్రన్ కోల్‌ఫీల్డ్ లిమిటెడ్‌తో 1,13,000 మెట్రిక్ టన్నుల బొగ్గు సరఫరా కోసం ఒప్పందం చేసుకుంది. సూర్యలక్ష్మి కంపెనీకి ఈ సమయంలో తాము సరఫరా చేసిన బొగ్గును బహిరంగ మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకున్నారని వెస్ట్రన్ కోల్‌ఫీల్డ్ లిమిటెడ్ అంతర్గత విచారణలో తేలింది. దీనిపై వేసిన విచారణ కమిటీ కూడా ఇదే విషయాన్ని నిర్ధారించింది. అదనపు బొగ్గును బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు విక్రయించి భారీగా సొమ్ము చేసుకున్నారని సీబీఐ ఆరోపిస్తోంది. ఈ మేరకు ఎస్‌సీఎమ్‌ఎల్ కంపెనీ, చైర్మన్ ఎల్.ఎన్ అగర్వాల్, ఎండీ పరితోష్ అగర్వాల్, గుర్తు తెలియని వెస్ట్రన్ కోల్ ఫీల్డ్ లిమిటెడ్ ఉద్యోగులపై సీబీఐ చీటింగ్ కేసు నమోదు చేసింది. ఈ కంపెనీలో తెలంగాణకు చెందిన ఓ మాజీ ఎంపీ, ఆంధ్రకు చెందిన ఓ మాజీ ఎంపీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లుగా ఉండటం గమనార్హం.

## ఒడిశాలో మృగాడికి మరణశిక్ష

**మూడేళ్ల చిన్నారిపై హత్యాచార కేసులో తీర్పు వెల్లడి**

**భువనేశ్వర్:** మూడేళ్ల చిన్నారిపై లైంగికదాడికి పాల్పడి, హత్య చేసిన నిందితుడికి న్యాయస్థానం మరణశిక్ష విధించింది. ఒడిశాలోని కెంజొహార్ అదనపు జిల్లా మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి ఈ తీర్పు వెలువరించారు. 2017లో సునీల్ నాయక్ ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. పోక్సో చట్టం కింద 28 మంది సాక్షులను విచారించిన అనంతరం నిందితుడికి మరణశిక్ష ఖరారు చేసినట్లు న్యాయమూర్తి లోక్‌నాథ్ సాహు తెలిపారు. నిందితుడు సునీల్ మూడేళ్ల బాలికపై నిర్మానుష్య ప్రాంతంలో లైంగికదాడికి పాల్పడి హత్యచేశాడు. బలవంతపు చర్య, షాక్‌తో చిన్నారి ప్రాణాలు కోల్పోయినట్లు పోస్టుమార్టంలో తేలింది.






Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP), and D. No. 5- 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503. Editor: V. Murali, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.